


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



ముట్టడిలో సమానత్వం.. ప్రమాదంలో ప్రజాస్వామ్యం... 06
108 ఏళ్ల నవంబర్ విప్లవం : కొత్త వ్యూహాల ఆవశ్యకత
పార్థ్ పవార్ భూ ఒప్పందంపై కుంభకోణంపై దర్యాప్తుకు ఆదేశం 05



సంపుటి 08, సంచిక: 336 | శుక్రవారం | 07-11-2025 | కరీంనగర్    Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# నిర్లక్ష్యం వహించొద్దు

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలి
- ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి
- ప్రచారానికి సోషల్ మీడియానూ ఉపయోగించుకోవాలి
- కాంగ్రెస్ శ్రేణులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం



ప్రజాపక్ష/హైదరాబాద్

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులకు సూచించారు. జూబ్లీహిల్స్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు అందుబాటులో ఉన్న మంత్రులు పాల్గొన్నారు. ఇప్పటికే మంత్రులు, సీనియర్ నాయకులు, ఎంఎల్‌ఎలు గడప గడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. సిఎం రేవంత్ రెడ్డి కూడా ఇప్పటికే నాలుగు తరువాయి 2లో



# బిహార్ తొలి దశలో 64 శాతం

**అక్కడక్కడా హింసాత్మక ఘటనల మధ్య పోలింగ్**

- ఉపముఖ్యమంత్రి సిన్హా కారుపై చెప్పులతో దాడి
- అక్కడక్కడ హింసాత్మక ఘటనలు
- రాష్ట్రంలో మార్పు తీసుకురండి
- తేజస్వియాదవ్, రబ్రీదేవి పిలుపు

**పాట్నా:** బిహార్ అసెంబ్లీకి తొలి దశ ఎన్నికల్లో 18 జిల్లాలలో ఉన్న 121 నియోజకవర్గాలలో 3.75 కోట్లమంది ఓటర్లు ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. గురువారం సాయంత్రం ఐదు గంటల వరకూ 64.46 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ప్రక్రియ సందర్భంగా అక్కడక్కడ హింసాత్మక సంఘటనలు చెలరేగాయి. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా కారుపై చెప్పులు, రాళ్ళతో దాడి జరిగింది. బురఖా ధరించి ఓటు వేయడానికి వచ్చిన మహిళలను భద్రతా సిబ్బంది తనిఖీలు చేశారు. ఇలా తనిఖీలు చేయడాన్ని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ సమర్థించారు. ఈ తనిఖీలవల్ల ఓట్ చోరీని అడ్డుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. ''మనం పాకిస్థాన్‌లో బతకడంలేదు, ఇదిమతపరమైన వివక్ష కాదు, బిహార్‌లో తేజస్వి యాదవ్ ప్రభుత్వంగానీ, షరియా చట్టం గానీ అమలులో లేదు'' అంటూ ఎగతాళి విమర్శలు చేశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయడం ద్వారా మార్పు తీసుకురావాలని యువతీ యువకులకు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్, ఆయన తల్లి,మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి పిలుపు ఇచ్చారు. తొలిదశలో బెగుసరాయ్ నియోజకవర్గంలో అత్యధికంగా 67.32 శాతం తరువాయి 2లో

## బిహార్‌లో వామపక్షాలు

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాలు మహాగట్బంధన్‌లో భాగస్వాములుగా మొత్తం 30 సీట్లలో పోటీ చేస్తున్నాయి. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ 20, సిపిఐ 6, సిపిఐ(ఎం) 4, సీట్లలో పోటీలో ఉన్నాయి. కాగా సిపిఐ మరో మూడు సీట్లలో వేరె కాంగ్రెస్‌తో 'స్నేహపూర్వక' పోటీలో ఉంది. ఆర్‌ఎస్‌పి, ఫార్వర్డ్‌బ్లాక్‌లకు ప్రతిపక్ష కూటమిలో స్థానం లభించలేదు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ (ఎంఎల్) ఎల్ 19 సీట్లలో పోటీచేసి 12 గెలుపొందింది. అయితే భోజ్‌పురి జిల్లాలోని తరారీ సీటులో గెలిచిన అభ్యర్థి సుధామ ప్రసాద్ గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసి ఎన్నికైనారు. అయితే తరారీ సీటు ఉప ఎన్నికలో ఎం.ఎల్. అభ్యర్థి ఓటమి పొందారు. అందువల్ల ఎం.ఎల్. సభ్యులు 11 సీట్లతో అసెంబ్లీలో ఉన్నారు. సిపిఐ, సిపిఐ(ఎం)లకు చెరో ఇద్దరు సభ్యులున్నారు. గత ఎన్నికల్లో వామపక్షాల ఓటు వాటా – సిపిఐ (ఎంఎల్) ఎల్ 3.16శాతం, సిపిఐ 0.83, సిపిఐ (ఎం) 0.65 – వెరసి మొత్తం పోటీ చేస్తున్నారు

# ఇప్పుడైనా ఎరువులివ్వండి

- డిసెంబర్‌లోపు 70శాతం సరఫరా చేస్తే ఇబ్బందులు లేకుండా రైతులకు పంపిణీ
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి విజ్ఞప్తి
- గత సీజన్‌లో కేటాయింపుల మేరకు ఇవ్వలేదని వ్యాఖ్య
- యాసంగి సీజన్ ఎరువుల సరఫరాపై అధికారులతో సమీక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్

గత సీజన్‌లో కేటాయించిన ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఎరువులను సరఫరా చేయలేదని, ప్రస్తుత సీజన్‌లోనైనా డిసెంబర్‌లోపు 70 శాతం ఎరువులను సరఫరా చేస్తే ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతులకు పంపిణీ చేయవచ్చని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన ఎరువుల సరఫరాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి మాట్లాడుతూ యాసంగి సీజన్ కోసం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 1.45 లక్షల మెట్రిక్ టన్నుల డిఎపి, 7 లక్షల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 0.65 లక్షల మెట్రిక్ టన్నులు ఎమ్ఓపి, 0.60 లక్షల మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పి ఎరువులను రాష్ట్రానికి కేటాయించారని వివరించారు. తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో 6 లక్షల మెట్రిక్ టన్నులను అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలలో నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల తరువాయి 2లో



## వామపక్ష ఐక్యతతోనే
# పేదలకు న్యాయం

- కార్పోరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్న మోదీని సాగనంపాలి
- ఓట్ చోరీ ఆరోపణలను ఎన్నికల సంఘం పట్టించుకోదా?
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి నిలదీత
- పేదల హక్కుల కోసం నక్సలైట్లు వామపక్షాలతో కలిసి రావాలి : తక్కలపల్లి

ప్రజాపక్షం / హుస్నాబాద్

భారత దేశంలో కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ దేశ సంపదను అదాని, అంబాని లాంటి ధనవంతులకు దోచి పెడుతున్న ప్రధాని నరేంద్ర మోదీని సాగనంపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం అయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అనభేరి సింగిరెడ్డి అమరుల భవనంలో తెలంగాణ రాష్ట్ర సిపిఐ సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. దేశంలో కార్మికులకు, కర్శకులకు, పేదలకు న్యాయం జరగాలంటే వామపక్షాల ఐఖ్యత ఎంతో అవసరమని అందుకు వామపక్ష భావజాలాలు ఉన్న ప్రతీ ఒక్కరూ కలిసి రావాలని చాడ పిలుపునిచ్చారు. నేడు ప్రపచంలోనే అగ్రరాజ్యమైన అమెరికాలోని న్యూయార్క్ రాష్ట్లంలో డెమోక్రాటిక్ అభ్యర్థి మమ్దానీ మేయర్‌గా ఎన్నిక అయ్యారంటే వామపక్షాల అవసరం పేదలకు ఎంత అవసరం ఉంటే గెలిపించారని, నేడు మన దేశంలో ప్రతీ ఒక్క భారతీయుడూ అలోచించాలని కోరారు. దేశంలో హర్యానా, కేరళ రాష్ట్రంలో ఓట్లు చోరీ జరిగిందని అనేక అరోపణలు వస్తున్నా ఎన్నికల సంఘం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. నేడు బిహార్ రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో కూడా ఓట్ల చోరీ కొనసాగుతుందని అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఐదేళ్లకు జరగాల్సిన లోకల్ బాడీ ఎన్నికలు బిసి రిజర్వేషన్లు బిల్లు పేరుతో తరువాయి 2లో

## బిహార్‌లోనూ బిజెపి
# ఓట్ల చోరీకి యత్నం

**అడ్డుకునే బాధ్యత యువతదే : రాహుల్‌గాంధీ పిలుపు**




**పూర్ణియ/మోతీహరి/సీతామరి :** ఓట్ల దొంగతనంపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ బిజెపిపై మరోసారి విమర్శలు చేశారు. ఓట్లు దొంగిలించడం ద్వారా ప్రతిచోటా ఎన్నికలలో గెలుస్తోందని ఆరోపించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బిజెపి తన శక్తినంతా ఉపయోగించి ఓట్లను దొంగిలించడానికి ప్రయత్నిస్తుందని, దానికి వ్యతిరేకంగా వ్యవహరించడం యువత బాధ్యత రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు. బిహార్‌లో గురువారం తొలి విడద పోలింగ్ జరిగింది. ఈ నేపథ్యంలో రాహుల్ ఓట్ల దొంగతనం వ్యాఖ్యల ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. గురువారం పూర్ణియాలో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ బిజెపి, ఎన్నికల కమిషన్ హర్యానా ఎన్నికలను దొంగిలించాయని తాము మొత్తం ప్రపంచానికి చూపించామన్నారు. వారు బీహార్‌లో కూడా ఓట్లను దొంగిలించడానికి ప్రయత్నిస్తారని కచ్చితంగా చెప్పగలనన్నారు. దీనిని ఆపడం, రాజ్యాంగాన్ని కాపాడటం బిహార్ యువత బాధ్యత అని, అందరూ పోలింగ్ బూత్‌ల వద్ద జాగ్రత్తగా ఉండాలి అని మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ యువత నిరుద్యోగులుగా మిగిలిపోయే బిలియనీర్ల పాలన కోరుకుంటున్నారని కూడా గాంధీ ఆరోపించారు. అరారియాలో జరిగిన మరో ర్యాలీలో మాట్లాడుతూ మోదీ, హోంమంత్రి అమిత్ షా దేశంలో 'జంగిల్ రాజ్' విధించారని ఆరోపించారు. నితీష్ కుమార్ బీహార్‌లో తరువాయి 12లో




## ప్రకృతి రక్షణలో
# మాటలొద్దు..కార్యాచరణే...

- లులా డసిల్వా పిలుపు
- లాంఛనంగా కాప్‌– 30 ప్రారంభం

**బెలెం :** 'మాటలు కట్టిపెడదాం, ఇక కార్యాచరణ ప్రారంభించాల్సిందే, అందుకు సమయం వచ్చేసింది, ఇక ఆలస్యం కూడదు..భూగోళాన్ని ప్రకృతి వైపరీత్యాల నుండి కాపాడుకోవడానికి ఆచరణాత్మక చర్యల్లోకి దిగాల్సిందే'అని బ్రెజిల్ దేశాధ్యక్షుడు లూయిస్ ఇనాసియో లులా డసిల్వా పిలుపు ఇచ్చారు. గొప్ప అడవులకు, ప్రకృతికి పెట్టింది పేరుగా ఉండే బ్రెజిల్ దేశం అమెజాన్‌లోని బెలెంలో కాప్–30 (ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల సదస్సు)కు ముందుగా లులా డసిల్వా ప్రపంచవ్యాప్తంగా మాధ్యమాల ద్వారా చైతన్యస్ఫూర్తి రగిలించారు. నవంబరు 10 నుండి 21వ తేదీ వరకూ బెలెంలో కాప్–30 సమావేశాలు జరుగుతాయి. దీనికి ముందుగా గురు–శుక్రవారాలలో ప్రపంచదేశాల అధికార ప్రతినిధులు సమావేశమై సదస్సులోని ముఖ్యాంశాలను, ఎజెండాను, ప్రాధాన్యతలను, చర్చనీయాంశాలను నిర్ధారిస్తారు. ఇప్పటివరకూ బొగ్గు, చమురు, గ్యాస్ వంటి సంప్రదాయ ఇంధన వనరులు ఉపయోగించుకుని పారిశ్రామికంగా బాగా ఎదిగిన ధనికదేశాలు అభివృద్ధి చెందుతున్న, వెనుకబడిన దేశాలకు సహాయం చెయ్యాలని, వాతావరణాన్ని, ప్రకృతి విలయాలను అడ్డుకునేందుకు అన్ని దేశాలు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు ధనిక దేశాలు తమ వంతుగా తృతీయ ప్రపంచ దేశాలకు 1.3 ట్రిలియన్ డాలర్ల నిధులు సమకూర్చి వాతావరణ రక్షణలో తమవంతు బాధ్యతలు నిర్వహించాలని లులా డసిల్వా పిలుపు ఇచ్చారు. కీలకమైన సందర్భాలు వచ్చినప్పుడు యావత్ ప్రపంచం, మావవాళి ఏకమై ఒకేమాట మీద నిలబడి మానవ మనుగడను కాపాడుకోవడానికి కృషి చేస్తుందని కరోనా మహమ్మారి ప్రమాదం రుజువు చేసిందని, ఇక ప్రకృతి వైపరీత్యాలు రాకుండా వాతావరణాన్ని కాపాడుకోవడానికి అదే పద్ధతిలో అన్ని దేశాలు ఏకం కావాలని, ప్రతి దేశం తన జాతీయ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని ఆచరించాలని లులా డసిల్వా కోరారు. ఈ దిశగా బ్రెజిల్ దేశం తన వంతు కృషి చేస్తోందని చెప్పారు. బ్రెజిల్‌లో 88 శాతం విద్యుత్ వనరులు పునర్వినియోగ ఇంధన వనరుల ద్వారా లభిస్తోందని, జీవ ఇంధనానికి, పవన విద్యుత్ తరువాయి 2లో

# 14న విచారణకు హాజరుకండి

**రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి 'ఇడి' తాజా సమన్లు జారీ**



**న్యూఢిల్లీ :** బ్యాంకు మోసం, మనీలాండరింగ్ కేసులో వచ్చే వారం విచారణకు హాజరు కావాలని రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా సమన్లు జారీ చేసిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. 66ఏళ్ల వ్యాపారవేత్త అనిల్ అంబానీని ఆగస్టులో ఫెడరల్ దర్యాప్తు సంస్థ దాదాపు 10గంటల పాటు ప్రశ్నించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)లో రూ.2,929 కోట్ల రుణమోసం కేసులో రిలయన్స్ కమ్యునికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌సిఒఎం) పై నమోదైన మనీలాండరింగ్ కేసులో నవంబరు 14న ఆయన విచారణ హాజరు కావాలని కోరినట్లు వారు తరువాయి 12లో

# లెంకలగడ్డలో సుడిగాలి విధ్వంసం

- రెండు కిలోమీటర్ల మేర నేలమట్టమైన వృక్షాలు
- దాదాపు వంద ఎకరాల్లో తుడిచిపెట్టుకుపోయిన మిరప, పత్తి, వరి
- పంటలను పరిశీలించిన కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజాపక్షం/భూపాలపల్లి



జయశంకర్ జిల్లా పలిమెల మండలం లెంకలగడ్డ గ్రామంలో సుడిగాలి వాన విధ్వసం సృష్టించింది. దాదాపు 10 నిమిషాల సుడిగాలి బీభత్సంతో అడవిలో చెట్లతో పాటు 30 ఎకరాల్లో పత్తి, 10 ఎకరాల్లో మిరప 5 ఎకరాల్లో పంటలు తుడుచు పెట్టుకుపోయాయి. అక్కడే పంట పొలాల్లో పనులు చేస్తున్న రైతులు పరుగులు తీయడం తో ప్రాణ నష్టం జరగలేదు. పంటపొలాల్లో ఉన్న నీళ్ల డ్రమ్ములు గాల్లో ఎగిరిపోగా ఎద్దుల బండి మూడు పల్టీలు కొట్టినట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. గత ఏడాది ములుగు జిల్లా తద్వాయి, మేడారం అడవుల్లో జరిగిన సంఘటనే మళ్ళీ ఇక్కడ పునరావృతం అయిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

**నష్టం అంచనా వేయండి : కలెక్టర్**

భారీ సుడిగాలికి ధ్వంసం అయిన పంటలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం తరువాయి 2లో

# ఎరుపెక్కిన జెఎన్‌యు

- విద్యార్థి సంఘం ఎన్నికల్లో లెఫ్ట్ క్లీన్‌స్వీప్
- నాలుగు కీలక స్థానాలు కైవసం



**న్యూఢిల్లీ:** జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఎరుపెక్కింది. విద్యార్థి సంఘం (జెఎన్‌యుఎస్‌యు) ఎన్నికలలో వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య సంఘటన నాలుగు కీన్ స్థానాలను కైవసం చేసుకున్నది. వామపక్ష అభ్యర్థుల గెలుపుతో వర్సిటీ ఆవరణ అరుణ శోభను సంతరించుకున్నది. ఎబివిపి పూర్తిస్థాయిలో చిత్తు అయింది. జెఎన్‌యు విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగా అదితీ మిశ్రా, ఉపాధ్యక్షురాలిగా కె.గోపికా బాబు, ప్రధాన కార్యదర్శిగా సునీల్ యాదవ్, సంయుక్త కార్యదర్శిగా దానిష్ అలీ ఎన్నికయ్యారు. ఈ నిర్ణయాత్మక విజయంతో జెఎన్‌యు విద్యార్థి రాజకీయాల్లో వామపక్షాల బలం మరోమారు రుజువైంది. ఈసారి ఎన్నికల్లో ఎన్ఎస్‌యూఐ, బిఏపిఎస్ఎతో పాటు స్వతంత్ర సంఘాలు పోటీ పడ్డాయి. ప్రచారం కూడా పెద్ద ఎత్తున సాగింది. ఓటింగ్‌కు అర్హులైన విద్యార్థుల సంఖ్య మొత్తం 9,043 కాగా 67 శాతం పోలింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపు ముగియడంతో గురువారం ఫలితాలు ప్రకటించారు. వామపక్ష అభ్యర్థుల గెలుపుతో జెఎన్‌యూలో విద్యాపరమైన స్వేచ్ఛ, తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## సిగరెట్, డ్రగ్ యూజర్లకు బంగ్లాదేశ్‌లో టీచరు ఉద్యోగాల్లేవు



**ఢాకా:** ధూమపానం, మాదక ద్రవ్యాలు ఉపయోగించేవారిని ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశం లేకుండా బంగ్లాదేశ్ నిషేధం అమలు చేయడం ప్రారంభించింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉద్యోగాలు చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలంటే ఈ అలవాట్లు ఉండకూడదు. ఈ అలవాట్లు ఉన్నవారు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులని ప్రభుత్వం ప్రకటించింది. బంగ్లాదేశ్ ప్రైమరీ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజ్‌షాహి, రంగపూర్, సిల్హెట్, ఖుల్నా, బరిషాల్, మైమెన్‌సింగ్ డివిజన్లలలో 10,219 కొత్త టీచరు ఉద్యోగాలను భర్తీ చేసేందుకు విద్యాశాఖ నోటీసు జారీ చేసింది. ఇందులో నిబంధనల ప్రకారం దూమపానం, మాదకద్రవ్యాలు సేవించేవారికి దరఖాస్తు చేసుకునే అర్హత లేదు. 21–32 మధ్య వయసుగల అర్హులైన వారు నవంబరు 21వ తేదీ వరకూ దరఖాస్తులు చేసుకోవచ్చు.

## మమ్మల్ని గౌరవిస్తేనే మమ్దానీకి విజయం

### డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్గన్/న్యూయార్క్:** న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ మమ్దానీకి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక చేశారు. మమ్మల్ని గౌరవిస్తేనే మీకు ప్రజాస్వామ్య సోషలిస్టు విజయం చేకూరుతుందని అన్నారు. మమ్దానీకి సహాయం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, ఐతే ఆయన ప్రజాస్వామ్య సోషలిజం విజయం సాధించాలంటే తమకు గౌరవం ఇవ్వాలని అన్నారు. మమ్దానీ గెలిచిన తర్వాత సందేశం ఇస్తూ, ఈ విజయం నవశకానికి నాంది పలుకుతుందన్నారు. ట్రంప్‌కు నేరుగా హెచ్చరిక చేశారు. మిమ్మల్ని మీరు సరిదిద్దుకోవాలన్నారు. ఈ విజయం ట్రంప్ ఓటమికి ప్రారంభ సూచనగా ఆయన పేర్కొన్నారు. ట్రంప్‌ను ఎదిరించి నిలబడతానని మమ్దానీ చేసిన ప్రకటనపై ట్రంప్ పైవిధంగా స్పందిస్తూ, తమకు గౌరవం ఇవ్వాలనీ, ఆయన చేసిన ప్రకటన ప్రమాదకరమైనదనీ అన్నారు ''అతడు కొంచెం తమ పట్ల గౌరవంగా ఉండాలి, ఎందుకంటే అతనంటూ లేకపోతే అసలు అతడు విజయం సాధించే అవకాశమే లేదు'' అని ఫాక్స్‌న్యూస్ ప్రతినిధి బ్రెట్ బేయర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ''అతడిని విజయవంతం చేయాలని నేను కోరుకుంటున్నాను, అని మళ్ళీ తన మాటలను సరిదిద్దుకుంటూ, న్యూయార్క్ నగరం విజయవంతం కావాలని నేను కోరుకుంటున్నాను'' అన్నారు.



### గాజాలో యుద్ధం కాదు, సామూహిక హత్యాకాండ : మమ్దానీ స్పందన

న్యూయార్క్ తొలి ముస్లిం మేయర్, మొదటి దక్షిణాసియా వాసి, సోషలిస్టు జోహ్రాన్ మమ్దానీ ఇజ్రాయెల్ చేస్తున్న ఘోర అకృత్యాలపై తీవ్రంగా స్పందించారు. గాజాలో జరుగుతున్నది యుద్ధం కాదు, అది సామూహిక హత్యాకాండ, సామూహిక ఊచకోత అని వ్యాఖ్యానించారు. దీంతో ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆయనపై ఎదురు దాడికి దిగింది. మమ్దానీ హమాస్ ఉగ్రవాదుల పక్షం వహించారని ఇజ్రాయెల్ మంత్రి ఒకరు విమర్శించారు.

మమ్దానీ మొదటి నుండీ మానవతావాదాన్నే సమర్థిస్తూ వచ్చారు. గాజాలో ఇజ్రాయెల్ దురాగతాలను గతంలో కూడా ఆయన తీవ్రస్థాయిలో దునుమాడారు. మేయర్ పదవి ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బ్రూక్లిన్‌లో ఆయన అభిమానులకు సందేశం ఇచ్చారు. 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ ఇజ్రాయెల్‌పై దారుణంగా చేసిన దాడిని మమ్దానీ ''వార్ క్రైమ్''గా అభివర్ణించారు. కానీ ఆ తర్వాత ట్రంప్ సహాయంతో నెతన్యాహూ గాజాలో అమానవీయంగా ఊచకోతలకు పాల్పడ్డారని విమర్శించారు. ఇజ్రాయెల్‌కు ఒక దేశంగా మనుగడ సాగించే హక్కు ఉంది, కానీ అదే సమయంలో పొరుగు దేశాలకు కూడా వారితో సమానమైన హక్కులు ఉంటాయని చర్చల సందర్భంగా అనేక సార్లు ఆయన చెప్పారు.

## పాక్–అఫ్గానిస్థాన్ మధ్య మళ్ళీ చర్చలు

## ఈసారి విఫలమైతే యుద్ధమే:ఆసిఫ్



**ఇస్తాంబుల్:** పాకిస్థాన్ – అఫ్గానిస్థాన్ మధ్య సరిహద్దు ఉగ్రవాదం, సరిహద్దుల ఉల్లంఘన సమస్యలపై మూడో విడత చర్చలు టర్కీ (తుర్కియే) రాజధాని ఇస్తాంబుల్‌లో గురువారం తిరిగి ప్రారంభమయ్యాయి. ఇంతకుముందు రెండు విడతలుగా దోహా, ఇస్తాంబుల్ నగరాల్లో జరిగిన చర్చలు ఎలాంటి ఒప్పందం లేకుండానే విఫలమయ్యా యి. ఈ చర్చలకు టర్కీ, ఖతార్ దేశాలు మధ్యవర్తిత్వం చేస్తున్నాయి. ఈసారి చర్చలకు పాకిస్థాన్ తరపున మిలిటరీ ఇంటిలిజెన్స్ విభాగాధిపతి ఆసిమ్ మాలిక్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. అఫ్గానిస్థాన్ తరపున ఆ దేశ ఇంటిలిజెన్స్ విభాగాధిపతి అబ్దుల్ హక్ వాసిక్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. గతనెల 11వ తేదీన రెండు దేశాల సరిహద్దుల్లో సైన్యాలమధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణల్లో 206 మంది అఫ్గాన్ తాలిబన్లు, 110 మంది తెహ్రీక్ ఎ తాలిబన్ పాకిస్థానీ ఉగ్రవాదులు మరణించారు. మరో 23 మంది పాకిస్థానీ సైనికులు మరణించారు. గతనెల 15వ తేదీన రెండు దేశాలు కాల్పుల విరమణకు ఒప్పుకున్నాయి.

గతంలో జరిగిన చర్చల్లో పాకిస్థాన్ ప్రతినిధులు అలవికాని మాటలు, మొరటు మాటలు మాట్లాడారని, చర్చలపట్ల గౌరవం లేకుండా అమర్యాదకరంగా ప్రవర్తించారని అఫ్గానిస్థాన్ ప్రతినిధులు విమర్శించారు. ఐతే ఈ చర్చలు ప్రారంభం కాకముందుగానే పాకిస్థాన్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ ఒక హెచ్చరిక చేస్తూ ఈసారి చర్చలు విఫలమైతే అఫ్గానిస్థాన్‌తో యుద్ధం తప్పదని హెచ్చరిక చేసింది. పాకిస్థాన్ అనుసరిస్తున్న వైఖరిని అఫ్గాన్ ప్రభుత్వ వర్గాలు కూడా తీవ్రంగా ఖండించాయి. తమ సరిహద్దులను తాము కాపాడుకుంటామని, తమ సరిహద్దులను ఉల్లంఘించి తమ గగనతలంలోకి ప్రవేశిస్తే పాకిస్థాన్‌ను సహించేదిలేదని అఫ్గానిస్థాన్ ప్రతినిధులు ఇప్పటికే రెండు విడతలుగా జరిగిన చర్చల్లో స్పష్టం చేశారు. టిటిపి ఉగ్రవాదులను అరికట్టాల్సిన బాధ్యత అఫ్గానిస్థాన్ తాలిబన్ ప్రభుత్వానిదేనని పాకిస్థాన్ వాదిస్తుండగా, ఉగ్రవాదులతో తమకు ఎలాంటి సంబంధం లేదని, వారిని అదుపు చేసుకోవాల్సిన బాధ్యత పాకిస్థాన్ సైన్యం, భద్రతా బలగాలదేనని అఫ్గానిస్థాన్ ప్రతినిధులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో మూడో విడత చర్చలు మొదలయ్యాయి.

## అమెరికాలో షట్‌డౌన్ ఎఫెక్ట్

## నేటి నుండి 10 శాతం విమానాల రద్దు



**వాషింగ్టన్:** అమెరికా చరిత్రలో ఎన్నడూలేనివిధంగా 37 రోజులుగా కొనసాగుతున్న అసాధారణమైన ఎకనామిక్ షట్‌డౌన్ మెల్లిగా మరింత ప్రభావం చూపిస్తోంది. దీనివల్ల విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగనున్నది. శుక్రవారం నుండి 10 శాతం విమానాలను నిలిపివేస్తామని అమెరికా రవాణావిభాగం కార్యదర్శి సీన్ డఫ్ఫీ చెప్పారు. ఫెడరల్ ఫండింగ్ బడ్జెట్‌కు అమెరికా కాంగ్రెస్ ఆమోదం ఇవ్వకపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. విమాన రంగానికి సంబంధించి దాదాపు 14 లక్షలమంది ఫెడరల్ వర్కర్లు, ట్రాఫిక్ కంట్రోలర్లు వేతనాలులేకుండా పనిచేయాలి. లేదా బలవంతంగా వేతనం లేకుండా సెలవుమీద వెళ్ళాలి.

నిధుల కొరత కారణంగా విమానాల్లో ఈ కోత విధించనున్నారు. షట్‌డౌన్ వల్ల కేవలం అత్యవసర సేవలు మాత్రమే దేశంలో పనిచేస్తున్నాయి. మిగిలిన విభాగాలన్నింటిలో పనిచేస్తున్న ఉద్యోగులు అందరూ వేతనం లేకుండా సెలవులపై ఇళ్ళకు వెళ్ళి కూర్చున్నారు. కాంగ్రెస్‌లో బిల్లు ఆమోదం పొందిన తర్వాత మాత్రమే ఉద్యోగులకు వేతనాలు ఇస్తారు. అప్పటివరకూ ఎన్నిరోజులు షట్‌డౌన్ అమలులో ఉంటే అన్ని రోజులకూ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వరు. ఐతే విమానాశ్రయాలలో పనిచేసే సిబ్బంది సంఖ్య కూడా తక్కువగా ఉండటంతో వారిపై ఒత్తిడి తగ్గించేందుకు బాగా రద్దీగా ఉన్న 40 విమానాశ్రయాల నుండి రాకపోకలు చేసే పదీ శాతం విమానాల్లో కొత పెడుతున్నారు. బహుశా 1800 ల విమానాలు గాల్లోకి ఎగరకుండా ఆగిపోతాయి.

## పేదలకు న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

వాయిదా వేస్తుందని అరోపించారు. సుప్రీం కోర్టు లోకల్ బాడీ ఎన్నికలు జరపమని చెప్పినప్పటికిని ప్రభుత్వం ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. తెలంగాణలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు అన్ని పార్టీల సమన్వయంతో కలిసి ప్రధాని మోదీతో బిల్లును అమోదం తెచ్చుకోవాలని సూచించారు. ఇజిఎస్ నిధుల కొటాకు కోత పెట్టి జిఎస్ టిని స్వల్పంగా తగించి దేశం కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్లు గొప్పలు చెబుతున్న మోదీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. జూబ్లిహిల్స్ ఎన్నికలల్లో కాంగ్రెస్ అభ్యర్థికి సిపిఐ మద్దతు ఇస్తుందని అన్నారు.

**పేదల హక్కుల కోసం నక్సలైట్లు వామపక్షాలతో కలిసి రావాలి : తక్కళ్లపల్లి**

దేశంలోని పేదల హక్కులను కాపాడుకునేందుకు అవినీతి నిర్మూలను కోసం ప్రజా సమస్యల సాధన కోసం నక్సలైట్లు అడవి బాట విడిచి వామపక్షలతో కలిసి ప్రజామస్యల కోసం పోరాటం చేసేందుకు కలిసి రావాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. సిపిఐ వంద ఏళ్లు పూర్తి చేసున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మం జిల్లా కేంద్రంలో జాతీయ స్థాయిలో జరుగుసభకు ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల ఎర్ర జెండ పార్టీల నాయకులు తరలి వస్తున్నారని తెలిపారు. ఈ సభలో నక్సలైట్లతో పాటు అన్ని వామపక్ష పార్టీలు దేశంలోని అవినీతి అంతం చేసేందుకు ఖమ్మం వేదికగా తగు నిర్ణయాలను తీసుకోనున్నదని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపు నిచ్చారు.

ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళవేని శంకర్, కనకుట్ల శంకర్, అదరి శ్రీనివాస్, గూడ పద్మ, జిల్లా సహయ కార్యదర్శి గడిపె మల్లెశ్, హన్యకొండ జిల్లా సహయ కార్యదర్శి కర్రె బిక్షపతి, హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జి జాగీరు సత్యానారయణ, తదితరులు పాల్గొన్నారు.


## ఇంజన్ వైఫల్యంవల్లే కార్గో విమానం పేలుడు

### 14కు పెరిగిన మృతులసంఖ్య



**కెంటుకీ:** అమెరికా కెంటుకీ విమానాశ్రయం నుండి హవాయ్‌కి బయలుదేరిన యుపిఎస్ కార్గో (సరుకు రవాణా) పేలిపోవడానికి ప్రధాన కారణం ఇంజన్ వైఫల్యమే అని వెల్లడైంది. 34 ఏళ్ళ క్రితం సర్వీసులు ప్రారంభించిన ఈ ఎండి 11–ఎఫ్ కార్గో విమానలో మూడు ఇంజన్లు ఉంటాయి. అత్యంత ఘోరమైన ఈ ప్రమాదంలో ముగ్గురు విమాన సిబ్బందితోపాటు మృతులసంఖ్య 14కు పెరిగింది. సహాయ బృందాలు గాలించి బ్లాక్‌బాక్స్‌ను వెలికితీసి అందులోని సమాచారాన్ని విశ్లేషించినప్పుడు ఇంజన్ వైఫల్యంవల్లే ప్రమాదం జరిగిన విషయం బయటపడింది. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఈ ఘటన జరిగింది. హవాయ్ వరకూ దాదాపు 6,420 కి.మీ ఈ విమానం ప్రయాణించి వెళ్ళాల్సి ఉంది. ధ్వంసమైన విమాన భాగాలు కింద ఒక చమురు శుద్ధికేంద్రంమీద, ఒక ఆటో విడిభాగా వ్యాపార కేంద్రంపైన పడటంతో ప్రమాదం తీవ్రత భారీ ఎత్తున విస్తరించి మంటలు భయానకంగా విస్తరించాయి. ఈ ప్రమాదంవల్ల 16 వేరు వేరు కుటుంబాలకు చెందిన వ్యక్తులు గల్లంతయ్యారు. విమానంలో భారీ పరమాణంలో ఇంధనం ఉన్నందువల్ల కూడా మంటలు భారీగా పైకి ఎగసిపడ్డాయి. కార్గో విమానం కూలిపోయినప్పుడు విమానంలో 38,000 గ్యాలన్స్ (1.44 లక్షల లీటర్లు) ఇంధనం ఉంది. ఈ ప్రమాదం షిప్పింగ్ వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. విమానంలో ఎలాంటి ప్రమాదకరమైన సరుకులను రవాణా చేయడం లేదని ఈ సందర్భంగా కెంటుకీ గవర్నర్ ఆండీ బేషియర్ ఒక ప్రకటన చేశారు. ఘటన జరిగిన వెంటనే ఎన్‌టిబిఎస్ బృందం ప్రమాద ఘటన ప్రదేశానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించింది. లూయిస్ విల్లే ముహమ్మద్ అలీ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి విమానం బయలుదేరిన వెంటనే ఈ ఘటన జరిగింది. ప్రమాదప్రాంతంలో ఆకాశం అంతటా నల్లని పొగలు కమ్ముకున్నాయి.

## కొత్త శిఖరం అధిరోహించిన నేపాల్–ద.కొరియా పర్వతారోహకులు



**కఠ్మండు:** నేపాల్–దక్షిణ కొరియాలకు చెందిన పర్వతారోహకులు ఇప్పటివరకూ ఎవ్వరూ అధిరోహించని కొత్త శిఖరాన్ని కేవలం పది గంటల వ్యవధిలో అధిరోహించి రికార్డు సృష్టించారు. శిఖరాగ్రానికి చేరుకుని తమ తమ జాతీయ జెండాలను ఎగురవేశారు. నామ్‌డో గ్రామానికి సమీపంలో ఉన్న చువామా–3 శిఖరాన్ని పర్వతారోహకులు అధిరోహించారు. 2025 జెజు అంతర్జాతీయ పర్వతారోహణ యాత్ర' బృందం ఈనెల రెండో తేదీ తెల్లారురుఝామున రెండు గంటలకు బేస్ క్యాంప్ నుండి బయలుదేరి 10 గంటలు ప్రయాణం చేసి 6,268 మీటర్లు ఎత్తులో ఉన్న శిఖరాగ్రానికి చేరుకుందని నేపాల్ ట్రెక్కింగ్ క్యాంప్ మేనేజింగ్ డైరెక్టర్ వోంగ్చు షెర్పా చెప్పారు. నేపాల్‌కు చెందిన ఇద్దరు పర్వతారోహకులు దావా ఫుర్టెన్ భోటే, మింగ్మార్ షెర్పా, దక్షిణ కొరియాకు చెందిన ముగ్గురు పర్వతారోహకులు కిమ్ డోంగ్జిన్, కిమ్ హ్యోన్ చుల్, ఓ నామ్యోంగ్ ఈ ఉమ్మడి బృందంలో ఉన్నారు.

## సుడిగాలి విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులతో కలిసి పరిశీలించారు. పలిమెల మండలం లెంకల గడ్డ శివారు అటవీ ప్రాంత పంట పొలాలలో మంగళవారం బారి సుడిగాలి ప్రభావానికి పంటలు, అడవిలో చెట్లు కూలిపోగా సుమారు 30 నుండి 40 ఎకరాలలో పత్తి, మిర్చి, వరి పంటలు ధ్వంసం అయ్యాయని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులు ప్రాథమికంగా పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు అందించాలి అని అధికారులను ఆదేశించారు. అధికారులు అందించిన నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం వాహనం వెళ్ళడానికి అవకాశం లేకపోగా మోటార్ సైకిల్ పై అటవీ శాఖ అధికారులతో కలిసి వెళ్లి నేలకొరిగిన వృక్షాలను పరిశీలించారు. అటవి ప్రాంతంలో విరిగిన చెట్లను లెక్కించి నివేదిక అందించాలని సూచించారు. చెట్లు నేలకొరిగిన చోట నూతన ప్లాంటేషన్ చేపట్టి అడవుల పునరుద్ధరణ కు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి సునీల్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, తహసీల్దార్ సునీల్, ఎంపిడిఓ సాయి పవన్ ఇతర శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎరుపెక్కిన జెఎన్‌యు

(మొదటి పేజీ తరువాయి)

లింగ సమానత్వం, క్యాంపస్‌లో ప్రజాస్వామికబద్ధ చర్చలకు విద్యార్థుల ఆదరణ సుస్పష్టమైంది.

**అధ్యక్షురాలిగా అదితీ మిశ్రా**

అదితీ మిశ్రా జేఎన్‌యూఎస్‌యూ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. 1,861 ఓట్లు సాధించారు. ఆమె సమీప ప్రత్యర్థి ఏబీవీపీ అభ్యర్థి వికాశ్ పటేల్‌కు 1,447 ఓట్లు రాగా 414 ఓట్ల తేడాతో అదితీ మిశ్రా విజేతగా నిలిచారు.

**ఉపాధ్యక్షురాలిగా కె.గోపికా బాబు**

కె.గోపికా మొత్తం 2,966 ఓట్లు పొందారు. ఉపాధ్యక్ష స్థానాన్ని కైవసం చేసుకున్నారు. గోపికతో పోటీ పడ్డ ఏబీవీపీ అభ్యర్థి తాన్య కుమారికి 1,730 ఓట్లు పోలయ్యాయి. అంటే 1,236 ఓట్లతో గోపిక ఘన విజయం సాధించారు.

**ప్రధాన కార్యదర్శిగా సునీల్ యాదవ్**

ప్రధాన కార్యదర్శి పదవి కోసం పోటీ హోరాహోరీగా సాగింది. వామపక్ష అభ్యర్థి సునీల్ యాదవ్ 1,951 ఓట్లు పొందగా, ఏబీవీపీ అభ్యర్థి రాజేశ్వర్‌కు 1,841 ఓట్లు వచ్చాయి. అంటే 110 ఓట్లతో సునీల్ గెలుపొందారు.

సంయుక్త కార్యదర్శిగా దానిష్ అలీ

సంయుక్త కార్యదర్శిగా వామపక్ష అభ్యర్థి దానీష్ అలీ ఎన్నికయ్యారు. ఆమెకు మొత్తం 1,991 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి, ఏబీవీపీ అభ్యర్థి అనుజ్ దమారాకు 1,762 ఓట్లు వచ్చాయి. అంటే 229 ఓట్లతో దానిష్ అలీ గెలుపొందారు.

## నిర్లక్ష్యం వహించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

రోజుల పాటు నియోజక వర్గంలోని పలు డివిజన్లలో రోడ్ షోలు నిర్వహించడంతోపాటు కార్నర్ సమావేశాలు నిర్వహించారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో క్షేత్ర స్థాయి పరిస్థితులు, సర్వే నివేదికలు, పార్టీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు, వ్యూహ, ప్రతి వ్యూహాలు తదితర అంశాలపై సిఎం సమీక్ష చేసి పార్టీ నేతలకు పలు సూచనలు చేశారు. మొత్తం మంత్రులందరికి బాధ్యతలు అప్పగించిన సిఎం రేవంత్ రెడ్డి, ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీపై ప్రజలు విశ్వాసం కోల్పోయారని, అందువల్ల కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని ఆయన అంచనా వేశారు. అయినప్పటికీ ఏలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రచారం నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో వ్యక్తిగతంగా ఓటర్లను కలవడం, రోడ్ షోలతో పాటు సోషల్ మీడియాను కూడా ప్రభావవంతంగా ఉపయోగించుకోవాలని ఆయన పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

**ఉప ఎన్నికను ఆషామాషీగా తీసుకోవద్దు**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ఆషామాషీగా తీసుకోవద్దని మంత్రులకు సిఎం రేవంత్ రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. ఈ ఎన్నిక ఫలితంతో తనతోపాటు మంత్రులందరి భవిష్యత్తు ముడిపడి ఉందని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఉప ఎన్నిక ఫలితం సానుకూలంగా వస్తుందనే ధీమాతో ఉండొద్దని, మంత్రులు ఈ ఎన్నికను చాలా సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించినట్టు సమాచారం. జూబ్లీహిల్స్ ఎన్నిక జరుగుతున్న తీరును అధిష్టానం కూలంకషంగా పరిశీలిస్తోందని, డివిజన్ల వారీగా బాధ్యతలు తీసుకున్న మంత్రులు, ఎంఎల్‌ఎలు, కార్పొరేషన్ల చైర్మన్ల పనితీరు గురించి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటోందని చెప్పారు. ఈ ఉపఎన్నిక ఫలితం ప్రభావం కేవలం జూబ్లీహిల్స్ వరకే పరిమితం కాదని, రాష్ట్ర వ్యాప్తంగా ఉంటుందని ఆయన మంత్రులను అప్రమత్తం చేసినట్లు తెలిసింది. అందువల్ల 'డూ ఆర్ డై' తరహాలో ఈ ఎన్నికను తీసుకోవాలి. మీ సొంత ఎన్నికలా తీసుకుని పనిచేయండి. మంచి మెజార్టీతో ఈ ఉప ఎన్నికలో గెలవాలి' అని ఆయన దిశానిర్దేశం చేశారు.

**ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టాలి**

ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టండంతో పాటు సోషల్ మీడియా ప్రచారంలో మంత్రులు మరింత చురుకుగా పని చేయాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించినట్లు తెలిసింది. బిఆర్ఎస్ పదేళ్లలో చేసిన విధ్వంసాన్ని అధిగమిస్తూ రాష్ట్ర ప్రజలకు అవసరమైన అన్ని కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని, హైదరాబాద్ నగరంలో గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఈ విషయాలను జూబ్లీహిల్స్ ఓటర్లకు వివరంగా చెప్పాలని మంత్రులకు సిఎం సూచించారు. బిఆర్ఎస్, బిజెపి విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని, సోషల్‌మీడియాలో బిఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ఎప్పటికప్పుడు పార్టీ సోషల్ మీడియా వారియర్లను అప్రమత్తం చేయాలని సిఎం ఆదేశించారు.

## ఇప్పుడైనా ఎరువులివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

చొప్పున సరఫరా చేయాలని ఇదివరకే కోరినట్టు వివరించారు. రాష్ట్రానికి రావాల్సిన ఎరువులను ముందుగానే తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నట్టు గోపి మంత్రి తుమ్మల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రాష్ట్రానికి కేటాయించిన ఎరువులలో 70 శాతం వరకు ముందస్తుగా తెప్పించుకుంటే, ఆ తర్వాత నిరంతరం వచ్చే ఎరువులతో కలిపి రైతులకు అవసరమైన మేరకు సరఫరా చేయవచ్చని, గత యాసంగి, అంతకుముందు వానాకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేసినట్టుగానే యాసంగిలో కూడా చేయవచ్చని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్టు కేంద్రం ప్రభుత్వం నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించిందని, కానీ గత నెలలో ఇంకా 37 వేల మెట్రిక్ టన్నుల యూరియా, ఓడరేవుల నుండి రాష్ట్రానికి చేరుకోవాల్సి ఉందని వివరించారు. ప్రస్తుత నెలలో ఇప్పటికే 25 వేల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి చేరుకున్నదని, మొత్తంగా అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు 1.88 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా అయిందన్నారు.

వరంగల్ రేక్ పాయింట్ వద్ద గూడ్స్‌ను మూసి, దానిని చింతలపల్లి పాయింట్ కు మార్చాలని రైల్వే శాఖ నిర్ణయించిందని, తద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎరువుల సరఫరాలో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని మంత్రి తుమ్మల ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువుల సరఫరాలో తలెత్తే సమస్యను దృష్టిలో పెట్టుకుని 4 నుండి 5 నెలల పాటు వరంగల్ రేక్ పాయింట్‌ను కొనసాగించాలని తుమ్మల కేంద్ర రైల్వే మంత్రిని కోరారు. రాష్ట్రంలో యూరియా వినియోగం డిసెంబర్ మూడో వారం నుండి ఉంటుందని,ఆ సమయంలో మక్క జొన్న, వరి పంటలతో గరిష్ట స్థాయికి చేరుకుంటుందని, ఈ సమయంలో ఎరువుల కొరత రాకుండా ఉండేందుకు కేంద్రం వెంటనే 0.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించడంతో పాటు, సిఐఎల్ ద్వారా త్వరితగతిన రవాణ చేయాలని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రిని తుమ్మల కోరారు.

## మాటలొద్దు.. కార్యాచరణే

(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తికి, గ్రీన్ హైడ్రోజన్ ఎనర్జీకి బ్రెజిల్ పెద్ద పీట వేసిందని, తాము కార్యాచరణ చేస్తున్నామని చెప్పారు. ప్రతిసారీ వాతావరణ సదస్సులలో అనేక వాగ్దానాలు చేస్తున్నాం, వాటిని నెరవేర్చలేకపోతున్నాం, ఇక అలా వీలుకాదు, మాటలు చాలించి కార్యాచరణలోకి దిగాల్సిందే...అని లులా డసిల్వా అన్నారు.

ప్రపంచశాంతిని కాపాడాల్ని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఈనాడు విఫలమైందని, యుద్ధాలను నివారించలేకపోయిందని బహుముఖ ప్రపంచ వ్యవస్థ కష్టాల్లో పడిందని అన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ప్రతిసారీ ఈ అంశాలను చర్చించేవిధంగా ముడిపెట్టి ఒక వాతావరణ మార్పుల మండలి (క్లైమేట్ ఛేంజ్ కౌన్సిల్)ను ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు.

ప్రపంచవ్యాప్తంగా 200 కోట్లమంది ప్రజలకు క్లీన్ టెక్నాలజీ అందుబాటులో లేదని, అదేవిధంగా మరో 673 మిలియన్ల ప్రజలు (67.30 కోట్లు) మంది ప్రజలు ఆకలితో ఛస్తూ బతుకుతున్నారన్నారు.

## తొలిదశలో 64 శాతం

(మొదటి పేజీ తరువాయి)

పోలింగ్ నమోదుకాగా, సమస్థిపూర్‌లో 66.65 శాతం, మాధేపురలో 65.74 శాతం పోలింగ్ నమోదైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్, కేంద్రమంత్రులు గిరిరాజ్ సింగ్, రాజీవ్ రంజన్ సింగ్ 'లలన్' సహా పలువురు ప్రముఖులు తొలిదశ పోలింగ్ పరిధిలో ఉన్న తమ తమ నియోజకవర్గాలలో వేరు వేరు చోట్ల ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. నితీశ్ కుమార్ తన సొంత ఊరు భక్తియార్‌పూర్‌లో ఓటు వేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. ''ఓటు కేవలం ఒక హక్కు మాత్రమే కాదు, ప్రజాస్వామ్యంలో పౌరుల ప్రధాన విధి'' అని వ్యాఖ్యానం కూడా పెట్టారు. ఇక తేజస్వి యాదవ్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులందరూ పాట్నాలోని వెటర్నరీ కాలేజీలో ఉన్న బూత్‌లో ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. ''ఒక కొత్త ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడం ద్వారా రాష్ట్రంలో గొప్ప మార్పు తీసుకురావాలని యువతీ యువకులను కోరుతున్నా'' అంటూ తేజస్వి యాదవ్ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు. తేజస్వి యాదవ్ తల్లి, బిహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి కూడా సోషల్ మీడియా ద్వారా ప్రజలకు ఒక విజ్ఞప్తి చేస్తూ, ఓటు హక్కు ఉపయోగించి రాష్ట్రంలో మార్పు తీసుకురావాలని పేర్కొన్నారు. ఇక ప్రజలతో దాడికి గురైన ఉపముఖ్యమంత్రి సిన్హా తారాపూర్‌లో ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. నితీశ్ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తుందని, తాము ప్రభుత్వంలో కొనసాగుతామని అన్నారు. రాష్ట్రంలో పరివర్తన తీసుకురావడానికి మేం ఎంతో కృషి చేశామని, ఆ కృషి, అభివృద్ధిని ఈనాడు మనం చూస్తున్నామన్నారు.

అధికార ఎన్‌డిఎ కూటమి, ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎవరికివారే తొలి దశ పోలింగ్ ప్రక్రియలో తమదే పైచేయి అనీ, తామే గెలుస్తామంటూ ధీమా వ్యక్తం చేశాయి. 'ఇండియా' కూటమి తరపున ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్, ప్రస్తుత ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధురి, విజయ్ కుమార్ సిన్హా, ఇంకా అనేకమంది మంత్రులు తొలిదశ పరిధిలో ఉన్న 121 నియోజకవర్గాలలో ఓటర్ల పరీక్షను ఎదుర్కొన్నారు. మధ్యమధ్యలో కొద్దిపాటి విరామం మినహా గడచిన 20 సంవత్సరాలుగా ఎన్‌డిఎ కూటమి బిహార్‌లో అధికారంలో కొనసాగుతున్నది. సుశాసన్ (సుపరిపాలన) అనే ఇమేజ్‌ను నిలబెట్టుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. రాష్ట్రంలో అంతకుముందు ఆర్‌జెడి–కాంగ్రెస్ ఉమ్మడిగా పదిహేనేళ్ళు రాష్ట్రంలో జంగిల్ రాజ్ చేశాయని ఎన్‌డిఎ కూటమి విమర్శిస్తున్నది.

కాగా లఖిసరాయ్ నియోజకవర్గం నుండి పోటీలో ఉన్న ఉపముఖ్యమంత్రి సిన్హా కారుపై చెప్పులు, రాళ్ళు, పేడతో ప్రజలు దాడి చేశారు. ఆయన కారు ముందుకు వెళ్ళకుండా అడ్డుకున్నారు. ముర్దాబాద్ సిన్హా అంటూ నినాదాలు చేశారు. లాలూ ప్రసాద్ యాదవ్‌కు చెందిన గూండాలే తన కారుపై దాడి చేశారని సిన్హా ఆరోపించారు. తాము మరోసారి రాష్ట్రంలో అధికారంలోకి వవస్తామని, అప్పుడు ఈ గూండాలకు ''బుల్ డోజర్ ట్రీట్‌మెంట్'' ఇస్తామని ఆయన అన్నారు. పోలీసులు చూస్తూ కూర్చున్నారంటూ వారిపై విమర్శలు చేశారు. లాలూప్రసాద్ యాదవ్ గూండాలు నియోజకవర్గంలో అలజడి సృష్టిస్తున్నారని, వారు పోలింగ్ అధికారులను కూడా బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆయన లఖిసరాయ్ నియోజకవర్గం నుండి వరుసగా నాలుగో సారి పోటీ చేస్తున్నారు.

**కొత్త ప్రభుత్వం నా కొడుకుదే : లాలూ ధీమా**

తన చిన్న కుమారుడు తేజస్వి యాదవ్ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేస్తాడని మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెట్టారు. ఒక కొత్త బిహార్‌ను నిర్మించాలంటే తేజస్వి యాదవ్ ప్రభుత్వాన్ని అనివార్యంగా ఏర్పాటు చేయాల్సిందేనని ఆయన అన్నారు. తేజస్వి యాదవ్ తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని ఆయన ఘంటాపథంగా చెప్పారు. మరోవైపు ఆర్‌జెడి ఎక్స్‌వేదికగా పోస్టింగ్ పెడుతూ ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో పోలింగ్ ప్రక్రియ మెల్లిగా నడుస్తోందని విమర్శించింది.

**డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడిస్తారు : రోహిణీ ఆచార్య**

బిహార్ ప్రజలు రాష్ట్రంలో ఈసారి డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని ఓడిస్తారని ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ సోదరి రోహిణీ ఆచార్య విశ్వాసం వ్యక్తం చేశారు. ''ఈసారి రాష్ట్ర ప్రజలు తేజస్వి యాదవ్‌నే ముఖ్యమంత్రిగా ఎంచుకుంటారు, ఆయన ఉద్యోగాలు ఇస్తారు, మన రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులైన సోదరులందరికీ ఉద్యోగాలు వస్తాయి, దీంతో వాళ్ళంతా ఇతర రాష్ట్రాలకు వెళ్ళి ఎక్కడెక్కడో తిరిగి చాకిరీలు చేసుకోవాల్సిన అవసరం లేదు, రాష్ట్రంలోనే ఉద్యోగాలు సంపాదించుకునా ఉపశమనం పొందవచ్చు'' అని రోహిణీ ఆచార్య అన్నారు. ''బిహార్‌లో ప్రతి ఒక్క ఓటరూ ముఖ్యమైనవారే, ప్రతి ఒక్క ఓటూ ముఖ్యమైనదే'' అని లాలూ ప్రసాద్ పెద్ద కుమారుడు, జనశక్తి జనతా దళ్ అధ్యక్షుడు తేజ్ ప్రతాప్ అన్నారు. ఆయన పాట్నాలోని వెటర్నరీ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు ఉపయోగించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడారు. ఈసారి పరిస్థితులన్నీ నాకు చాలా సానుకూలంగా ఉన్నాయన్నారు. తన గెలుపు తథ్యమన్నారు. ప్రపంచంలో ఏదీ సులభంగాలభించదని అన్నారు. ఈ విషయం దృష్టిలో ఉంచుకుంటే కష్టపడటం పెద్ద కష్టమేమీ కాదు, ఆదేమీ భారంగా అనిపించదన్నారు. నేను ప్రతిదాన్నీ నిర్మించాలని కోరుకుంటాను, కేవలం రామాలయాన్ని మాత్రమే కాదు, ప్రజలకు కావాల్సిన అన్ని అవసరాలను ఏర్పాటు చేయాలని కోరుకుంటానన్నారు.

ఇక కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, బిజెపి ఎంపి నిత్యానంద్ రాయ్ కూడాబీహార్ ప్రజలకు ఒక విజ్ఞప్తి చేస్తూ ప్రతి ఒక్కరూ ఓటు వేసి ఎన్‌డిఎకు అధికారం ఇవ్వాలన్నారు. బిహార్ మంత్రి అశోక్ చౌధురి పాట్నాలో ఓటు వేశాక మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా ప్రజలు అభివృద్ధికి ఓటు వేశారన్నారు. కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ కూడా ఒక విజ్ఞప్తి చేస్తూ బిహార్‌ను వేగంగాఅభివృద్ధి చేయడానికి వీలుగా ఎన్‌డిఎను గెలిపించాలన్నారు.




# జనరల్
STATE & REGIONAL NEWS

## 8,9న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి కవులు, కళాకారుల శిక్షణ తరగతులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా అరసం, తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కవులు, కళాకారుల శిక్షణ తరగతులను ఈనెల 8,9 తేదీలలో హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్‌లో నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ తెలిపారు. శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ హాజరవుతారని ఒక ప్రకటనలో తెలిపారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా సమాజంలో మనిషి ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కార మార్గాలు, రైతులు, కూలీలు, ఉద్యోగులు, నిరుద్యోగులు, సంఘటిత, అసంఘటిత కార్మికుల హక్కులు, సబండ వర్గాల బాధలను పాటల ద్వారా, నాటికలు, వివిధ కళారూపాల ద్వారా తెలంగాణ ప్రజానాట్యమండలి ప్రజలను చైతన్యం చేసేందుకు వందేళ్ల సంబరాలు ఖమ్మంలో జరుగుతున్నాయని వివరించారు.

## సిఎంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?

### బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగాలు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే విధంగా ఉన్నాయని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ ఆరోపించారు. కోడ్‌ను ఉల్లంఘించిన సిఎంపైన ఎన్నికల కమిషన్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్‌ఏ శశిధర్ రెడ్డి, భరత్ కుమార్‌తో కలిసి వినోద్ కుమార్ మాట్లాడుతూ దూరదృష్టశావత్తు కేంద్ర ఎన్నికల సంఘం కూడా పక్షపాత వైఖరితో పని చేస్తోందన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే పథకాలు బంద్ అవుతాయని సిఎం అనడం కోడ్ ఉల్లంఘన కాదా అని ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న సిఇఒ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపైన ఫిర్యాదు చేసినప్పటికీ ఎందుకు స్పందించడం లేదని బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పని చేయాలని కోరారు.

**ముస్లింలపై జరుగుతున్న దాడులపై చర్యలు తీసుకోండి: బిఆర్ఎస్**
ముస్లింలపై జరుగుతున్న దాడులపై చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ ఎంఎల్ఎలు జీవన్ రెడ్డి, షకీల్ తదితరులు హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. ముస్లింలపై సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## 8న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో జరుగుతుందని సంఘం అధ్యక్షులు కలకొండ కాంతయ్య తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యులు టి.వెంకట్ రాములు హాజరుకానున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు.


ఫారం-సి
నోటిఫికేషన్
(చట్టంలోని సెక్షన్-11 కింద 10A మినహాయింపు ఇవ్వబడింది)
(రూల్ 6/12 చూడండి)
తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (LA) విభాగం

గెజిట్ నెంబర్: GHMC-47 తేది: 25.10.2025
No. C/665/2025. తేది: 25.10.2025

తెలంగాణ ప్రభుత్వం / స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్, GHMCకి ప్రజా ప్రయోజనం కోసం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కూకట్‌పల్లి గ్రామం & మండలంలో మొత్తం **7572.99 చదరపు గజాల** భూమి అవి H-CITI కింద EPC మోడ్ కింద కూకట్‌పల్లి 'Y' జంక్షన్ వద్ద NH-65 యొక్క LHSపై (అమీర్‌పేట్ వైపు) మూడు లేన్ల నిర్మాణం మరియు NH-65 యొక్క RHS పై (మియాపూర్ వైపు )మూడు లేన్ల నిర్మాణం అవసరం కనిపిస్తోంది.
అందువల్ల కూకట్‌పల్లి గ్రామం & మండలం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం **7572.99 చదరపు గజాలకు** ఎక్కువ లేదా తక్కువ ప్రామాణిక కొలత వివరాల వివరణ ఈ క్రింది విధంగా ఉన్నది, అక్విజిషన్ కోసం ప్రతిపాదించబడింది.

| క్ర. సం. | సర్వే నెం. | టైటిల్ రకం | భూమి రకం | విస్తీర్ణం చ.గ.లలో | ఆసక్తిగల వ్యక్తి పేరు & చిరునామా | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు [illegible] | [illegible] | నిర్మాణములు రకం | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| | | | | | కూకట్‌పల్లి సర్కిల్-24 | | | | | | | | |
| 1 | - | - | - | 1733.75 | కాశి అన్నపూర్ణ & ఇతరులు 5-5-34/2 | | | | | - | - | - | - |
| 2 | - | - | - | 97.22 | శ్రీకాంత్ 419(పి) | | | | | - | - | - | - |
| 3 | - | - | - | 33.52 | యజమాని / ఆక్రమణదారు 5-5-32-2/1 | | | | | - | - | - | - |
| 4 | - | - | - | 321.18 | మసీదు - | | | | | - | - | - | - |
| 5 | - | - | - | 158.75 | Md. కుతాబుద్దీన్ ఖోస్రో 5-5-32/1/A | | | | | - | - | - | - |
| 6 | - | - | - | 169.16 | R.V.S.రఖిలా ప్రసాద్ 5-5-34 | | | | | - | - | - | - |
| 7 | - | - | - | 15.25 | R.V.S.రఖిలా ప్రసాద్ 5-5-33 | | | | | - | - | - | - |
| 8 | - | - | - | 48.16 | ఎన్.జె.లలిత 5-5-32 | | | | | - | - | - | - |
| 9 | - | - | - | 32.79 | ఎన్.జె.లలిత 5-5-31 | | | | | - | - | - | - |
| 10 | - | - | - | 122.66 | రేఖాంశం-అక్షాంశం 17.478058, 78.420825 ఓపెన్ ప్లాట్ (సర్వేనం: 121, 122, 123, 124, 139 & 665, 666 & 667) | | | | | - | - | - | - |
| 11 | - | - | - | 41.08 | రేఖాంశం-అక్షాంశం 17.478231, 78.420432 ఓపెన్ ప్లాట్ (సర్వేనం: 121, 122, 123, 124, 139 & 665, 666 & 667) | | | | | - | - | - | - |
| 12 | - | - | - | 468.41 | రేఖాంశం-అక్షాంశం 17.478743, 78.419886 ఓపెన్ ప్లాట్ (సర్వేనం: 121, 122, 123, 124, 139 & 665, 666 & 667) | | | | | - | - | - | - |
| 13 | - | - | - | 173 | రేఖాంశం-అక్షాంశం 17.4795017, 78.4191051 ఓపెన్ ప్లాట్ (సర్వేనం: 121, 122, 123, 124, 139 & 665, 666 & 667) | | | | | - | - | - | - |
| 14 | - | - | - | 54.88 | రేఖాంశం-అక్షాంశం 17.479554, 78.418684 ఓపెన్ ప్లాట్ (సర్వేనం: 121, 122, 123, 124, 139 & 665, 666 & 667) | | | | | - | - | - | - |
| 15 | - | - | - | 167.59 | రేఖాంశం-అక్షాంశం 17.479921, 78.418296 ఓపెన్ ప్లాట్ (సర్వేనం: 121, 122, 123, 124, 139 & 665, 666 & 667) | స్కెచ్ ప్రకారం | | | | - | - | - | - |
| 16 | - | - | - | 290.27 | భూపతి రాజు రవిశంకర్ రాజు 5-7-54, 5-7-71/1 & 5-7-71 | | | | | - | - | - | - |
| 17 | - | - | - | 104.27 | రాజేష్ 5-7-68/సి | | | | | - | - | - | - |
| 18 | - | - | - | 104.19 | రమా రాణి 5-7-68/బి | | | | | - | - | - | - |
| 19 | - | - | - | 122.5 | నగేష్ కాంతారావు 5-7-68/ఎ | | | | | - | - | - | - |
| 20 | - | - | - | 165.37 | రత్నమాల 5-7-68/NR | | | | | - | - | - | - |
| 21 | - | - | - | 257.45 | పద్మాదేవి, మూర్తి 5-7-65 | | | | | - | - | - | - |
| 22 | - | - | - | 70.78 | అప్పారావు 5-7-63 | | | | | - | - | - | - |
| 23 | - | - | - | 58.25 | సంగమేశ్వర్, జి. వీర రాఘవ 5-6-1/3/NR | | | | | - | - | - | - |
| 24 | - | - | - | 74.12 | వి వసంత 5-6-1 | | | | | - | - | - | - |
| 25 | - | - | - | 324.07 | విజయ్ కుమార్, పవన్ కుమార్ 5-6-1/1 | | | | | - | - | - | - |
| 26 | - | - | - | 1198.46 | గ్రేవ్ యార్డ్ - | | | | | - | - | - | - |
| 27 | - | - | - | 58.68 | రాజమణి 5-6-11 | | | | | - | - | - | - |
| 28 | - | - | - | 421.54 | సురేందర్ రావు 5-5-30 | | | | | - | - | - | - |
| 29 | - | - | - | 211.82 | అనంత రెడ్డి 5-5-25 | | | | | - | - | - | - |
| 30 | - | - | - | 16.14 | శ్రీనివాస్ 5-1-65 | | | | | - | - | - | - |
| 31 | - | - | - | 37.81 | కృష్ణా రెడ్డి 5-1-64/5/2 | | | | | - | - | - | - |
| 32 | - | - | - | 33.05 | దామోదర్ 5-1-64/7 | | | | | - | - | - | - |
| 33 | - | - | - | 29 | వీరా రెడ్డి 5-1-64/5 | | | | | - | - | - | - |
| 34 | - | - | - | 124.28 | గోకుల్ ఎన్‌క్లేవ్ 5-1-64/4 | | | | | - | - | - | - |
| 35 | - | - | - | 233.54 | పి. శ్రీనివాస్ రావు & ఇతరులు 5-1-64/3/A & 5-1-5-64/3/B | | | | | - | - | - | - |
| మొత్తం | | | | 7572.99 | | | | | | | | | |

ఈ నోటిఫికేషన్ భూసేకరణ పునరావాసం, పునరావాసంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కుచట్టం 2013 (కేంద్ర చట్టం నెం. 30/2013)లోని సెక్షన్- 11 (1)లోని నిబంధనల ప్రకారం చేయబడింది. ఇది సంబంధించిన వారందరి కోసం భూసేకరణ, పునరావాసం, పునరావాసంలో న్యాయమైన పరిహారం పారదర్శకత హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (2017 చట్టం నెం. 21) ద్వారా సవరించబడింది.
భూమి యొక్క ప్లాన్‌ను స్పెషల్ కలెక్టర్ (LA) &కమిషనర్, GHMC, హైదరాబాద్ కార్యాలయంలో తనిఖీ చేయవచ్చు. తెలంగాణ ప్రభుత్వం / స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్ GHMC, హైదరాబాద్-కమ్-ఆథరైజ్ ఆఫీసర్ అనగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ, GHMC, హైదరాబాద్ మరియు అతని సిబ్బంది ల్యాండ్‌లోకి ప్రవేశించి సర్వే చేయడం, ఏదైనా భూమిని చదును చేయడం, భూగర్భంలో తవ్వడం లేదా బోర్ వేయడం పరిశీలించి, ఆ చట్టంలోని నిర్దిష్ట సెక్షన్-12 అందించిన మరియు పేర్కొన్న విధంగా వారి పనిని సరిగ్గా అమలుచేయడానికి అవసరమైన అన్ని ఇతర చర్యలను చేస్తారు.
ఈ చట్టంలోని సెక్షన్ 11 (4) ప్రకారం, హైదరాబాద్‌లోని స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్ GHMC నుండి ముందస్తు అనుమతి లేకుండా ఏ వ్యక్తి కూడా అటువంటి నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి అటువంటి భూమిపై ఎటువంటి లావాదేవీలు చేయకూడదు లేదా ఏదైనా లావాదేవీకి కారణం కాకూడదు. అంటే అమ్మకం / కొనుగోలు మొదలైనవి చేయకూడదు. లేదా అటువంటి భూమిపై ఏదైనా భారాన్ని సృష్టించకూడదు.
ఈ భూసేకరణ కోసం ఏవైనా అభ్యంతరాలు ఉంటే, పరిహారం చర్యల ద్వారా పరిష్కారం కోసం ఆసక్తిఉన్న /ప్రభావితమైన వారందరి నుండి వచ్చే క్లెయిమ్‌లను చట్టంలోని సెక్షన్ 15 కింద అందించిన విధంగా ఈ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవై) రోజుల లోపు ప్రత్యేక కలెక్టర్ (LA) & కమిషనర్, GHMC, హైదరాబాద్ / అధీకృత అధికారి ముందు దాఖలు చేసుకోగలరు.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, LA, GHMC, హైదరాబాద్.
సం/- స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్, GHMC, హైదరాబాద్.
DIPR RO NO. 802/LA/PP/ADVT/AGENCY/2025-26


# భారత గడ్డపై సిపిఐ 100ఏళ్ల ప్రస్థానం

### డిసెంబర్ 26న ఖమ్మంలో ముగింపు ఉత్సవాలు
### లక్షలాది మందితో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి : పల్లా వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి నేటికి భారత గడ్డపై 100 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో జరిగే సిపిఐ ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన సిపిఐ నియోజకవర్గ సమితి సభ్యుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదటిగా గర్జించిన పార్టీ సిపిఐ అని అన్నారు. 100 ఏళ్ల ఉత్సవాల సందర్భంగా పార్టీ ఆవిర్భవించిన కాన్పూర్‌లో గత సంవత్సరం 26న ప్రారంభమై దేశవ్యాప్తంగా ఉత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్నాయని అన్నారు. బ్రిటిష్ వారి నుండి దేశ విముక్తికి రాజీలేని పోరాటాలు చేస్తున్నందునే ఆనాడు పార్టీపై నిషేధం విధించాలని అన్నారు. ఎన్ని నిర్బంధాలు చేసిన జైలలో పెట్టిన అలుపెరగకుండా కార్మిక విద్యార్థి యువజన రైతు, మహిళా, ప్రజా సంఘాలను నిర్మించి వెట్టిచాకిరి విముక్తి కొరకు కార్మికులు కర్షకులను దోపిడి నుండి విముక్తి చేయడానికి రాజీలేని పోరాటాలు సిపిఐ నిర్వహించిందని ఆయన అన్నారు. దశాబ్ద కాలంలో ఎన్నో పోరాటాలు ఎన్నెన్నో త్యాగాలు ఎంతో మంది అమరుల రక్త తర్పణంతో ఎన్నో విజయాలు సాధించి భారతదేశ రాజకీయ చరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేకస్థానం సంపాదించుకున్నదని ఆయన అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి గద్దె దించడానికి జరిగిన మహోత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగ్నర వేల మంది ప్రాణత్యాగాలతో మూడు వేల గ్రామాల విముక్తి, పదిలక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని ఆయన గుర్తు చేశారు. ఆనాటి సాయుధ పోరాటమే అనేక ఉద్యమాలకు నెలవై అనేకమంది వీరులకు జన్మనిచ్చిందని ఆ స్ఫూర్తితోనే నేటికి పోరాట గడ్డగా బాసిల్లుతున్నదని అన్నారు. పాలకులు భూసంస్కరణ చట్టం గరీబి హటావో బ్యాంకుల జాతీయీకరణ అనేక సంస్కరణలను చేయాల్సి వచ్చిందని పోరాటాల ద్వారా దేశంలో అనేక కార్మిక సంక్షేమ చట్టాలను సాధించింది కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. నాగార్జునసాగర్, శ్రీరామ్‌సాగర్, సీతారామ ప్రాజెక్ట్ లాంటి అనేక ప్రాజెక్టుల సాధనలో అలుపెరుగని పోరాటం సిపిఐ చేసిందని, తెలంగాణకు తలమానికమైన సింగరేణి సంస్థను పరిరక్షించేందుకు కార్మికుల సమస్యలపైన అలుపెరుగని పోరాటాలు నిర్వహించింది సిపిఐ అని అన్నారు. ఆరు దశాబ్దాలుగా ప్రజల, కార్మికుల త్యాగాలతో నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలను ఎల్ఐసి, బ్యాంకులు, టెలికాం, గనులు చివరికి రక్షణ రంగ పరిశ్రమలను సైతం ప్రైవేట్‌కు కట్టబెడుతున్నారని అన్నారు. దేశ సంపదను అంబానీ, కార్పొరేట్ పెట్టుబడిదారులకు దోచిపెడుతూ సంపన్నులు మరింత సంపన్నులు అవుతుంటే తపేదలు మరింత పేదలుగా అవుతున్నారని, రైతులు, కార్మికులను పెట్టుబడిదారులకు కట్టు బానిసలుగా మార్చే చట్టాలు బిజెపి తెచ్చిందని వీటి రద్దు కొరకు సిపిఐ నిరంతరం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు ఐక్యత వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యత కోసం సిపిఐ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశంలో నెలకొన్న పరిస్థితులలో కమ్యూనిస్టులు మరింతగా బలపడాలని అందుకోసం నల్గొండ జిల్లాలో పార్టీ బలోపేతానికి గ్రామశాఖల బలోపేతం చేసి నిర్మాణం దిశగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని అన్నారు. శత వసంతాల ముగింపు సభకు ఖమ్మం నగరం వేదిక కావడం జరిగిందని ఈ సభకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుండి దక్షిణాది రాష్ట్రాల నుండి వేలాదిగా ప్రజలు పాల్గొంటున్నారని, సిపిఐ నల్గొండ జిల్లా పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎంఎల్ఏ ఉజ్జిని యాదగిరి రావు, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు, సిపిఐ మండల కార్యదర్శులు వెంకటరమణ, కనకాచారి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటయ్య, జయరాములు, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

## గీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి





### గీత పని వారల సంఘం రాష్ట్ర సమితి పిలుపు
### ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్‌కు మెమోరాండం అందజేత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గీత పని వారల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గీత పని వారల సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు గీత కార్మికులు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఆబ్కారీ భవన్ వద్ద గీత పని వారల సంఘం నాయకులు, కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలను తక్షణం విడుదల చేయాలని, ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు, పెన్షన్‌ను రూ.5వేలకు పెంచాలని, గీత వన పెంపకానికి 500 జీఓ ప్రకారం పది ఎకరాల భూమి ఇవ్వాలని వృత్తిని ఆధునికరించాలని, ఏజెన్సీ ఏరియాలలో కల్లు గీస్తున్న వృత్తిదారులకు సొసైటీలు ఎల్ఎఫ్‌టిలు ఇవ్వాలని గీత కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిల్ గౌడ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్ ఆర్.సురేష్‌కు ఒక విజ్ఞాపన పత్రాన్ని అందజేసింది. కార్యక్రమంలో సంఘం సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, నాయకులు కెవిఎల్, పి.రాములు, యాదయ్య, టి.రాములు, సుదర్శన్‌గౌడ్, పి.పర్వతాలు, శ్రీశైలం, పొలగాని రవికుమార్, డి.జి.నరేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కరించకపోతే తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రధాన కార్యదర్శి డి.జి. సాయిల్ గౌడ్ ఈ నెలలో సంఘధం రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

**రంగారెడ్డి జిల్లా సూపరింటెంట్‌కూ మెమోరాండం**
గీత పనివారల సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ డివిజన్ సూపరింటెంట్ ఉజ్వలా రెడ్డికి సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి.రాములు నేతృత్వంలో విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్వతాలు గౌడ్, ఉడతల మల్లేష్ గౌడ్, ఎం.శ్రీశైలం గౌడ్, ఎం.సుధాకర్ గౌడ్, పి.వెంకటేష్ గౌడ్, పరమేష్‌లతో కూడిన ప్రతినిధి బృందం పాల్గొన్నారు.

## రూ.67 కోట్లు విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కు చాడ లేఖ



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** ఇటీవల కురిసిన భారీ మొంథా తుఫాన్‌తో వరద కాలువ తెగిపోయాయని, వాటివల్ల తీవ్ర నష్టం జరిగిందని, కాలువ పనులకు సంబంధించి ప్యాకేజీ 3లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని, భూసేకరణ కోసం రూ.67 కోట్ల నిధులు విడుదల చేయాలని సిపిఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి బుధవారం నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. శ్రీరామ్ సాగర్ వరద కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు గాను చిగురుమామిడి మండలం ఇందుర్తి కెనాల్ నుంచి భీమదేవరపల్లి మండలం వరకు ప్యాకేజీ 3లో చేపట్టాల్సిన పనుల కోసం నిధుల విడుదల మూలంగా జాప్యం జరిగి పనులు నిలిచిపోయాయన్నారు. ఫలితంగా ఇందుర్తి, ముదిమాణిక్యం, ముల్కనూరు, లంబాడిపల్లి, సీతారాంపూర్, పీచుపల్లి, రేకొండ గ్రామాల మీదుగా సైదాపూర్ మండలం, భీమదేవరపల్లి మండలంలోని గ్రామాల వరకు కెనాల్ పనులు చేయడానికి భూసేకరణ కోసం రూ.67 కోట్లు అవసరమవుతాయని ఎస్టిమేట్లు వేయబడ్డాయని తెలిపారు. రాష్ట్ర స్టాండింగ్ కమిటీలోనూ ఉన్నాయని, సూపర్ స్ట్రక్చర్స్, బ్రిడ్జిలు, కల్వర్టులు నిర్మించడం వల్ల అవి వరదలకు కొట్టుకుపోయి గండ్లు పడుతున్నాయన్నారు. నూతన స్ట్రక్చర్లు, కల్వర్టులు, నిర్మాణం పూర్తి చేయడానికి ప్రతిపాదనలు పంపారని తెలిపారు. ఇసుక మేటలు పెట్టడం వల్ల రైతులు తీవ్రంగా నష్టాలపాలయ్యారని వాపోయారు. ప్యాకేజీ త్రీలో నిలిచిపోయిన పనులు పూర్తి చేయుటకు యుద్ధ ప్రాతిపదికన భూసేకరణకు ఆరు కోట్లు, కొత్తగా భూసేకరణకు రూ.10 కోట్ల రూపాయలు విడుదల చేయాలన్నారు. ఇది వరకు పనిచేస్తున్న ఏజెన్సీ ఇంకా రూ.15 కోట్లు పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. కొత్తగా మంజూరు చేయబడిన రూ.42 కోట్లకు టెండర్లు పిలవాలని చాడ వెంకటరెడ్డి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు.

## ఓటమి భయంతోనే కెటిఆర్ దిగజారుడు వ్యాఖ్యలు

### ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం ఖాయం : మంత్రి జూపల్లి కృష్ణా రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు, ఆ పార్టీ నేతలు దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని మూసాపేటలో ఫంక్షన్ హాల్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో స్థిరపడిన కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్లతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని, అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎవరూ చేయని అప్పులు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చేశారని విమర్శించారు. ఆయన చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏడాదికి రూ.75 కోట్ల వడ్డీలు చెల్లిస్తుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డిపై కెటిఆర్ వ్యాఖ్యలు దివాలా కోరుతనాన్ని చాటుతున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓటు వేయడమే కాకుండా, ఇంటింటికి తిరుగుతూ నవీన్ యాదవ్‌కు మద్దతుగా నిలబడి ఓట్లు వేయించాలని కోరారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమైందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీయే విజయం సాధిస్తుందని జూపల్లి కృష్ణారావు ధీమా వ్యక్తం చేశారు.

# కెటిఆర్ అహంకారం, అవినీతిని ప్రజలు తిప్పికొడతారు

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అహంకారంతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను రౌడీషీటర్‌గా పేర్కొనడం అత్యంత దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర సహాయక కార్యదర్శి ఇ.టి.నరసింహ అన్నారు. గత 10 సంవత్సరాలుగా బిఆర్ఎస్ హయంలో మంత్రిగా ఉన్న కెటిఆర్ లక్ష కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డ 'గజదొంగ' అని విమర్శించారు. కెటిఆర్ తన తీరు మార్చుకోకపోతే బస్‌స్టాండ్‌లు, పోలీస్ స్టేషన్‌లలో ఆయన ఫొటోలను ప్రజలు పెట్టాల్సిన వస్తారని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కృష్ణానగర్, శ్రీలక్ష్మి నరసింహనగర్, ఇంద్రానగర్ ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించాయి. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ మాట్లాడుతూ, హైదరాబాద్ చరిత్ర తెలియని కెటిఆర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. కుస్తీ పహిల్వాన్‌లను రౌడీలుగా చూపించడం తెలంగాణ సమాజం ఎప్పటికీ క్షమించదన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఇలాంటి నాయకుడిని గెలిపించడం ప్రజల బాధ్యత అని ఈ.టి.నరసింహ అన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా కాంగ్రెస్ అభ్యర్థి మద్దతుగా ప్రచారాన్ని విస్తృతంగా కొనసాగిస్తూ, కరపత్రాలు ముద్రించి ఇంటింటికీ పంపిణీ చేస్తున్నామన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ప్రజల ఓట్లతో స్పష్టమైన మెజారిటీ సాధించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.ఎస్. బోస్, కార్యవర్గ సభ్యులు ఎస్. ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయక కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, మామిడి చెట్ల వెంకటస్వామి, కౌన్సిల్ సభ్యులు మహమూద్, కొమురెల్లి బాబు, చెట్టుకింది శ్రీనివాస్, బాలకృష్ణ, అనిల్, నరసింహ, గౌస్, అరుణ్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం, రోడ్లు మరియు భవనాల శాఖ
"e"procurement Notice No.10/AEE/SEJSB/2025-26, తేది: 30.10.2025
1. ములుగు జిల్లాలో 04 పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించడమైనది. టెండరుదారులు టెండర్ షెడ్యూళ్లను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in నుండి 06.11.2025న మ.3.30గం.లకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పైన పేర్కొన్న పనులకు టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది మరియు సమయం: 13.11.2025న మ.3.30గం.ల వరకు లేదా అంతకు ముందు. 2. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in/లో చూడవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B), సర్కిల్, జెఎస్ భూపాలపల్లి.
DIPR R.O. No. : 10309-PP/CL/ADVT/1/2025-26, Date: 06-11-2025



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్-14, జిహెచ్‌ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, హైదరాబాద్.
RFQ.No. 17/EE/C14/GHMC/KZ/2025-26 ప్రకటన తేది: 06.11.2025
జిహెచ్‌ఎంసి హైదరాబాద్, కెజెడ్, సర్కిల్-14, గోషామహల్‌కు సప్లయి & డెలివరీ ఆధారంగా రోడ్ బాండ్ (బ్యాగ్స్) మరియు ఆర్ఎస్1 (ప్యాకేజ్) సరఫరా కొరకు కొటేషన్లను అభ్యర్థించడమైనది. పని కోసం కొటేషన్లకు అభ్యర్థన.

| | |
|---|---|
| టెండర్ నోటిఫికేషన్/బిడ్ కాల్ తేదీ/ ప్రాజెక్ట్ పనుల వివరాలు పొందడం | 07.11.2025 @ 03.00 PM |
| బిడ్ సమర్పణ గడువు తేదీ మరియు సమయం /(లేదా) సీల్డ్ కొటేషన్ అందుకోవడానికి గడువు | 10.11.2025 @ 03:00 PM |
| ప్రీక్వాలిఫికేషన్ & టెక్నికల్ బిడ్లను తెరచిచూసే సమయం | 10.11.2025@ 03:30 PM |

గమనిక:
1) ఆఫ్‌లైన్ టెండర్ :- పనుల వివరాలను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ 14, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్ కార్యాలయం నుండి పొందవచ్చు మరియు సీల్డ్ కొటేషన్లను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ 14, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్ కార్యాలయంలో సమర్పించవచ్చు.
(లేదా)
2) ఆన్‌లైన్ టెండర్:- ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ (tender.telangana.gov.in)లో పాల్గొనవచ్చు.
కాబట్టి అర్హత కలిగిన ఏజెన్సీలు పైన పేర్కొన్న గడువులోపు అవసరమైన అన్ని వివరాలతో తమ బిడ్‌ను సమర్పించవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సర్కిల్-14, జిహెచ్‌ఎంసి
DIPR R.O. No. : 10306-PP/CL/ADVT/1/2025-26, Date: 06-11-2025

## త్వరగా ఇందిరమ్మ ఇండ్ల పనులు పూర్తి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరగా పూర్తి చేసేవిధంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. గురువారం బీబీనగర్ మండలం జమీలా పేట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ గ్రామంలో ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అందులో ఎన్ని ఇండ్లు పూర్తి అయ్యే దశలో ఉన్నాయని అడిగి తెలుసుకు న్నారు. వివిధ దశలో పూర్తి అయిన వాటికి వెంటనే డబ్బులు జమ అవుతాయని అన్నారు. ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసు కొని గృహ ప్రవేశం చేపట్టాలని లబ్ధిదారు లకు సూచించారు.



## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు : ఆర్‌డిఓ

**ప్రజాపక్షం/చిట్యాల:** ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, అట్టి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని నల్లగొండ ఆర్‌డిఓ అశోక్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా పెద్దకాపర్తి గ్రామం లోని శ్రీ తిరుమల నాథ ఆలయ భూములుతో పాటు, ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్న విషయంపై గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఆర్‌డిఓ శుక్రవారం రోజున క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజులలో ఫిర్యాదుదారులతో పాటు దేవాలయ భూము లకు నాలుగు వైపుల ఉన్న రైతులకు నోటీసులు అందజేసి, హద్దురాళ్ళను ఏర్పాటు చేస్తామని, హెచ్చరిక బోర్డులను కూడా పెడతామన్నారు. ఆక్రమ ణదారులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. వారి వెంట దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ భాస్కర్, ఈఓ నాగిరెడ్డి, ఇంఛార్జ్ తహసిల్దార్ విజయ, ఆర్ఐ అమరేందర్‌రెడ్డిలతో పాటు గ్రామస్థులు చేకూరి గణేష్ మాదిగ, పొట్లపల్లి చిన్నస్వామి గౌడ్ తదితరులు పాల్గొ న్నారు.



## రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

**ప్రజాపక్షం/ కోదాడ:** మొంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్న చంద్ర శేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురు వారం మునగాల మండల వ్యాపంగా తుఫాన్‌కు దెబ్బతిన్నవరి పంటలను వారు పరిశీలించి మాట్లాడుతూ ఎకరాకు రాష్ట్ర ప్రభుత్వం 10వేలు ప్రకటన మంచిదేకాని ప్రస్తుతం రైతుల పెట్టుబడులు భారీగా పెరిగాయి. వాటిని దృష్టిలో పెట్టుకు కేంద్రం 20వేలు, రాష్ట్రం 20వేలు చెల్లించి రైతంగాన్ని ఆదు కోవాలని ప్రభుత్వలను డిమాండ్ చేశారు. అనేక గ్రామాలలో క్షేత్రస్థాయి పంట నష్టంపై వ్యవసాయాధికారులు అధికారులు పరిశీలించడం లేదని, ఇప్పటికైన వారు నిష్పక్షపాతంగా పరిశీలించి నివేదికలు ప్రభుత్వానికి అందించి రైతులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్, మునగాల సిపిఐ కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

## రూ.కోటి ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/సూర్యాపేట :** కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన కానిస్టేబుల్ రాంబాబు కుటుం బానికి స్టేట్ బ్యాంక్ పోలీస్ సాలరీ ప్యాకేజీ ద్వారా ఒక కోటి రూపాయల ఎస్‌బిఐ ఇన్సూరెన్స్ చెక్కును జిల్లా ఎస్‌పి కె నరసింహ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది మరణించిన క్రమంలో పోలీస్ శాలరీ ప్యాకెజి అకౌంట్ ద్వారా రూ. ఒక కోటి రూపాయల ఇన్సూరెన్స్ అందిస్తుందన్నారు. ఈ స్కీం ద్వారా రాంబాబు కుటుంబ సభ్యులకు రూ. కోటి చెక్కును అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించి క్షేమంగా గమ్యాలకు చేరుకోవాలన్నారు. ఈ స్కీంను రూపొందించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, ఏఓ మంజు భార్గవి, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికా రులు అనిల్ కుమార్, మోహన్ కుమార్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

## పెండింగ్ ఫీజులను విడుదల చేయాలి



**ప్రజాపక్షం/చింతపల్లి :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాల ర్షిప్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య( ఏఐఎస్ఎఫ్) నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేప ట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మురళీకృష్ణ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్లో ఫీజులు 8 వేల కోట్లకు పైగా ఉన్నా యని, దీని వలన పేద విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆపేయాల్సిన పరి స్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలో ఫిట్నెస్ లేకుండా, ఫస్ట్ ఎయిడ్ బాక్సు,ఫైర్ సేఫ్టీ లేకుండా నడుస్తున్నటువంటి బస్సులను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి వట్టేపు శివకుమార్, డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ శంశోద్దీన్, మండల అధ్యక్షుడు శివ పాల్గొన్నారు.

## విషహారం తిని వందకు పైగా గొర్రెలు మృతి

సుమారు రూ.20 లక్షల నష్టం..రోదిస్తున్న గొర్రెల కాపరులు

**ప్రజాపక్షం/వేములపల్లి:** విష ఆహారం తిని 100కు పైగా గొర్రెలు మృతి చెందిన సంఘటన వేము లపల్లిమండల కేంద్రం సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరా ల్లోకి వెళితే సూర్యాపేట జిల్లా, పెన్‌పహాడ్ మం డలం, అన్నారం,అనం తరం, దోసపాడు గ్రామా లకు చెందిన ఉప్పునూతల సైదులు,శ్రీరాముల కోటయ్య,శ్రీరాముల గోపాలు,ఆవుల కోటయ్య, ఆవుల వెంకన్నలు తమ గొర్రెలను గత కొన్ని రోజులుగా మండల కేంద్రం సమీపంలో మేపుతున్నారు. కాగా బుధవారం రాత్రి 80 గొర్రెలు,గురువారం 40 గొర్రెలకు పైగా మృతి చెందినట్లు తెలి పారు. సుమారు 20 లక్షల పైగా నష్టం వాటిల్లినట్లు గొర్రెల కాపరులు వాపోయారు.భారీ సంఖ్యలో గొర్రెలు చనిపోవడంతో గొర్రెల కాపరులు రోధి స్తున్నారు.ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.గొర్రెలు చనిపోవడానికి కారణం విషపు ఆహారం కానీ, విషపు నీరు కానీ అయ్యుండొచ్చు అని స్థానిక పశు వైద్యాధికారి అశోక్ తెలిపారు. పోస్టుమార్టం తర్వాత గొర్రెల మృతికి కారణాలు తెలుస్తాయి అన్నారు.



## సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాజాత

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ (చివ్వెంల) :** తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో యువత సిగిరెట్, గంజాయి, డ్రగ్స్ మత్తుకు బానిసలు కావ ద్దంటూ చివ్వెంల మండల కేంద్రంలో కళాజాత ప్రదర్శన చేశారు. మత్తుకు బానిసలై తల్లిదండ్రులకు, కుటుంబానికి భారం కావద్దన్నారు. పరిసరాల పరిశుభ్రత, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు కళారూపాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారధి సభ్యులు పాలకుర్తి శ్రీకాంత్, పల్లెల రాము, పల్లెల లక్ష్మణ్ పాల్గొన్నారు.

# సీరియల్ నంబర్‌తో సంబంధం లేదు

తేమ నాణ్యత ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి :కలెక్టర్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వర్షాలు తగ్గినందు న17తేమ వచ్చే విధంగా రైతులు కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని బాగా ఆరబెట్టాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు సూచిం చారు. సరైన తేమశాతం, నాణ్యత ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి మిల్లు లకు పంపించాలని, ఇందుకుగాను అవసరమైన లారీలు, హమాలీలు, కాంటాలు అన్ని సిద్ధంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. గురువారం ఆమె మండలంలోని జి.చెన్నారం, చర్లపల్లి, దండెంపల్లిలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిస్థితిని పర్యవేక్షించారు. ముందుగా జి. చెన్నారం వెళ్లిన జిల్లా కలెక్టర్ అక్కడ కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు.ఇప్ప టివరకు వచ్చిన ధాన్యం తేమ శాతం అన్ని వివరా లను నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకు న్నారు. 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని తక్ష ణమే మిల్లులకు పంపించేందుకు ఎక్కువ లారీ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీరియల్ నంబర్‌తో సంబంధం లేకుండా సరైన తేమ వచ్చిన అన్ని కుప్పలను కొనుగోలు చేసి మిల్లు లకు పంపించాలని అన్నారు. లారీల సమస్య ,ఇతర ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసు కురావాలని అన్నారు.జిల్లా కలెక్టర్ వెంట రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, డిఎస్ఓ వెంక టేష్ ,పౌరసరఫరాల డిఎం గోపికృష్ణ, తహసిల్దార్ పరశురామ్ తదితరులు ఉన్నారు.

### ధాన్యం కొనుగోలులో మిల్లర్లు సహకరించాలి

**ప్రజాపక్షం/చిట్యాల :** వానాకాలం సీజన్‌లో పండించిన ధాన్యం కొనుగోలులో రైస్ మిల్లర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని వట్టిమర్తి గ్రామ పరిధిలో ఉన్న సిద్ధార్థ రైస్ మిల్లును శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాల కారణంగా గడిచిన వారం, పది రోజులుగా ధాన్యం రైస్ మిల్లులకు రాలేదని, వర్షాలు తగ్గుముఖం పట్టిన కారణంగా మిల్లు లకు ధాన్యం చేరుతుందన్నారు. దిగుమతి చేసు కోవడంలో ఆలస్యం చేయకూడదని, ధాన్యం రాగానే వెంటనే దిగుమతి చేసుకోవాలని, దానికి కావల్సిన ఏర్పాట్లను చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లుకు వచ్చిన ధాన్యం వివ రాలను పరిశీలించారు. ఇప్పటి వరకు వచ్చిన లారీల వివరాలు, తేమ శాతం, ఇతర నాణ్యత ప్రమాణాల వివరాలను రైస్ మిల్లు యజమాని పోలా పెద్దయ్య ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట రెవిన్యూ శాఖ అదనపు కలెక్టర్ జి శ్రీనివాస్, జిల్లా పౌరసౌరఫర శాఖాధికారి వెంక టేశ్వర్లు, మేనేజర్ గోపికృష్ణ, సహకార శాఖాధి కారి పత్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగాన్ని అంతం చేయడంలో ప్రభుత్వాలు విఫలం

శతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభకు యువత తరలిరావాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర




**ప్రజాపక్షం/నల్లగొండ :** ఖమ్మం జిల్లాలో డిసెంబర్ 26న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)శతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభ విజయ వంతం చేయడానికి యువత నడుం బిగించి అధిక సంఖ్యలో ఖమ్మంకు తర లిరావాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశం నల్లగొండలోని మక్దూమ్ భవన్ సిపిఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్ అధ్యక్షతన జరిగింది.ఈసమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర మాట్లా డుతూ సిపిఐ బహిరంగ సభ విజయవంతం చేయడం కోసం రాష్ట్రవ్యా ప్తంగా చేపట్టిన ప్రచార బస్సు జాతాలు ఈనెల 17 నుంచి కొనసాగుతున్నా యని ఈ జాత ప్రచారం చేయడంలో కీలక పాత్ర పోషించాలన్నారు.నిరుద్యో గాన్ని అంతం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యారని అన్నారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం వల్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవు తుందన్నారు.అటు ప్రభుత్వ రంగం నుండి కొత్త ఉద్యోగ ప్రకటనలు తక్కు వగా రావడం,ఇటు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కోల్పోవడం,ఈ రెండు కలసి ఒక కుంభమేళంలాగా నిరుద్యోగాన్ని పెంచిపెడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.ప్రభుత్వ నియామక ప్రక్రియలు చాలా నెమ్మదిగా జరగడం, గ్రూప్ పరీక్షల ప్రకటనలు సంవత్సరాల తరబడి అలస్యం అవుతుం డగా,నియామకాల్లో తారతమ్యాలు, కోర్టుల స్టేలు, రాజకీయ ప్రతిస్పంద నలు మరింత కల్లోలం సృష్టిస్తున్నాయన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారి వేంకటేశ్వర్లు లు మాట్లాడుతూ ఖమ్మంలో నిర్వహిస్తున్న సిపిఐ శాతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభ విజయవంతం చేయడానికి జిల్లాలో జనసేన దళం శిక్షణ శిబిరాలు దేవరకొండ, మునుగోడు నియోజక వర్గం లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉపాధి కల్పన కేంద్రాలు నామమాత్రంగా వ్యవహరిస్తోందని, ఉపాధికి అవసరమయ్యే నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించా లని వారు డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఆసుపత్రుల సమస్యలపై సర్వేలు నిర్వ హిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ నవీన్ అన్నమల్ల,మల్లేష్,గడ్డం నవీన్,మహేందర్,దశరథ, కట్కూరి లింగస్వామి, నేతల నరేష్,రాజు,గోపగోని ఉదయ్, అక్కలయ్య, బాబు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలి

ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు 24 గంటలు అందు బాటులో ఉండాలని ఏఐవై ఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబో యిన మహేందర్ అన్నారు. గురువారం అఖిల భారత యువజన సమైక్య జిల్లా కమిటీ పిలుపుమేరకు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. డాక్టర్ పావనికి మెమో రాండం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలో 20 వేల జనాభాతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రం యాద గిరిగుట్టకు రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు వేలాదిగా దర్శనానికి వస్తూ ఉంటారు. ఆరోగ్య సమస్యలు వస్తే భక్తులతో పాటు స్థానికులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కావున 24 గంటలు డాక్టర్లు, వైద్య సేవలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కనీసం అటెండర్ లేక పోవడం చాలా ఇబ్బందికరమని వెంటనే అటెండర్‌ను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, ఏఐవైఎఫ్ నాయకులు అనంతుల నర సింహ, గోపగాని రాజు, గుండు వెంకటేష్, పేరబోయిన మహేష్, సంఘీ అర వింద్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కనీస మౌలిక వసతులు కల్పించాలి



**ప్రజాపక్షం/వలిగొండ :** అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా సమితి పిలుపుమేరకు వలిగొండ, వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సందర్శన అనంతరం వలిగొండ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సదుపాయం ఆసుపత్రిగా ఉన్నది. మెడికల్ డాక్టర్ లేక, ఉన్న ఒకే డాక్టర్ అది కూడా దాదాపు 8 నెలలుగా డిప్యూటేషన్ పైన విధులు కొనసాగిస్తున్నారు. వాచ్మెన్, అటెండర్ లేక ఇబ్బందులు పడవలసి వస్తుంది వెంటనే పూర్తిస్థాయి సిబ్బం దిని నియమించాలని అన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఉన్న సిబ్బందిని రెగ్యుల రైజ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు మారోజు నరసి మాచారి, సుద్దాల సాయికుమార్, సహాయ కార్యదర్శి గుండెగాని నాగరాజ్, సలిగంజి కృష్ణకుమార్, సోమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** బాలల హక్కుల పరిరక్షణ సమితి కమిషన్ సభ్యులు సరిత నార్కట్ పల్లి మండలంలో ఆకస్మికంగా తనిఖీ లు చేపట్టారు. గురువారం తనిఖీ లు చేపట్టిన సందర్భంగా మండలంలోని చెరువుగట్టు గ్రామంలోని గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థుల యొక్క విద్య నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. వసతులను పరిశీలించి వసతులను మెరుగుపరచుకోవాలని సూచనలు ఇచ్చారు. భోజనం సదుపాయం తయారు చేసే విధానాలను నిర్వాహకులకు వివరించారు. ముఖ్యంగా విద్యార్థుల విద్యా పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులకు రక్షణ విషయంలో రాజీ పడకూడదని. విద్యార్థులు మన ఆధీనంలో ఉన్నంతవరకు పాఠశాల యాజమాన్యాన్ని పూర్తి బాధ్యత అని సూచించారు.

## మాల ధరించి వస్తే పాఠశాలకు రావద్దని కొట్టిందంటూ ధర్నా

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** అయ్యప్ప మాల ధరించి మాల బట్ట లతో పాఠశాలకు రావద్దంటూ ప్రిన్సిపాల్ కొట్టిందని ఆరోపిస్తూ పాఠ శాల ముందు ధర్నా చేసిన సంఘటన గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఏవిఎం స్కూల్ ఎదుట చోటుచేసుకుంది. బజరంగ్‌దళ్ స్టూడెంట్ యూనియన్, మాల ధరించిన స్వాములు తెలిపిన వివరాల ప్రకారం ఏవిఎం స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న మహేష్ అనే విద్యార్థి మాల ధరించి ఉండడం వల్లే పాఠశాల హెడ్ మాస్టర్ కొట్టిందని ఇది సరైంది కాదన్నారు. గతములో కూడా చేతికి కంకణాలు కట్టుకున్న విద్యార్థులను వేధించినట్లుగా మా దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇట్టి విషయమై పై అధికారులకు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై స్కూల్ ప్రిన్సిపాల్ స్పందిస్తూ మా పాఠ శాలలో 80 శాతం హిందూ మతస్తులే ఉన్నారని, మేము ఇంత వరకు ఎవరిని కూడా ఏమి అనలేదన్నారు. మహేష్ అనే విద్యార్థి క్రమశిక్షణ రహితంగా అల్లరి చేస్తుండడంతో మందలించినట్లు వివరించారు. మాల ధరించిన స్వాములను పాఠశాలకు రావద్దన్న మాట అవాస్తవమన్నారు.

# 'డబుల్' ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి పట్టణం సింగన్నగూడెంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే అప్పజెప్పాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ భువనగిరి పట్టణ ముఖ్య నాయకుల సమావేశం జిల్లా కార్యాలయంలో చింతల మల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి దామోదర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు నిర్వహించి పేదల ప్రక్షాన నిలబడుతుందన్నారు. నేటికీ దేశంలో చెక్కుచెదరని పార్టీ ఉంది అంటే అది సిపిఐ మాత్రమేనని ఆయన అన్నారు. సిపిఐ 100 సంవత్సరాల శతజయంతి ఉత్సవాల ముగింపు సంద ర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఖమ్మం బహిరంగ సభ జయప్రదం కోసం హైదరాబాద్ నుండి బస్సు జాతా ప్రారంభమై ఈనెల 20, 21న యాదాద్రి భువనగిరి జిల్లాకు విచ్చేయుచున్న సందర్భంగా పార్టీ శ్రేణులు, ప్రజానాట్యమండలి కళా కారులు, స్వాగతం పలికి బహిరంగ సభ విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనా రాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, సీనియర్ నాయకులు చొప్పరి సత్తయ్య, కోర సామెల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ తరహాలోనే బిసి ఉద్యమం

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, బిసి జెఏసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఈ నెలలో ప్రారంభ మయ్యే పార్లమెంటు సమావేశాలు రాజ్యాంగాన్ని సవ రించి బిసిలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు,బిసి జేఏసి చైర్మన్ జాజుల శ్రీని వాస్ గౌడ్ అన్నారు. బిసి జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా కూలీ అంబేద్కర్ విగ్రహాల ముందు బిసి రిజర్వేషన్లు పెంచడానికి పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయాలని ప్రధాన డిమాండ్‌తో బిసి జేఏసీ మౌన దీక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం నలగొండ పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద మౌన దీక్ష చేప ట్టారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరై మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా బిసిల వాటా బిసి లకే రాజ్యాంగబద్ధంగా దక్కాలని రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో పోరాటాలు చేసిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగు ణంగా బిసి రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ జీవో నెంబర్ 9 ని విడుదల చేసిందని, ఈ జీవోను వ్యతిరేకిస్తూ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కోర్టులను వేదికగా చేసుకుని అడుగడుగునా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిసిల తినే కంచంలో మన్ను పోసి నోటికాడు ముద్దను గుంజుకుంటున్నారని అన్నారు. బిసి రిజర్వేషన్లు పెంచడం ధర్మబద్ధమైన దని, ఎస్‌సి, ఎస్‌టి అగ్ర కులాలకు కూడా జనాభా దామాషా ప్రకారం రిజ ర్వేషన్లు అమలు జరిగినప్పుడు బిసిలకు మాత్రమే జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఎందుకు ఉండవని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో చక్రహరి రామరాజు జిల్లా అధ్యక్షులు దుదుకు లక్ష్మీనారాయణ,జిల్లా నాయ కులు తండు సైదులు గౌడ్,సుంకరి మల్లేష్ గౌడ్,చీర పంకజ్ యాదవ్,పిల్లి రామరాజు యాదవ్, చిలకరాజు చెన్నయ్య,చొల్లేటి ప్రభాకర్, పన్నాల గోపాల్ రెడ్డి, బకారం శ్రీనివాస్,గోలి సైదులు,వైద్యుల సత్యనారాయణ, కాసోజు విశ్వనాధము,నేలపట్ల సత్యనారాయణ, సోమమల్లన్న, కేసబోయిన శంకర్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి రోజు దేశ వ్యాప్తంగా అనేక మంది సైబర్ నేరగాళ్లు బారిన పడి మోసాలకు గురవుతున్నారనీ,వారి బారిన పడకుండా ప్రతి ఒక్కరికి అవగాహన కల్గిఉండమే ఉత్తమ మార్గం అని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు. సైబర్ జాగారుకత దివాస్ సంద ర్భంగా గురువారం నల్లగొండ పట్టణంలోని దీప్తి నర్సింగ్ కళాశాల విద్యార్థి నులకు, సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ..ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజ లు ఎక్కువగా సులభంగా మోసపోయేది సైబర్ నేరగాళ్ల ద్వారానే అని అన్నా రు. కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెం టనే స్పందించి 1930 కి సమాచారం అందించి ఎన్‌సిఆర్‌పి పోర్టల్ సైబర్ క్రైమ్ గౌట్ ఇన్‌లో ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ వారు తక్షణమే స్పందించి తద్వారా పోయిన డబ్బులు రికవరీ చేసుకునే అవకాశం ఉందన్నారు. సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మీనారాయణ ఎస్‌బి సిఐ రాము, వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ విష్ణు, కళాశాల విద్యార్థినులు ఉన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## మరో మహిళా మావోయిస్టు లొంగుబాటు..

**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో యాంటీ నక్సల్ ఆపరేషన్ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మహిళా మావోయిస్టు కమలా సోడి గురువారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఉంగి అలియాస్ తరుణగా పేరొందిన కమలా సోడిపై రూ. 17 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. రాజ్‌నందగావ్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ అభిషేక్ శాండిల్య, ఎస్‌పి లక్ష్య శర్మతో పాటు ఇతర పోలీసు ఉన్నతాధికారుల ఎదుట కమలా లొంగిపోయారు. ఆమె లొంగుబాటుతో మిగతా మహిళా మావోయిస్టులు కూడా అడవిని, ఆయుధాలను వీడి జనస్రవంతిలోకి వస్తారని పోలీసులు విశ్వసిస్తున్నారు. పునరావాస చర్యల్లో భాగంగా తక్షణ సాయం కింద ఆమెకు రూ. 50 వేలు అందించారు. సుక్మా జిల్లాలోని కుంట ప్రాంతానికి చెందిన సోడి.. సిపిఐ(మావోయిస్టు) పార్టీతో 2011 నుంచి సంబంధాలు కొనసాగిస్తున్నారు. మహారాష్ట్ర – మధ్యప్రదేశ్ – ఛత్తీస్‌గఢ్ జోన్ పరిధిలో జరిగిన మావోయిస్టు కార్యకలాపాల్లో కమల చురుకుగా పాల్గొన్నారు. ఈ మూడు రాష్ట్రాల్లో జరిగిన మావోయిస్టుల దాడుల్లో కమల కీలకపాత్ర పోషించారు.

## చొరబాటుదారుల పట్ల కాంగ్రెస్ సానుకూల వైఖరి

### ఓటు రాజకీయాల వల్ల రాముడంటే ఆ పార్టీకి ఇష్టం లేదు : మోదీ




**భగల్‌పూర్/అరారియా :** బిహార్‌లో ప్రతిపక్ష ఆర్‌జెడి–కాంగ్రెస్ కూటమి చొరబాటుదారుల పట్ల సానుకూల వైఖరి అవలంబిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. అయితే ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా రాముడు, ఛట్ పూజను అవమానిస్తున్నారన్నారు. గురువారం మోదీ భగల్‌పూర్, అరారియా జిల్లాల్లో నిర్వహించిన వరుస ర్యాలీల్లో ప్రసంగించారు. నిషాద్ రాజ్, మాతా శబ్రీ, మహర్షి వాల్మీకిలకు అంకితం చేయబడిన పుణ్యక్షేత్రాలను దర్శనం చేసుకోవడానికి, ప్రతిపక్ష నాయకులు అయోధ్యను సందర్శించడానికి ఇష్టపడకపోవడం దళితులు, వెనుకబడిన తరగతుల పట్ల వారి ద్వేషాన్ని సూచిస్తుందని ఆరోపించారు. 15 సంవత్సరాల ఆటవిక రాజ్యం కాలంలో బిహార్‌లో సునాన అభివృద్ధి, అని, రహదారులు, వంతెనలు నిర్మించబడలేదని, ఉన్నత విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయబడలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నాయకత్వంలోని ఎన్‌డిఎ రాష్ట్రాన్ని ఆ యుగం నుండి బయటకు తీసుకురావడానికి చాలా కష్టపడి పనిచేసిందన్నారు. దేశం నుండి ప్రతి చొరబాటుదారులను తరిమికొట్టడానికి ఎన్‌డిఎ కట్టుబడి ఉందని, కానీ కాంగ్రెస్– ఆర్‌జెడి వారికి రక్షణ కల్పిస్తున్నాయన్నారు. వారికి అనుకూలంగా రాజకీయ యాత్రలు నిర్వహిస్తాయని, తప్పుదారి పట్టించే కథనాలతో ముందుకు వస్తాయని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఓటరు అధికార్ యాత్ర, ఓటు దొంగతనం ఆరోపణలను పరోక్షంగా ప్రస్తావిస్తూ ప్రధాని ఆరోపించారు. ఆర్‌జెడి–కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడల్లా వారు చొరబాటుదారులకు వెనుక ద్వారం గుండా ప్రవేశం కల్పించడానికి ప్రయత్నిస్తాయని, ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా అలా చేస్తారన్నారు. కానీ ఇది ఈ దేశ ప్రజలపై ప్రభావం చూపుతుందని, చొరబాటుదారులు పౌరులకు చెందిన ప్రతి దానిలో వాటాను పొందుతారన్నారు. రాహుల్ గాంధీ ఛట్ పూజను డ్రామాగా అభివర్ణించారని, వారు రాముని దర్శనం చేసుకోవడానికి అయోధ్యను ఎప్పుడూ సందర్శించరని పేర్కొన్నారు. 'కట్ట' (దేశ నిర్మిత ఆయుధాలు), 'క్రోర్త' (క్రూరత్వం), 'కటుట' (చేదు), 'కుశాసన్' (దుష్పరిపాలన), అవినీతి 15 సంవత్సరాల అడవి రాజ్ ముఖ్య లక్షణాలు అని మోదీ అన్నారు. ఆర్‌జెడి పాఠ్యాంశాల్లో, 'ఎ' అంటే 'అఫరన్' (కిడ్నాప్), 'ఎఫ్' అంటే 'ఫిరౌతి' (విమోచన క్రయధనం), 'పి' అంటే 'పరివర్వాద్' (రాజవంశ పాలన) అని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ నిఘంటువులో 'స్వదేశీ' (స్వదేశీ), 'ఆత్మనిర్భరత' (స్వయం సమృద్ధి) వంటి పదాలు లేవని మోదీ విమర్శించారు. జాతి హింసకు ఆర్‌జెడినిని, భగల్‌పూర్ (1989) లో జరిగిన అప్రసిద్ధ మత అల్లర్లకు కాంగ్రెస్‌ను నిందించడం ద్వారా రెండు కూటమి భాగస్వాములు సామాజిక కలహాలను రెచ్చగొట్టాయని ప్రధాని ఆరోపించారు. ఇది 1984 లో సిక్కు వ్యతిరేక హింస వలె చెరగని మచ్చగా ఉందన్నారు.

## పెరుగుతున్న నిరుద్యోగంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన

### సమస్యలు పరిష్కరించ-డానికి బదులు ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ బిజీ : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** దేశంలో రోజు రోజుకు నిరుద్యోగం పెరుగుతోందని, ఈ విషయం ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తుందని కాంగ్రెస్ ఆవేదన వ్యక్తం చేసింది. అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సమస్యను పరిష్కరించడానికి బదులుగా, ఎల్లప్పుడూ ఎన్నికల బిజీలో ఉంటున్నారని, ప్రజల దృష్టిని మళ్లించడానికి కొత్త ప్రసంగాలను కనిపెట్టడంలో క్షణం కూడా తీరిక లేకుండా ఉన్నారని ఎద్దేవా చేసింది. గత 11 ఏళ్ల ఎన్‌డిఎ సర్కార్ దుష్టపాలన సమాజంలోని అన్ని వర్గాలను దెబ్బతీసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఆరోపించారు. 'విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు, కార్మికులు, దుకాణదారులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు ఒక్క వర్గం కూడా ఈ ప్రభుత్వంతో సంతోషంగా లేరు. ద్రవ్యోల్బణం ఆకాశాన్ని అంటుతోంది, రూపాయి విలువ నిరంతరం తగ్గుతోంది . ధనిక, పేదల మధ్య అంతరం నిరంతరం విస్తరిస్తోంది. పేద, మధ్య తరగతి కుటుంబాల జీవితాన్ని కష్టతరం చేస్తోంది' అని రమేష్ ఎక్స్‌లో హిందీలో తన పోస్ట్ చేశారు. పెరుగుతున్న నిరుద్యోగం తీవ్ర ఆందోళన కలిగించే విషయంగా మారిందన్నారు. తాజా సిఎంఐఇ నివేదికను ఉటంకిస్తూ, దేశంలో నిరుద్యోగిత రేటు అక్టోబర్ 2025లో 7.5 శాతానికి పెరిగిందని, ఇది గత ఆరు నెలల్లో అత్యధిక స్థాయి అని అన్నారు. నిర్మాణం, ఐటి బ్యాంకింగ్‌తో సహా అనేక రంగాలలో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారని, నిర్మాణ పరిశ్రమలో 90 లక్షలకు పైగా ఉద్యోగాలు కోల్పోయారని, జీతాలు పొందే ఉద్యోగాల సంఖ్య 25 లక్షలు తగ్గిందన్నారు. 11 ఏళ్లుగా ప్రతి సంవత్సరం ఆందోళనకరమైన గణాంకాలు వెలువడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ, మోదీ జీకి దేశ యువత పట్ల ఎలాంటి శ్రద్ధ లేదన్నారు. ఎల్లప్పుడూ ఎన్నికల వాతావరణంలో, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి బదులుగా ప్రజల దృష్టిని మళ్లించడానికి కొత్త ప్రసంగాలను కనిపెట్టడంలో ఆయన బిజీగా అన్నారన్నారు. కాగా, ఆర్థిక వ్యవస్థను నిర్వహించడంపై కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తరుచూ విమర్శలు చేస్తోంది. ధరలు పెరగడం, తగ్గుతున్న ప్రైవేట్ పెట్టుబడులు, స్తబ్దత వేతనాలు సామాన్య ప్రజలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆరోపిస్తోంది.

## ఎన్‌డిఎను దించితేనే ఉద్యోగాలు

### ఎస్‌పి చీఫ్ అఖిలేశ్ యాదవ్




**పాట్నా :** బిహార్‌లో మహాఘట్బంధన్ విజయం ఎప్పుడో ఖాయమైందని, రాష్ట్రంలోని యువత ఎన్‌డిఎను అధికారం నుంచి దించి జమ్ము కాకుండా ఉద్యోగాలు ఇచ్చే ముఖ్యమంత్రిని ఎన్నుకోవాలని నిర్ణయించుకున్నారని సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) చీఫ్ అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం తూర్పు చంపారన్ జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఇండియా కూటమిఅభ్యర్థులకు మద్దతుగా అఖిలేశ్ పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా అధికార ఎన్‌డిఎకు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. బిజెపి, దాని మిత్రపక్షాలు ఉపాధి కల్పించడంలో, ద్రవ్యోల్బణాన్ని అరికట్టడంలో, రైతుల సంక్షేమాన్ని నిర్ధారించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రజలు జవాబుదారీతనం అడుగుతున్నారని యాదవ్ అన్నారు. ఢిల్లీ (బిజెపి నేతృత్వంలోని కేంద్రం) ప్రభుత్వంలో 10 సంవత్సరాలు, బిహార్ ప్రభుత్వంలో 20 సంవత్సరాల్లో ఎంత మంది యువతకు ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలని, రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని వారు హామీ ఇచ్చారని, ఎవరికైనా రెట్టింపు అయ్యిందా? అని ర్యాలీలో పాల్గన్న ప్రజలను ప్రశ్నించారు. బిజెపి నాయకుల అభివృద్ధి వ్యాఖ్యలపై స్పందిస్తూ, గోరఖ్‌పూర్ నుండి దూర ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మిస్తున్నట్లు ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్‌మాట్లాడటంతానుఇటీవల విన్నానని అన్నారు. తాము ఉత్తరప్రదేశ్ నుండి వచ్చాము, అయితే ఎక్కడాఅలాంటిఎక్స్‌ప్రెస్‌వేను చూడలేదని ఎద్దేవా చేశారు. వారు గాలిలో ఎక్స్‌ప్రెస్‌వేలను నిర్మిస్తున్నారన్నారు. బిజెపిని ఓట్ల దొంగగా పేర్కొంటూ వారికి ఎన్నికల కమిషన్ పార్టీ అనే 'సి' టీమ్ ఉందన్నారు. ఓట్లు దొంగిలించడానికి వారికి సహాయపడే మరొక పార్టీ 'పి' టీమ్ ఉంది. కాబట్టి ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ప్రశాంత్ కిషోర్ జన్ సూరజ్ పార్టీనుద్దేశించి పరోక్షంగా ప్రస్తావించారు. కేంద్రంలో, బిహార్‌లో ఎన్‌డిఎ పాలనలో నిత్యావసర వస్తువులకు పెరుగుతున ధరలపై ఎస్‌పి చీఫ్ తీవ్రంగా విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లోని తన ప్రత్యర్థి, ఎప్పుడూ కాషాయ దుస్తులు ధరించే ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను లక్ష్యంగా చేసుకుని 'ఏకరంగు' అనే పదాన్ని కూడా ఆయన ఉచ్చరించారు. యువత 'ఏకరంగు' అంటే ఏమిటో గూగుల్‌లో శోధిస్తే, తాను ఆ పదాన్ని ఎందుకు పునరావృతం చేయకూడదో వారికి అర్థమవుతుందని, వారు సమాజాన్ని విభజిస్తున్నారని, ప్రజలను మోసం చేస్తున్నారని, కలలను అమ్ముతున్నారని ఆరోపించారు. బిజెపిని అధికారం నుండి దించినప్పుడే ఉద్యోగాలు వస్తాయని, బిహార్ డబ్బు రాష్ట్రానికి ఖర్చు చేయబడుతుందన్నారు.

## 'నవంబరు విప్లవం' ఏమీ లేదు

### 2028లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చినప్పుడే విప్లవం : డికె



**న్యూఢిల్లీ :** కర్నాటకలో గత కొద్దికాలంగా ముఖ్యమంత్రి మార్పుపై పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది. త్వరలోనే డికె శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారని పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. నవంబర్‌లో విప్లవం పేరుతో వస్తున్న ఊహాగానాలను కర్నాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్ తోసిపుచ్చారు. నవంబర్, డిసెంబర్‌లో విప్లవం ఉండదని.. 2028లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు మాత్రమే జరుగుతుందన్నారు. తాను పార్టీకి క్రమశిక్షణ కలిగిన సైనికుడినని.. సిఎం సిద్ధరామయ్యతో కలిసి పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటానన్నారు. ఇటీవల సిఎం మార్పు జరిగే అవకాశం ఉందని.. దీన్ని కొందరు నవంబర్ విప్లవం అంటూ వ్యాఖ్యానించారు. దీనిపై శివకుమార్ స్పందిస్తూ.. తాను ఎవరినీ కలవబోవడం లేదని.. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఎలాంటి చర్చజరుగలేదన్నారు. ఇది ముఖ్యమంత్రి హక్కని.. పార్టీ ఏది నిర్ణయించినా అదే జరుగుతుందన్నారు. పార్టీ ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారని చెబితే.. ఆయన అలాగే ఉంటారని.. ఆయన పదేళ్లు, పదిహేనేళ్లు ఉండాలనుకుంటే అన్ని సంవత్సరాలు కొనసాగుతారన్నారు. మీడియాలో వస్తున్న ఊహాగానాలను ఆయన తోసిపుచ్చారు. నవంబర్, డిసెంబర్, జనవరిలో విప్లవం రాదని.. 2028లో కాంగ్రెస్ తిరిగి వచ్చినప్పుడు ఆ విప్లవం జరుగుతుందన్నారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ప్రశ్నించగా.. ఢిల్లీ హైకమాండ్ దీనిపై నిర్ణయం తీసుకుంటుందని శివకుమార్ వ్యాఖ్యనించారు. ఇదిలా ఉండగా.. ఇటీవల సిద్ధరామయ్య ఇటీవల తన ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేస్తానని, అయితే తుది నిర్ణయం పార్టీదేనని స్పష్టం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత.. సిఎం పదవి కోసం సిద్ధరామయ్య, శివకుమార్ పోటీపడ్డ విషయం తెలిసిందే. సిద్ధరామయ్య, శివకుమార్ చెరో రెండున్నరేళ్లు సిఎంగా కొనసాగే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి.

## వరదనీటిలో మునిగిన రోడ్లపై ఓటర్ల ప్రయాణం,నాయకులపై విమర్శలు



**దర్భాంగ్/ముంగేర్:** బిహార్ తొలి దశ ఎన్నికల్లో రాజకీయపార్టీలు ఒకవైపు భారీ అంచనాలు వేసుకుంటూ ఉండగా, మరోవైపు ఓట్లు వేసేందుకు వెళుతున్న ఓటర్లు కనీసం రోడ్లు కూడా సరిగ్గా లేక పోవడంతో ఆయన నాయకులపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. దర్భాంగ్‌లోని కుషేశ్వర్ అస్థాన్ నియోజకవర్గంలో ఓటర్లు వరదనీటిలో నిండి కంటికి కనిపించనిరోడ్లపైనేప్రయాణం చేస్తూ పోలింగ్ బూత్‌లవైపు ప్రయాణం చేశారు. ఇరవైయేళ్ళుగా ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలు కూడా తీర్చలేదని ఓటర్లు విమర్శిస్తూ ఆ దారిలో నడిచి వెళ్ళడం కనిపించింది. పిల్లలను కూడా పెద్దలు వెంటబెట్టుకుని వస్తూ, ఎక్కడ గుంతలు ఉన్నాయో కూడా కనిపించని పరిస్థితుల్లో ఆ నీటి మడుగుల్లోంచి నడిచి వెళ్ళారు. ''ఏమిటిఈ పరిస్థితి? చూశారా ఈ నీళ్ళన్నీ? ఎవరి కాలైనా మెలిక పడితే పడిపోతారు, కాలు విరుగుతుంది, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? వాళ్ళకు ఓట్లు కావాలి, రాజకీయ నాయకులను ఇక్కడికి రమ్మనండి, చూడమనండి, ఇక్కడ డ్రైనేజీ ఏర్పాట్లు కూడా లేవు, ఇక్కడ పరిస్థితిని కళ్ళతో చూశాక ఆ తర్వాత మమ్మల్ని ఓట్లు అడగమనండి'' అని పిటిఐ వీడియోస్‌కు ఒక ఓటరు ఆగ్రహంగా చెప్పారు. మరో నివాసితుడు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఆదరాబాదరాగా ఈ ప్రాంతంలో కొన్ని రాళ్ళు వేస్తారు నడిచి వెళ్ళడానికి, మిగిలిన సమయాల్లో వారికి ఈ రోడ్లు బాగుచేయాలనే ఆలోచన కూడా రాదు, పోలింగ్ రోజు రాగానే ముందు రోజున ఆదరాబాదరాగా నడిచి వెళ్ళడం కోసం కొన్ని రాళ్ళు వేస్తారు'' అని విమర్శించారు. ''ఇక్కడ ఎన్నో సమస్యలున్నాయి, మా కొడుకులు పనులకోసం ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలకు వెళుతున్నారు, వాళ్ళని ఎవ రు పట్టించుకుంటారు? ఈ రాష్ట్రంలో ఉద్యోగాలు లేవు, ప్రభుత్వం ఇక్కడే ఏదైనా ఉపాధి కల్పిస్తే, వాళ్ళంతా మా కళ్ళ ఎదుటే మా గ్రామాల్లోనే ఉంటారు'' అని మరో ఓటరు ఆవేదనగా చెప్పారు. మా దగ్గర డబ్బులు లేవు, తిండి లేదు, ఇక్కడే ఉంటున్నాం, బయటకు వెళ్ళలేం, మేం ఏం చెయ్యాలి? అని మరో ఓటరు ప్రశ్నించారు. ఇక ముంగేర్‌లోని భీంబంధ్ ప్రాంతం నక్సల్ ప్రాబల్యం ఉన్న ప్రాంతం. ఇక్కడ తారాపూర్ నియోజకవర్గంలో ప్రజలు లైన్లలో నిలబడి ఓట్లు వేశారు. 20 సంవత్సరాల తర్వాత ఎక్కువమంది ఓటర్లు సొంత ప్రాంతాలకు వెళ్ళి ఓట్లు వేశారు. ఈ నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలను నక్సల్ ప్రాబల్యం కారణంగా ఇతర ప్రాంతాలకు తరలించారు. 2005 తర్వాత మళ్ళీ ఇప్పుడే ఇక్కడ పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.


## ఇద్దరు రాజ్యసభ సభ్యుల ప్రమాణం



**న్యూఢిల్లీ :** రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు గురువారం ప్రమాణం చేశారు. రాజిందర్ గుప్తా, సత్ పాల్ శర్మలతో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి చెందిన గుప్తా పంజాబ్ నుంచి ఎంపిగా ఎన్నికయ్యారు. బిజెపికి చెందిన శర్మ జమ్ముకశ్మీర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపిగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో గుప్తా పంజాబీలో ప్రమాణ స్వీకారం చేయగా, శర్మ హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. పారిశ్రామికవేత్త అయిన గుప్తాను పంజాబ్‌లో అధికారంలో ఆప్ నామినేట్ చేసింది. శర్మ బిజెపి జమ్ముకశ్మీర్ యూనిట్ అధ్యక్షుడు. ఆయన వృత్తిరీత్యా చార్టర్డ్ అకౌంటెంట్, గతంలో జమ్ముకశ్మీర్ ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. 2014లో జమ్ము వెస్ట్ నియోజకవర్గం నుండి శాసనసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అప్పుడు ఆయన 51,000 ఓట్ల తేడాతో గెలుపొందగా, అప్పటికి అత్యధిక ఓట్ల తేడా అదే కావడం గమనార్హం. కాగా, ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బిజెపి అధ్యక్షుడు జె. పి. నడ్డా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, బిజెపి జమ్ముకశ్మీర్ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ కూడా హాజరయ్యారు. ఇద్దరు ఎంపిల కుటుంబ సభ్యులు ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. పంజాబ్ నుంచి రాజ్యసభకు పోటీలో ఉన్న ఏకైక అభ్యర్థిగా గుప్తా ఎన్నికయ్యారు. అక్టోబర్ 24న జరిగిన రాజ్యసభ ఉప ఎన్నికకు గుప్తాను అభ్యర్థిగా నామినేట్ చేసిన ఆప్, 117 మంది సభ్యుల రాష్ట్ర అసెంబ్లీలో 93 మంది సభ్యులతో అఖండ మెజారిటీని కలిగి ఉంది. ఆప్‌కు చెందిన సంజీవ్ అరోరా రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికైన తర్వాత ఎగువ సభ నుండి వైదొలిగిన తర్వాత ఆ స్థానం ఖాళీ అయింది. అప్పటి నుండి ఆయన పంజాబ్ మంత్రివర్గంలోకి చేరారు. ట్రైడెంట్ గ్రూప్ ఎమెరిటస్ చైర్మన్ గుప్తా ఇటీవల రాష్ట్ర ఆర్థిక విధానం, ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్ష పదవికి, కాళీ దేవి ఆలయ సలహా కమిటీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. జమ్ముకశ్మీర్‌లో ఎన్నికలు జరిగిన నాలుగు రాజ్యసభ స్థానాల్లో ఒక దాన్ని శర్మ గెలుచుకున్నారు.

## పార్థ్ పవార్ రూ.300 కోట్ల భూ ఒప్పందంపై... దర్యాప్తునకు ఆదేశించిన మహారాష్ట్ర సిఎం

### దేవేంద్ర ఫడ్నవీస్
### రెవెన్యూ అధికారిని సస్పెండ్ చేసిన ప్రభుత్వం
### అదనపు ప్రధానకార్యదర్శి (రెవెన్యూ) వికాస్‌ఖర్గే నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు



**పుణే :** పుణేలో జరిగిన ఒక భారీ భూకుంభకోణం మహారాష్ట్ర ప్రభుత్వంలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్ ప్రమేయం ఉందని ఆరోపిస్తూ పుణేలో జరిగిన రూ.300 కోట్ల భూ ఒప్పందంపై మహారాష్ట్ర ప్రభుత్వం ఒక రెవెన్యూ అధికారిని సస్పెండ్ చేసి, దానిపై దర్యాప్తు చేయడానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిందని గురువారం అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సూచనల మేరకు ఏర్పాటుచేసిన దర్యాప్తు కమిటీకి అదనపు ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) వికాస్‌ఖర్గే నేతృత్వం వహిస్తారని వారు చెప్పారు. ఈ భూలావాదేవీని 'ప్రాథమికంగా తీవ్రమైనది' అని ఫడ్నవీస్ పేర్కొన్నారు. పార్థ్ పవార్ వ్యాఖ్యల కోసం 'పిటిఐ' ఫోన్ ద్వారా ఆయనను సంప్రదించాలని ప్రయత్నించింది. అయితే ఆయన దీనిపై స్పందించలేదు. బిజెపి, అజిత్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలతో కూడిన పాలకమహాయుతిని లక్ష్యంగా చేసుకోవడానికి ప్రతిపక్షాలను ప్రేరేపించిన వివాదాస్పద ఒప్పందంపై పుణేకు చెందిన తహసీల్దార్ సూర్యకాంత్ యెవాలేను తక్షణమే సస్పెండ్ చేశారు. ఒక అధికారి వెల్లడించిన ప్రకారం...పుణేలోని అప్‌మార్కెట్ ముంధ్వా ప్రాంతంలో 40 ఎకరాల 'ప్రభుత్వానికి చెందిన మహార్ వతన్‌భూమి' పార్థ్ పవార్ భాగస్వామిగా ఉన్న అమేడియా ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పికి రూ.300 కోట్లకు విక్రయించారు. దానిపై స్టాంప్ డ్యూటీని రద్దు చేశారు. 'ప్రభుత్వ భూమి కాబట్టి ఆ ప్లాట్‌ను ఒక ప్రైవేట్ సంస్థకు అమ్మలేం' అని ఆయన చెప్పారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ సంస్థకు ఎలా విక్రయించారో, నిబంధనల ప్రకారం మినహాయింపు ఇవ్వబడిందా లేదా అనేది ఉన్నత స్థాయి కమిటీ నిర్ధారిస్తుందని రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రవీంద్ర బిన్వాడే 'పిటిఐ'కి తెలిపారు. 'మినహాయింపును క్లెయిమ్ చేయడానికి సంబంధించిన పత్రాలను తనిఖీ చేస్తారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఎలాంటి పత్రాలు సమర్పించబడ్డాయో కూడా కమిటీ పరిశీలిస్తుంది. కానీ తక్షణ చర్యగా మేము సబ్ రిజిస్ట్రార్ ర్యాంక్ అధికారిని సస్పెండ్ చేశాం. ఒకవేళ అది ప్రభుత్వ భూమి అయితే రిజిస్ట్రేషన్ జరుగకూడదు' అని ఆయన చెప్పారు. కీలకమైన ప్రాపర్టీ డాక్యుమెంట్ 7/12 ఎక్స్‌ట్రాక్ట్ లో భూమి ముంబయ్ సర్కార్ పేరు మీద ఉందని రెవెన్యూ శాఖ వర్గాలు తెలిపాయి. పార్థ్ పవార్ పేరుతో పాటు రిజిస్ట్రేషన్ జరిగిన పేరు మీద దిగ్విజయ్ పాటిల్ కూడా సంస్థలో సహ భాగస్వామిగా ఉన్నారు. అంతకుముందు రోజు ఫడ్నవీస్ నాగ్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రాథమికంగా చూస్తే సమస్య తీవ్రంగా కనిపిస్తోంది. కేసుకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని సంబంధిత విభాగాల నుంచి కోరాను. దర్యాప్తునకు ఆదేశాలు ఇవ్వబడ్డాయి. ఆ విషయం గురించి, వివరాలు వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన చర్యల గురించి నేను మాట్లాడగలను. సమాచార హక్కు కార్యకర్త విజయ్‌కుంభార్ ప్రకారం... మార్కెట్ రేటు గణనీయంగా ఎక్కువగానే ఉన్నప్పటికీ పార్థ్ పవార్‌తో సంబంధం ఉన్న ఒక కంపెనీకి ఈ భూమిని దాదాపు రూ.300 కోట్లకు కొనుగోలు చేసిందని ఆరోపించబడింది. 'ఈ ఒప్పందంపై రూ. 21 కోట్ల స్టాంప్ డ్యూటీని రద్దు చేశారు' అని కూడా ఆయన చెప్పారు. 'కొంతమంది ఇతరుల కన్నా ఎందుకు ఎక్కువగా ఉంటారు' అని ఆయన బుధవారం ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో అడిగారు. ఈ భూమి లావాదేవీపై విచారణ జరపాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు విజయ్ వాడెట్టివార్ డిమాండ్ చేశారు. శివసేన యుబిటి నాయకుడు అంబదాస్‌దన్వే మాట్లాడుతూ రూ.1800 కోట్ల విలువగల ఆ ప్రైవేట్ కంపెనీ కోసం భూమిని తీసుకున్నారని ఆరోపించారు. ఏప్రిల్ 22న కంపెనీ ఐటి పార్కు ఏర్పాటు కోసం తీర్మానం చేసి, రూ. లక్ష కోట్ల మూలధనం కుంభకోణం జరిగినప్పటికీ ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించిందని అంబదాస్ దన్వే ఆరోపించారు.

## నేను ఇండియాలో ఫేమస్ అయ్యా!

### రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై స్పందించిన బ్రెజిల్ మోడల్

**న్యూఢిల్లీ :** హర్యానాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బ్రెజిల్ మోడల్ ఓటేసినట్లు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వెల్లడించిన విషయం తెలిసిందే. ఆ మోడల్ పేరుతో 22 ఓట్లు ఉన్నాయని ఆయన బుధవారం మీడియా ముందు వివరించారు. అయితే ఆ మోడల్ ఎవరన్నది తెలిసింది. ఆమెను లారిసా నేరిగా గుర్తించారు. ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో రాహుల్ గాంధీ వాడిన తన ఫోటో గురించిఆమోడల్‌స్పందించింది. తాను 20 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ఆ ఫోటో దిగినట్లు ఆమె చెప్పింది. తన పాతఫోటోను వాడారని, 20 ఏళ్ల వయసులో ఆ ఫోటో దిగానని, ఇండియాలో ఓటింగ్ కోసం వాడినట్లు తెలిసిందని, ప్రజల్ని మోసం చేసేందుకు తనను ఇండియన్‌గా చూపిస్తున్నారని, ఇదేం వెర్రితనం, ఇంత పిచ్చా, మనం ఏం ప్రపంచంలో జీవిస్తున్నాని ఆ మహిళ తన వీడియోలో పేర్కొన్నది. తన ఫోటో మీడియాలోరాగానేతనతోమాట్లాడేందుకు ఓ జర్నలిస్టు ప్రయత్నించినట్లు ఆమె చెప్పింది. ఓ ఫ్రెండ్ కూడా తనతో ఈ అంశంపై మాట్లాడేందుకు ఆసక్తి చూపినట్లు పేర్కొన్నది. మోడల్ లారిసా నేరి తన ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా ఓ పోస్టు పెట్టింది. ఇది చాలా క్రేజీగా ఉందని, తానుఇండియాలో ఫేమస్ అయ్యానని, ఓ అదృశ్య బ్రెజిల్ మోడల్‌గా ఫేమస్ అయినట్లు ఆమె పేర్కొన్నది. వాస్తవానికి లారిసా మోడల్ కాదు. ఆమె సాధారణ మహిళే అని తెలుస్తోంది. హెయిర్ డ్రెస్సర్‌గా పనిచేస్తున్నది. ఓ ఫ్రెండ్ కోసం ఫోటో దిగితే దాన్ని ఆన్‌లైన్‌లో అందరూ వాడుకుంటున్నట్లు తెలుస్తోంది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో లారిసా లాంటి ఫేక్ ఓట్లతో బిజెపి గెలిచినట్లు రాహుల్ గాంధీ పేర్కొన్నారు.


SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS36T 0223 | Srinu Soudabaina | AL DOST | 2018 |
| 2 | TS30 9554 | Shanker Gajula | JOHN DEERE 5310 HARVESTER | 2017 |
| 3 | TS05UA 2829 | Namala Akhila | CHEVROLET TAVERA NEO-P | 2014 |
| 4 | TG27 7287 | Jeedi Niranjan | ZEST 1.3LXE QUADRAJET 75PS DIESEL 5 SEATER | 2017 |
| 5 | TS27D 7039 | Praveena Dudekula | EICHER 380 | 2018 |
| 6 | TS16EN 5372 | Jamandla Usha Sri | JOHN DEERE 5310 HARVESTER | 2017 |
| 7 | TS03EH 3726 | Pradeep Bandi | SONILIKA DI 42 RX | 2015 |

AUCTION DATE:08-11-2025
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H.No.6-2-7/35-B, 3rd Floor, Hyderabad Raod, Jangaon. Cell - 9985217519 , 98499 11793



SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS05UF 1175 | Devika Pallapu | MARUTHI ERTIGA BS6 CNG-P | 2022 |
| 2 | TS30T 1678 | Nirmala Badavath | MAHINDRA JEETO-11HP | 2017 |
| 3 | TS25T 1975 | Alakumtlla Raju | AL 2518T IL FBT-T | 2018 |
| 4 | AP27TU 3195 | Subhash Jerupothuls | MAN CLA 25.250 FBT-T | 2012 |
| 5 | TS25A 2622 | Sampath Alakunta | TIAGO XZ PLUS REVOTRON PETROL 5 SEATER | 2017 |
| 6 | TS03EU 9257 | Mandala Mahender | SWARAJ 963 COMBINE HARVESTER | 2018 |
| 7 | AP36AE 6927 | Rajesh Jakkula | JOHN DEERE 5310 | 2009 |
| 8 | TS24T 0639 | K Narasimha Swamy | AL 3116 IL FBT-T | 2016 |

AUCTION DATE: 08-11-2025
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
D.NO : 24-7-29,1st Floor, Fathima Complex, Fathimanagar, Kazipet, Cell :9989809938, 9989313186

ప్రజాపక్షం
శుక్రవారం, 07 నవంబరు

# ట్రంప్‌కు తొలి హెచ్చరిక

అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో నవంబర్ 5 అర్ధరాత్రికి వెలువడిన 4 ఎన్నికల ఫలితాలు డెమొక్రాట్లను వరించాయి. ఫలితాల్లో ఎటువంటి గందరగోళం లేదు. న్యూజెర్సీ, వర్జీనియా గవర్నర్‌లుగా, అతిపెద్ద న్యూయార్క్ నగరం మేయర్‌గా డెమొక్రాటిక్ అభ్యర్థుల నిర్ణయాత్మక విజయంతోపాటు, కాలిఫోర్నియాలో జిల్లాల పునర్విభజనకు డెమొక్రాట్ల ప్రతిపాదనను, పెన్సిల్వేనియా కీలకమైన సుప్రీంకోర్టు సీట్లను వారు నిలుపుకోవటం అధ్యక్షుడు డోనాల్డ్ రెండవ టరం ఆర్థిక, వలస ప్రజలపట్ల విధానాలకు, ఒంటెత్తుపోకడలకు చెంపపెట్టు. నెలరోజులపైబడి కొనసాగుతున్న 'షట్ డౌన్' (బడ్జెట్ ఆమోదం పొందనందున ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాలు బంద్)కూడా ఓటర్లను ప్రభావితం చేసింది. వీటన్నిటిలోనూ న్యూయార్క్ మేయర్‌గా జొహ్రాన్ మమ్‌దానీ గెలుపునకు విశేష ప్రాధాన్యత ఉంది. ఆయన, వర్జీనియాలో గవర్నర్‌గా ఎన్నికైన ఘజాలా హష్మి భారతీయ మూలాలు గలవారు కావటం, పైగా ముస్లింలు కావటం భారతీయులందరికీ (ముస్లింలను ద్వేషించే మోదీ అండ్ కో కు తప్ప) సంతోషదాయకం. 2024 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ వర్జీనియాను 5.7 పాయింట్లతో, న్యూజెర్సీని 5.9 పాయింట్లతో కోల్పోయారు. కాగా ఈ ఎన్నికల్లో డెమొక్రాట్లు వర్జీనియాను 15శాతంపైగా పాయింట్లతో, న్యూజెర్సీని 13శాతం పాయింట్లతో నిలుపుకోవటం ట్రంప్ ప్రతిష్ట ఎంతగా దిగజారిందో ఊహించుకోవచ్చు. మమ్‌దానీకి 'కమ్యూనిస్టు' ముద్రవేస్తూ అతన్ని గెలిపిస్తే న్యూయార్క్‌కు ఫెడరల్ నిధులు నిలుపు చేస్తానని ట్రంప్ హెచ్చరించినప్పటికీ ఓటర్లు బెదిరిపోలేదు. 20లక్షలకుపైగా ఓట్లు పోలైన న్యూయార్క్‌లో పోటీ డెమొక్రటిక్ అభ్యర్థి క్యూమోపై మమ్‌దానీ ఆధిక్యత 9శాతం. రిపబ్లికన్ అభ్యర్థిది సుదూర మూడవస్థానం.

న్యూయార్క్‌లో చారిత్రక విజయం సాధించిన యువకుడు జొహ్రాన్ మమ్‌దానీ డెమొక్రటిక్ సోషలిస్టు అభ్యర్థి. అతని విజయం డెమొక్రటిక్ పార్టీలో బెర్నీ శాండర్స్ గ్రూపుకు చెందిన వామపక్షవాదులకేగాక, యూరప్, లాటిన్ అమెరికాల్లోని వామపక్ష పార్టీలకు కూడా పెద్ద ప్రోత్సాహంగా పనిచేస్తుంది. న్యూయార్క్‌లో ఎన్నికల ప్రచారం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. యూరప్, లాటిన్ అమెరికాల్లోని అనేక వామపక్ష పార్టీలు ప్రచారాన్ని చూడటానికి, 34ఏళ్ల చిచ్చరపిడుగు జొహ్రాన్ మమ్‌దానీతో అభిప్రాయాలు ఇచ్చిపుచ్చుకోవటానికీ తమ నాయకులను పంపాయి. పార్టీ ప్రైమరీలో పార్టీ అభ్యర్థిగా మమ్‌దానీ ఎన్నికైన రోజునుంచే మితవాదులు దాడి ఎక్కుపెట్టారు. అయితే తాను ముస్లింనని, సోషలిస్టునని ఆయన దాపరికం లేకుండా, నిర్మొహమాటంగా చెప్పుకున్నాడు. తన కార్యక్రమం ప్రాతిపదికపై మమ్‌దానీ విజయం యూరప్‌లో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ లెఫ్ట్‌కు పెద్ద ప్రోత్సాహం. బ్రిటన్‌లో జెరిమీ కోర్బిన్, జరా సుల్తానా పాలక లేబర్ పార్టీ నుంచి బయటకు వచ్చి సొంత పార్టీ పెడుతున్నారు. దాని తాత్కాలిక పేరు 'యువర్ పార్టీ'. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు అతిపెద్ద పీఠమైన న్యూయార్క్‌లో మమ్‌దానీ విజయం తమ లెఫ్ట్ కార్యక్రమంతో ముందుకెళ్లటానికి కోర్బిన్, జరాల్లో విశ్వాసం పెంపొందిస్తున్నది. అదేవిధంగా జర్మనీలోని లెఫ్ట్‌పార్టీ డి లింకే(మాజీ కమ్యూనిస్టుల పార్టీ) తమ నాయకులను న్యూయార్క్‌కు పంపింది. ఫ్రెంచి కమ్యూనిస్టులు, సోషలిస్టులకు మమ్‌దానీ గెలుపు ఉత్సాహం కలుగజేసింది. రాజకీయ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఫ్రాన్స్‌లో 2027లో అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. అధ్యక్షుడు ఇమాన్యూల్ మక్రాన్ పోటీ చేయటం లేదు. స్పెయిన్, ఆస్ట్రియా, పోర్చుగల్ కమ్యూనిస్టుల కార్యక్రమం మమ్‌దానీ కార్యక్రమంతో సారూప్యత కలిగి ఉన్నందున వారూ ప్రేరణ పొందుతున్నారు.

ప్రజల్లో అసంతృప్తి ఉన్నప్పుడు వారికి నచ్చే విధాన ప్రకటనలతో ఎన్నికల్లో విజయం సాధించటం వేరు, ఆ వాగ్దానాలను అమలు జరపటం ఓ సవాలు. సంపన్నులపై, కార్పొరేట్‌లపై పన్నుల పెంపుదల వాగ్దానం, ట్రంప్ ఆర్థిక సహాయ నిరాకరణ పరిస్థితుల్లో మమ్‌దానీకి కూడా అటువంటి స్థితి ఎదురుకానుంది. సొంత పార్టీలోని అసమ్మతివాదులను ఒక తాటిపైకి తేవటం మరో పరీక్ష. డెమొక్రాట్లకు అసలైన పరీక్ష 2026 మధ్యంతర ఎన్నికల్లో రానున్నది. ప్రస్తుతం ప్రతినిధుల సభలో రిపబ్లికన్‌లు 220, డెమొక్రాట్లు 215; సెనేట్‌లో బలాబలాలు అదే వరుసలో 53; 47. జీవనవ్యయాన్ని పెంచిన ట్రంప్ విధానాలపట్ల ఓటర్లలో అసంతృప్తి కూడా డెమొక్రాట్లకు తోడ్పడింది. వచ్చే సంవత్సరంలో ట్రంప్ తన విధానాల్లో కొన్ని మార్పులు ప్రవేశపెట్టనూవచ్చు. మమ్‌దానీ తన వాగ్దానాలను – ఇళ్ల అద్దెలు స్తంభింపజేయటం, ఉచిత బస్ ప్రయాణం, కార్మిక కుటుంబాల జీవన వ్యయం తగ్గుదల అమలు చేయగలిగితే అవి ప్రగతిశీలురకు దేశవ్యాప్తంగా నమూనా అవుతాయి. ఏది ఏమైనా ఒకటి మాత్రం స్పష్టం. ఏడాదిక్రితం అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ ఓటమి తర్వాత డెమొక్రటిక్ పార్టీ నావికుడులేని ఓడగా స్తబ్దతలో ఉంది. ప్రస్తుత ఎన్నికల ఫలితాలు పార్టీని ఉత్సాహపరుస్తాయి. ఓటర్లలో వచ్చిన తరం మార్పును గమనించి యువతరాన్ని ప్రోత్సహిస్తే పార్టీ త్వరగా కోలుకుంటుంది.

# ముట్టడిలో సమానత్వం.. ప్రమాదంలో ప్రజాస్వామ్యం...



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

1917లో జరిగిన రష్యన్ విప్లవం కేవలం రష్యా రాజకీయ పటాన్ని తిరగరాయడమే కాకుండా, ఖండాంతరాలలో ప్రకంపనలను సృష్టించింది. శతాబ్దాలుగా దోచుకోవడం, అణచివేత, నిమ్నోన్నత సామాజిక నిబంధనలపై ఆధారపడిన వలస సామ్రాజ్యాల పునాదులను కదిలించింది.

మానవాళిలో అధిక భాగం విదేశీ పాలన లేదా సామ్రాజ్య ఆధిపత్యంలో నివసించిన సమయంలో, విముక్తి, విమోచన, సమానత్వం సాధించడానికి విప్లవంలో కలిసిరావాలనే స్పష్టమైన పిలుపు పెట్రోగ్రాడ్ వీధులను దాటి చాలా దూరం ప్రయాణించింది.

వలస ప్రపంచంలో, అది బలహీనమైన నాడిని తాకింది. 1900ల ప్రారంభ దశాబ్దాల నాటికి, యూరోపియన్ వలసవాదం ప్రపంచంలోని 80 శాతం భూభాగానికి విస్తరించింది. ప్రపంచ జనాభాలో అత్యధికులు వలస పాలన పీడనలో బలవంతంగా ఉండటాన్ని ఆ ఆధిపత్యం సూచిస్తుంది. బానిసత్వంలో ఉన్న ఈ పరిస్థితులు సామాన్యమైనవి కావు. అలాంటివారు ఆసియా, ఆఫ్రికా, కరేబియన్ అంతటా కోట్లమంది నివసించారు. ఆ సందర్భంలో రష్యన్ విప్లవం ప్రపంచాన్ని కుదిపేసిన భూకంపంలా అనిపించింది, పాత వ్యవస్థను తారుమారు చేసి, అణచివేతకు గురైన వారికి ఆశను అందించింది.

అదే సమయంలో, విప్లవం లోతైన ప్రతిధ్వని విదేశీ పాలనను మాత్రమే కాకుండా వలసవాదంలో వృద్ధి చెందిన నిర్మాణాత్మక ఆధిపత్య శ్రేణులను కూడా సవాలు చేస్తుందనే వాగ్దానంలో ఉంది. భారతదేశంలో దశాబ్దాల బ్రిటీష్ పాలన అంటే ఆర్థిక దోపిడీ మాత్రమే కాదు, మానవ శ్రమను పీల్చి పిప్పిచేయటం, వనరులను స్వాధీనం చేసుకోవడం, కుల, మత, పితృస్వామ్య వ్యవస్థలతో చేతులు కలపడం. అది వలసపాలనలో మగ్గుతున్న ప్రజల హృదయాల్లో విప్లవ జ్వాల రగిలించింది. భారతదేశ ప్రజలు బాహ్య పాలకుల కొరడా దెబ్బతో మాత్రమే కాకుండా, లోతుగా పాతుకుపోయిన సామాజిక ఆధిపత్య శ్రేణుల కింద కూడా బాధలు పడుతున్నారు. భారతదేశంలో కుల పీడన, వివక్ష, హింస మన గణతంత్రానికి కళంకంగానే ఉంది

2023లో నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదిక ప్రకారం, 2023లో షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సి) వ్యక్తులపై నేరాలకు పాల్పడినందుకు 57,789 కేసులు నమోదయ్యాయి. ఇవి ప్రతి సంవత్సరం పెరుగుతున్నాయి. షెడ్యూల్డ్ తెగల (ఎస్‌టిల)పై నేరాలు గత సంవత్సరంతో పోలిస్తే 28.8 శాతం పెరిగాయి, 2023లో 12,960 కేసులు నమోదయ్యాయి.

ఇవి కేవలం సంఖ్యలు మాత్రమే కాదు, ఇవి కుల పీడన రోజువారీ జీవితాన్ని విషపూరితం చేస్తున్న సమాజానికి సామూహిక సాక్ష్యం. వలస పాలన మన దేశంలో అధికారికంగా ముగిసి ఉండవచ్చు. కానీ అణచివేత వ్యవస్థలు, అంటరానితనం, కుల వివక్ష, హింస ఇంకా కొనసాగుతున్నాయి. మన దేశంలో కుల ఆధారిత విద్వేషం ఎంతగా పెరిగిందంటే, ఒక వ్యక్తి సాక్షాత్తు భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ పై బూటు విసిరాడు. గవాయ్ దళిత సమాజానికి చెందినవారు. ఆ చర్యను సనాతన ధర్మాన్ని కాపాడుకోవడానికి తనకు వచ్చిన దైవిక పిలుపుకు ప్రతిస్పందనగా దాడికి పాల్పడిన వ్యక్తి సమర్థించుకున్నాడు. ఇది భారతదేశంలో మితవాద ఫాసిస్ట్ శక్తులు సమర్థిస్తున్న మనువాది అణచివేత వ్యవస్థకు రుజువు.

కార్పొరేట్ లాభం కోసం గిరిజనులను పారద్రోలటం, వనరులను స్వాధీనం చేసుకోవడం కూడా అంతే దుర్భరమైనది. ఇది వలస పాలన రోజులను పోలి ఉంటుంది. ఆదివాసుల భూమిని దొంగిలించినప్పుడు, అడవులను నాశనం చేసినప్పుడు, హక్కులను విస్మరించినప్పుడు విముక్తి వాగ్దానం నిరాకరించబడుతుంది. ఈ సమాజాలు భారతదేశంలో నిర్మూలనను సూచిస్తాయి, అడవులు కొద్దిమంది లాభాలు పొందే, అధిక శాతం ప్రజలు తొలగించబడే స్థలాలుగా మారతాయి. వారి అణచివేత క్రమపద్ధతిలో పాతుకుపోయింది. తరచుగా 'అభివృద్ధి' అనే భాషలో సమర్థించుకోబడుతుంది.నిర్లజ్జగా చేసే ఈ దోపిడీకి వ్యతిరేకంగా మాట్లాడే వారిని నక్సల్స్, మావోయిస్టులుగా ముద్రవేస్తూ, కార్పొరేట్లను రక్షిస్తున్నారు. దీని అర్థం వలసపాలన దోపిడీ తర్కం సజీవంగా ఉంది. కాకపోతే దానికి కొత్త పూతపూశారు.

మహిళలపై హింస, సంప్రదాయం, సంస్కృతి,'భారతీయత' పేరుతో పితృస్వామ్య గృహిణి పాత్రలలో మహిళలను పరిమితం చేయాలనే సైద్ధాంతిక ఒత్తిడి సమానత్వాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. 2023 లో మహిళలపై 4.48 లక్షల నేరాలు జరిగినట్లు ఎన్‌సిఆర్‌బి నివేదించింది. ఇది దాదాపు ప్రతి నిమిషం మహిళలపై జరుగుతున్న నేరాలను సూచిస్తుంది! ఇవి హింసకు సంబంధించిన వేర్వేరు సందర్భాలు కావు, అవి వ్యవస్థాగతమైనవి, సంస్థాగతీకరించబడినవి. అవి మానవాళిలో సగం మంది ఇప్పటికీ పూర్తిస్థాయి పౌరసత్వం, స్వయంప్రతిపత్తి కోసం అర్రులు చాస్తున్న ప్రపంచాన్ని ప్రతిబింబిస్తాయి.

ప్రస్తుత కాలంలో మతపరమైన మైనారిటీలకు భయం, అనిశ్చితి సాధారణం. వివక్ష, హత్యాకాండ, ''బుల్డోజర్ జస్టిస్'' అని పిలవబడేవి సాధారణీకరించబడడం ఆందోళన కలిగించే విషయం. మైనారిటీ వర్గాలను లక్ష్యంగా చేసుకున్న మూకహత్యలు, గోరక్షణకు కాపలా పేరుతో హింసాకాండ, హింసకు పాల్పడేవారికి శిక్ష విధించబడకపోవడం గురించి వార్తలు వినవస్తున్నాయి. రాజ్యం ప్రేరేపించే లేదా వ్యూహాత్మకంగా ప్రోత్సహించే హింస సమానత్వం హృదయాన్ని బలంగా తగిలింది. ఒక సముదాయం మరొక సముదాయంపై ఆధిపత్యం చెలాయించడానికి, హింసించడానికి లేదా బెదిరించడానికి అనుమతించే సమాజం నిజమైన అర్థంలో గణతంత్రం కాజాలదు. ఇది ఆధిపత్యం కొత్త ముసుగులో పునరుత్థానం అవ్వడమే అవుతుంది. ఈ నిమ్నోన్నత క్రమం జీవన భౌతిక పరిస్థితులు, జీవనోపాధి, గౌరవంలో పాతుకుపోయాయి. శ్రమ, ఉత్పత్తి, ఆలోచనలు, జ్ఞానం చివరకు మానవజాతి కూడా క్రమానుగతంగా వర్గీకరించబడింది. అన్యాయం అపరిమితంగా మారుతుండగా, న్యాయం చీకట్లో దారి తప్పుతుంది. నేడు మనకు తెలిసిన సత్యానంతర ప్రపంచం సమష్టి నిరాశకు సాక్ష్యమిస్తుంది. కులం, జాతి, లింగం, మతతత్వం అనే అధికార అసమానతలలో పాతుకుపోయిన ఈ అణచివేత రూపాల నుండి ఒకరు వెనక్కి తగ్గినప్పుడు, ఒక నమూనా ఉద్భవిస్తుంది. ప్రస్తుత వ్యవస్థలు సమానత్వం, సంఘీభావం, న్యాయం కంటే నిమ్నోన్నత క్రమంలో ఆధిపత్యం, మినహాయింపు, మతతత్వ నియంత్రణను బలోపేతం చేస్తున్నాయి. సమానత్వం, సంఘీభావం, న్యాయం కచ్చితంగా రష్యన్ విప్లవం ప్రకటించిన భావాలు; భారత రిపబ్లిక్ తన రాజ్యాంగంలో లిఖించిన భావాలు. ఈ రోజున ఈ భావాలతో వైరుధ్యం చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, భారతీయ జనతాపార్టీ (దుష్ట) పాలన కింద నిమ్నోన్నత ఆధిపత్య క్రమం, మినహాయింపు, మతతత్వ అనే సంస్థలు సహించబడటమేగాక, మతోన్మాద ఫాసిస్టు ఎజండాకు ఉపకరించేటట్లు వాటిని తీర్చిదిద్దుతున్నారు, ఉపయోగిస్తున్నారు, ధైర్యం నూరిపోస్తున్నారు. పెరుగుతున్న మతతత్వ విభజనతో మైనారిటీ రక్షణ బలహీనపడింది. కులం, లింగ ఆధిపత్య క్రమాలను ఎన్నికల రాజకీయాల్లో, విధాన చట్రాలలో ఆయుధాలుగా మార్చారు. సమానత్వాన్ని అమలు చేయడానికి రూపొందించబడిన నిర్మాణాలు సమానత్వాన్ని వ్యతిరేకించే వారిచే ఆక్రమించబడినప్పుడు, మన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రాలు ముట్టడిలో ఉన్నట్లే. సమాజానికి, దేశానికి ఈ ప్రమాదం ఎందుకు పొంచి ఉంది? ఒక పద్ధతి ప్రకారం మినహాయింపు, నిమ్నోన్నతాల ప్రాతిపదికపై ప్రత్యేక హక్కు , ఎంపిక చేసిన న్యాయంపై నిర్మించబడిన సమాజం తనను తాను నిలబెట్టుకోలేదు. తరగతి, కులం, మతం, లింగం ప్రాతిపదికగా సామాజిక వివక్ష విశ్వాసాన్ని తగ్గిస్తుంది, సామూహిక లక్ష్యాన్ని క్షీణింపజేస్తుంది , సామాజిక ఒప్పందాన్ని బలహీనపరుస్తుంది. సమాజంలోని విస్తృత విభాగాలను వెనక్కు పెట్టినపుడు ఆర్థిక వృద్ధి డొల్లగా మారుతుంది. పౌరులు వాస్తవానికి సమాన హక్కులను అనుభవించనప్పుడు ప్రజాస్వామ్యం గుల్లగా మారిపోతుంది. అస్థిత్వం సంఘీభావానికి ఆధారం కాకుండా విభజన ఆయుధంగా మారినప్పుడు దేశం బీటలు వారుతుంది. కాబట్టి, దానిని ఐక్యంగా ప్రతిఘటించాలి, ఓడించాలి.



**కామ్రేడ్ లెనిన్ మార్గదర్శకత్వంలో జరిగిన చారిత్రక విప్లవాన్ని గుర్తుచేసుకుంటూ, 2025 నవంబర్ 18న సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రారంభించబడే ప్రచారంలో పాల్గొనాలని, ఇందుకు నడుం బిగించాలని దేశ ప్రజలకు సిపిఐ పిలుపునిస్తోంది.**

రష్యన్ విప్లవం చారిత్రక పాఠం కేవలం ఒక సామ్రాజ్యం పతనం కాదు. అణచివేయబడినవారు ఐక్యమైనప్పుడు, సమానత్వం ప్రత్యేక సౌకర్యంగా కంటే హక్కుగా మారినప్పుడు, అణచివేత సంస్థలను పడగొట్టవచ్చు. నవంబర్ 18న దేశవ్యాప్తంగా నిరసనలు, జన సమీకరణలకు భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. సామాజిక న్యాయం, సమానత్వం కోసం, కుల వివక్ష, నిమ్నోన్నత ఆధిపత్య క్రమానికి వ్యతిరేకంగా, మతతత్వానికి వ్యతిరేకంగా, మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడానికి వ్యతిరేకంగా, పితృస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగా, మహిళలపై బహుముఖ హింసకు వ్యతిరేకంగా, ఈ సమీకరణలు ముఖ్యమైనవి. ఎందుకంటే అవి మన గణతంత్ర వాగ్దానాన్ని సజీవంగా ఉంచుతాయి: కులం, తరగతి, లింగం లేదా మతంతో సంబంధం లేకుండా పౌరులందరూ గౌరవం, హక్కులలో సమానంగా ఉంటారు. సమానత్వమనే రాజ్యాంగ వాగ్దానాన్ని కాపాడటానికి పెద్ద సంఖ్యలో సమీకృతులు కండి. అణచివేతకు గురైనవారు విడివిడిగా కాకుండా ఐక్య ఉద్యమంగా కలిసి నిలబడినప్పుడు, వారు మార్పుకు చోదక శక్తిగా మారతారు. **మనం తిరిగి పొందవలసిన వారసత్వం** ఇది:

విముక్తి స్ఫూర్తి ఒక శతాబ్దం క్రితం రగిలింది, అది నేటికీ మనల్ని ఆహ్వానిస్తోంది.

*ఫాసిజానికి మరణం! విప్లవం వర్ధిల్లాలి!*

*ఐక్యమైన ప్రజలు ఎల్లప్పుడూ విజయం సాధిస్తారు!*

# కేన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే చికిత్సతో పూర్తిగా కోలుకోవచ్చు!

శరీరంలోని ఏదైనా ఒక అవయవ భాగంలో కణజాలం అపరిమితంగా, నియంత్రణ లేకుండా పెరగడం, ఇతర కణజాలాలకు వ్యాపించడం కారణంగా ఆయా భాగాల్లో గడ్డలు లేదా రాచపుండు ఏర్పడడాన్ని కేన్సర్ వ్యాధిగా పిలుస్తారు. అతి ప్రమాదకర, ప్రాణాంతక కేన్సర్‌కు సరైన చికిత్స లేదు. తొలి దశలో గుర్తించడం వల్ల చికిత్సతో నయం చేయవచ్చు. కేన్సర్ రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడమే మన చేతుల్లో ఉందని గమనించాలి. కేన్సర్ పట్ల పూర్తి అవగాహన, తీసుకోవలసిన జాగ్రత్తలు, చికిత్సా మార్గాలు, తొలి దశలో గుర్తించడం లాంటి పలు అంశాలను చర్చించే వేదికగా ప్రతి ఏట 07 నవంబర్ రోజున జాతీయ కేన్సర్ అవగాహన దినం (నేషనల్ క్యాన్సర్ అవేర్నెస్ డే)ను 2014 నుంచి పాటించుట ఆనవాయితీగా మారింది.

**కేన్సర్లు పలు రకాలు:**

కేన్సర్ చికిత్సలో వినియోగపడే రేడియేషన్ థెరపీకి అవసరమైన రేడియం, పొలోనియం రేడియోధార్మిక మూలకాలను కనుగొన్న నోబెల్ బహుమతి




గ్రహీత మేడమ్ క్యూరీ జన్మదినం సందర్భంగా 07 నవంబర్ రోజునుజాతీయ కేన్సర్ అవగాహన దినంగా పాటిస్తున్నాం. కేన్సర్‌లు వందకు పైగా రకాలున్నాయి. వీటిలో రొమ్ము, నోటి, గర్భాశయ, ఊపిరితిత్తుల, క్లోమ, ప్రోస్టేట్, ఎముకలు, రక్తం లాంటి అవయవాల కేన్సర్లు ప్రధానమైనవి. కేన్సర్లలో కార్సినోమా (చర్మ, రొమ్ము, క్లోమ, ఇతర గ్రంథులకు), సర్కోమా (రక్తనాళాల, ఎముకల, కండరాల), మెలనోమా (చర్మ, పిగ్మెంట్), లింఫోమా (లింఫోసైట్స్), ల్యుకేమియా (రక్తం) అనబడే ముఖ్య వర్గాలు ఉన్నాయి. కేన్సర్లలో క్లోమ లేదా పాంక్రియాటిక్ క్యాన్సర్ అతి ప్రమాదకరమైనదిగా గుర్తించబడింది. భారత్‌లో ప్రతి రోజు 1,300మంది కేన్సర్ బారినపడి పడి మరణిస్తున్నారు. మన దేశ పురుషుల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్, మహిళల్లో గర్భాశయ క్యాన్సర్లు అధికంగా నమోదు అవుతూ, ప్రాణాంతకంగా మారుతున్నాయి.

**భారత్‌ను కబళించ చూస్తున్న కేన్సర్ భూతం:**

ప్రపంచవ్యాప్తంగా అసంక్రమిత వ్యాధులతో 71 శాతం మరణాలు నమోదు కాగా భారత్‌లో మాత్రం 63శాతం మరణాలు సంభవిస్తుండగా, ఇందులో 9 శాతం మరణాలు కేన్సర్ వల్లనే నమోదు అవుతున్నాయి. 1975లో భారత ప్రభుత్వం ప్రారంభించిన జాతీయ కేన్సర్ నియంత్రణ ప్రోగ్రామ్ ద్వారా కేన్సర్‌కు వైద్య సదుపాయాలను దేశవ్యాప్తంగా నెలకొల్పడం, 1984–85 నుంచి నివారణ చర్యలు, తొలి దశలో గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, హంగేరి, బెల్జియం, కెనడా, డెన్మార్క్, ఐర్లాండ్, అమెరికా లాంటి దేశాల్లో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నట్లు తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం గరిష్టంగా 8.17శాతం కేన్సర్ రోగులు భారత్‌లోనే ఉన్నట్లు పేర్కొనబడింది. భారత్‌లో ప్రతి ఏట 1.1 మిలియన్ల కొత్త కేసులు బయట పడుతుండడం ప్రమాదకర హెచ్చరికగా భావించాలి. మన దేశంలో ప్రతి 8 నిమిషాలకు ఒక గర్భాశయ కేన్సర్ రోగి మరణిస్తున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. కేన్సర్ కేసు ల్లో 66 శాతం వరకు ముదిరిన తర్వాతనే బయట పడడంతో ఆ రోగులను కాపాడడం కష్టం అవుతున్నది. భారతీయుల్లో ప్రతి 10 మందిలో ఒక్కరికి జీవితకాలం లో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, చనిపోయిన ప్రతి 15 మందిలో ఒక్కరు కేన్సర్ వ్యాధితో మరణిస్తున్నారని తెలుస్తున్నది. పొగాకు ఉత్పత్తుల దురలవాట్లతో నోటి, ఊపిరితిత్తుల కేన్సర్ కేసులు అధికంగా నమోదు కావడంతో పాటు భారతీయ మహిళ ల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు అధికంగా కనిపిస్తున్నాయి. వీటికి తోడు ఆల్కహాల్, మాదకద్రవ్యాలు, ఆహారలేమి, పోషకాహారలోపం, కాలుష్యం లాంటి కారణాలు కూడా కేన్సర్‌కు ఆజ్యం పోస్తున్నాయి.

**కేన్సర్ లక్షణాలు, చికిత్సా మార్గాలు, జాగ్రత్తలు:**

కేన్సర్ వ్యాధికి ఎలాంటి ముందస్తు లక్షణాలు కనిపించని కారణంగా తొలి దశలో గుర్తించడం కష్టంగా తోస్తున్నది. కేన్సర్ రోగ లక్షణాల్లో విరోచనాలు, దగ్గు, చర్మంపై మచ్చలు, ఉమ్మితే రక్తం పడడం, రక్తహీనత, రొమ్ములో గడ్డలు, మూత్ర సంబంధ మార్పులు, మలం లో రక్తం పడడం, బీజాల్లో గడ్డలు లాంటివి పేర్కొనబడినవి. భారతంలో దాదాపు 50 శాతం కేన్సర్ కేసుల్లో రొమ్ము, గర్భాశయ, ఊపిరితిత్తుల, జీర్ణకోశ, పెద్ద పేగు కేన్సర్లు బయట పడుతున్నా యి. కేన్సర్ ప్రధాన చికిత్సల్లో ఇమ్యునోథెరపీ, రేడియోషన్ థెరపీ, కీమోథెరపీ, హార్మోన్ థెరపీ, టార్గెటెడ్ థెరపీ, స్టెమ్ సెల్ మార్పిడి, శస్త్ర చికిత్స, ప్రిసీషన్ మెజిసిన్ లాంటివి బహుళ ప్రచారంలో ఉన్నాయి. శరీర బరువు నియంత్రణ, పోషకాహారం, శారీరక శ్రమ, టీకాలు, క్రమం తప్పకుండా చెక్‌అప్‌లు తీవ్రమైన ఎండ పడకుండా చూసుకోవడం, పొగాకు/ఆల్కహాల్ దురలవాట్ల కు దూరంగా ఉండడం లాంటి జాగ్రత్తలు కేన్సర్ రోగం బారినపడకుండా అడ్డుకుంటాయి. శరీరంలోని ఏ భాగంలోనైనా గడ్డలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం తప్పనిసరి అని గమనించాలి. కేన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండడం, జీవనశైలిని మార్చుకోవడం లాంటి చర్యలతో కేన్సర్‌ను తిప్పికొడుతూ కేన్సర్ లేని ప్రపంచాన్ని నిర్మించే ప్రయత్నాలు చేద్దాం.

**(07 నవంబర్ జాతీయ కేన్సర్ అవగాహన దినం సందర్భంగా)**

# 108 ఏళ్ల నవంబర్ విప్లవం : కొత్త వ్యూహాల ఆవశ్యకత



కృష్ణ ఝా


1917లో రష్యన్ విప్లవం విజయం సాధించిన నవంబర్ 7వ తేదీ సమీపించినందున, అనేకానేక సంవత్సరాలు, శతాబ్దాలుగా వచ్చిన మార్పులను అర్థం చేసుకోవడానికి మనకు మార్గనిర్దేశం చేసే ప్రాథమిక భావనలను పునర్నిర్వచించాల్సిన అవసరం ఏర్పడింది. శాస్త్రీయ సాంకేతిక పరివర్తన ప్రారంభంతో కొత్త ప్రపంచం ఆవిష్కృతమవుతోంది. ఈ ప్రపంచం మానవ శ్రమకు కార్ల్ మార్క్స్ చెప్పిన శాస్త్రీయ నిర్వచనాన్ని కోల్పోతోంది. సరుకు దానిలోని శ్రమ భాగాన్ని కోల్పోతోంది. విలువ సృష్టి దాని ప్రధాన ప్రాముఖ్యతను కోల్పోతోంది. ముడిపదార్థం, శ్రమకు ఉపయోగించే పనిముట్లతో వెచ్చించిన శ్రమ ప్రాతిపదికపై ఒక వస్తువును తయారు చేయటంలో శ్రమకు తక్కువ విలువ ఇవ్వబడుతున్నది. శ్రమ సాధనాలు సాధారణంగా పారిశ్రామిక విప్లవం సమయంలో అభివృద్ధి చెందుతాయి. అలాగే ఉత్పత్తి ప్రక్రియలోనే శ్రమ వాటా తగ్గుతున్నట్లు సంకేతం కనబడుతుంది. ఉత్పత్తి ప్రక్రియ కూడా సంధికాల దశలో ఉంది. కృత్రిమ మేధస్సు (ఎఐ), ఆటోమేషన్ రాజ్యమేలుతున్నాయి. ఇది పారిశ్రామిక విప్లవం మాదిరిగా లేదు. కంప్యూటర్లు , ఎలక్ట్రానిక్స్ ఆధిపత్యం చెలాయించే ప్రపంచం మన చుట్టూ ఉంది.

మనం కొత్త స్థాయిలను అభివృద్ధి చేసే ప్రక్రియలో ఉన్నాము. ప్రత్యేకించి గతితర్కంలో దానంతట అదే పరివర్తన చెంది, రూపుదిద్దుకుంటున్నది. సాఫ్ట్‌వేర్, హార్డ్ వేర్ విరుద్ధమైన స్వభావం కూడా దశలవారీగా మార్పులకు లోనవుతోంది. నెమ్మదిగా పారిశ్రామికీకరణ అనంతర ఉత్పత్తి సాధనాలు, కమ్యూనికేషన్ ప్రవేశిస్తున్నాయి. కంప్యూటర్ కూడా మారుతున్నదనే వాస్తవాన్ని అర్థం చేసుకోవడం కూడా చాలా అవసరం. అది కరిగిపోతోంది. సాఫ్ట్‌వేర్ ద్వారా నడుస్తున్నప్పటికీ కంప్యూటర్ అనేది హార్డ్‌వేర్‌తో తయారు చేయబడింది. భాష వాహకంగా, ఇది సమాజాన్ని, మానవులను, వారి చైతన్యాన్ని కూడా ప్రభావితం చేస్తూనే ఉంటుంది. దానికి ఉన్న వేగం మానవునిపై లోతైన ప్రభావాన్ని చూపుతోంది. ఇది ఇప్పుడు దాదాపు స్వతంత్ర అస్థిత్వాన్ని పొందుతోంది. తొలిసారిగా చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపు తీసుకునే దిశగా సమాజం అభివృద్ధి చెందుతోంది.

ఇక్కడ మరో ఆశ్చర్యం కూడా ఉంది. దాదాపు జీవితంలో భాగంగా మారిన కంప్యూటర్, ఉపయోగంలో లేకుండా పోతోంది. మొదట కీ బోర్డు అవసరం లేనిదిగా మారింది. ఇక్కడ పరివర్తన స్పష్టంగా కనపడుతుంది. ఇందుకు మొబైల్‌లు, ట్యాబ్లెట్‌లు, ఐప్యాడ్లు ఉదాహరణలు. యంత్రం నుండి యంత్రయేతర దిశగా పరివర్తన సాగుతుంది. వాస్తవానికి అన్ని హార్డ్‌వేర్‌లను సాఫ్ట్‌వేర్‌గా మార్చవచ్చు. కంప్యూటర్ లాగా పనిచేసే సాఫ్ట్‌వేర్ బయోఎలక్ట్రానిక్ వ్యవస్థగా మన శరీరంలో భాగమయ్యే దశ రావచ్చు, ఇది 'సమాచార విధానం ఆవిర్భావం'ను సూచిస్తుంది.

ఇది కొత్త అంశంగా సమాచారాన్ని జోడించినప్పటికీ, ఇది ఉన్నత స్థాయిలో పారిశ్రామిక విప్లవం కాదు. వాస్తవం ఏమిటంటే కొత్త పారిశ్రామిక విప్లవం.. పారిశ్రామిక విప్లవంలో పారిశ్రామిక స్వభావాన్ని మారుస్తోంది. దీని ఫలితంగా కొత్త మౌలిక అంశాలతో కూడిన సామాజిక అభివృద్ధి జరుగుతుంది. పారిశ్రామిక అనంతర పురోగతికి కొత్త క్షేత్రాలు ఉద్భవిస్తున్నాయనే అంశాన్ని ఇది తెరపైకి తెస్తుంది. ఇది కొత్త రూపాల ఆగమనానికి సన్నాహకంగా కొత్త 'బహు–కోణాల రూపాల'ను పొందుతుంది. అసాధారణ రీతిలో ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచిన అధిక , మరింత ఉత్పాదక యోగ్యతలతో కూడిన మరొక పారిశ్రామిక విప్లవంగా శాస్త్రీయ సాంకేతిక విప్లవాన్ని(ఎస్‌టిఆర్) తీసుకోవడం కూడా తప్పు అవుతుంది. ఎస్‌టిఆర్ మౌలిక అంశం ఏమిటంటే, ప్రాథమికంగా కమ్యూనికేషన్ ఎలక్ట్రానిక్‌గా మధ్యవర్తిత్వం వహించినప్పుడు, ఇది ఆలోచన, పదార్థం మధ్య, మెదడు, యంత్రం మధ్య సంబంధాన్ని మార్చివేస్తోంది.

ఇప్పటివరకు, మనం విభజించబడిన సమాజంలో జీవిస్తున్నాము. మానవ సంబంధాలు, వాటి సన్నిహిత, ప్రతికూల అంశాలు సున్నితమైన మార్పులకు లోనవుతున్నాయి. ఉత్పత్తి స్వభావంలో మార్పులతో వర్గాలు నెమ్మదిగా తమ ప్రాథమిక స్వభావాన్ని కోల్పోతున్నాయి. ఇది మొత్తం శ్రమ ప్రక్రియను




ప్రభావితం చేస్తోంది. కొత్త పరిణామాలు కార్మికుడిని (కార్మికుల నిర్వచనం ఇప్పటికీ చెల్లుబాటులో ఉన్నట్లయితే) పునరావృత , యాంత్రిక శ్రమ నుండి విముక్తి చేస్తాయనేది నిజం. కార్మికుడు తన స్వంత పాత్రను కూడా పునర్నిర్వచించుకోవాల్సి వస్తుంది. మార్పుకు అనుగుణంగా ఉండటం తప్ప వేరే మార్గం లేదు. సంక్షిప్తంగా, ఉత్పత్తి ప్రక్రియలో శ్రమ తన ప్రధాన స్థానాన్ని కోల్పోవడం అనే ఆలోచనే మార్పుల వరద ద్వారాలను తెరుస్తుంది. శ్రమ పట్ల గౌరవం ఇకపై కార్మికుడిని గర్వపడేలా చేయదు. కొత్త శ్రమ సాధనాలతో ఉత్పత్తి ప్రక్రియలో మార్పు, తద్వారా అతన్ని కఠినమైన శ్రమ నుండి విముక్తి చేయడం కొత్త ఉద్యోగంలో భాగం. వర్గ శత్రువుపై తుది దాడికి నాయకత్వం వహించడానికి శ్రమ గతంలో ఆక్రమించిన స్థానాన్ని, కార్మిక వర్గం గతంలో లభించిన ప్రాముఖ్యతలను కోల్పోతోంది.

ఈ మార్పులన్నీ చాలా వేగంగా వస్తాయి. వివిధ విలువలు, వివరాలలో పరివర్తన, అలాగే మౌలిక ఉత్పత్తి ప్రక్రియ మన చైతన్యం, జీవనశైలిని కూడా ప్రభావితం చేస్తాయి. కానీ శాస్త్ర, సాంకేతికతలు చాలా వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, సమాజం , వ్యవస్థ చాలా నెమ్మదిగా కదులుతుండటం కూడా గమనార్హం. ఆలోచనలు, ప్రపంచ దృక్పథం, విలువలు పరిణతి చెందడానికి, మారడానికి చాలా సమయం పడుతుంది. ఈ రెండింటి మధ్య గతితార్కికత ముందుకు వస్తుంది. పరివర్తనకు అన్వయించుకునేందుకు ఉన్నత నిర్మాణానికి సమయం పడుతుంది. అక్టోబర్ విప్లవం తర్వాత జరుగుతున్న మార్పులను ఇది గుర్తు చేస్తుంది. విప్లవ ప్రక్రియలో లెనిన్ మార్గదర్శకత్వంలో మొత్తం సమాజం భాగస్వామిగా మారి సోషలిస్ట్ సమాజాన్ని నిర్మించడానికి ప్రయత్నాలు ప్రారంభించబడ్డాయి. దశలవారీగా భూ సంస్కరణ, సమష్టి వ్యవసాయం, ప్రైవేట్ ఆస్తి సామాజికీకరణ, నవ సమాజాన్ని, నవ మానవుడిని నిర్మించడానికి , తప్పనిసరైన అలాంటి అనేక మార్పులకు మౌలికాంశాలను సిద్ధం చేశారు.

అయితే, భూస్వామ్య ధోరణులు దీర్ఘ కాలం పాటు కొనసాగాయి. ఇది మితవాద శక్తులు ముందుకు రావడానికి సహాయపడడమే కాకుండా సోషలిస్ట్ సమాజ నిర్మాణంలో అడ్డంకులు సృష్టించింది, బూర్జువా ప్రభావాన్ని ప్రోత్సహించింది. అలాంటి ధోరణులపై నెగ్గేందుకు, లెనిన్ సోషలిస్ట్ వ్యవస్థకు పునాదిని సృష్టించడానికి ప్రయత్నించాడు. అది బూర్జువా ప్రజాస్వామ్య విప్లవం మాత్రమే కావచ్చు. 1917 ఫిబ్రవరిలో, బూర్జువా ప్రజాస్వామ్య విప్లవం సంభవించింది. ఇది లెనిన్ చేసిన గొప్ప పనులలో ఒకటి. దాని ఆచరణాత్మకత ఆగిపోకుండా ఇంకా కొనసాగుతూనే ఉంది. నూతన ఆర్థిక విధానం (ఎన్‌ఇపి) రోజుల్లో ఈ చర్య స్ఫూర్తిని సజీవంగా ఉంచారు.

లెనిన్ మధ్య స్థాయి, చిన్నకారు రైతులకు కూడా రాయితీలు అందించారు. వారి భూమిని, ఆస్తిని ఉంచుకోవడానికి అనుమతించారు. వారి ఉత్పత్తులను ప్రత్యేకించి వారి కోసం నిర్మించిన ప్రైవేట్ మార్కెట్ (రష్యన్‌లో రెనోక్)లో విక్రయించడానికి కూడా అనుమతించారు. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు ప్రపంచవ్యాప్తంగా శ్రామిక ప్రజలకు ఆశాకిరణమైన ఏకైక జ్వాలను అణిచివేసే క్షణం కోసం వేచి ఉన్న రోజులు అవి.

## ప్రజా ఉద్యమాలకు తోడ్పాటునందించిన రాములమ్మ

ప్రజాపక్షం/కారేపల్లి: చీమలపాడు ప్రాంతంలో జరిగిన పోడు కూలి మహిళ పోరాటాలకు తన జీవితాంతం తోడ్పాటు అందించిన ఉద్యమకారిణి చెవుల రాములమ్మని మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు రమణ కొనియాడారు. చీమలపాడులో సిపిఎం సీనియర్ నాయకులు రాచ బంటి పుల్లయ్య అత్త చెవుల రాములమ్మ సంస్మరణ కార్యక్రమం జరిగింది. రాములమ్మ జీవితాంతం ఉద్యమకారురాలి గాని జీవించిందని ఆమె జీవితం అందరికీ ఆదర్శమని ఆమె స్ఫూర్తితో ప్రజలు ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు నిర్మించాలని అప్పుడే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని మెరుగు రమణ పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె నరేంద్ర, డివిజన్ కమిటీ సభ్యులు వజ్జారామారావు, మండల కమిటీ సభ్యులు యనమనగండ్ల రవిబాబు, వల్లబోయిన కొండలరావు, అజ్మీర, శోభన్ బాబు, సీనియర్ నాయకులు రాచబంటి పుల్లయ్య, ఎరుపోతు భద్రయ్య, మస్తం బ్రహ్మయ్య, షేక్ వెంకటేశ్వర్లు, ఎస్‌కే సైదులు, కొండం వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి ఎస్ఐ రామారావు

ప్రజాపక్షం/వైరా: మానవ అక్రమ రవాణా గురించి పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని వైరా ఎస్సై రామారావు అన్నారు. స్మోప్ అర్డ్ వై చా యిసెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కెజి సిరిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు చేసిన సురక్షిత గ్రామ కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది నానాటికి పెరిగిపోతుందని, నివారించడానికి అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.బాలబాలికలు చదువు మీద దృష్టి పెట్టాలని ఇతర వ్యాపకాల అలవాట్లు దూరంగా ఉండాలని సెల్‌ఫోన్ కేవలం మంచి పరిజ్ఞానం కొలుసుకోవడానికి మాత్రమే వినియోగించాలని హితవు పలికారు. అక్రమ రవాణా చేయడానికి అనేక మార్గాల్లో అస్కారం ఉందని తెలిపారు. అనుమానం వస్తే వెంటనే డయల్ 100, 18004198588, 1098లకు తెలిపి సహాయం పొందవచ్చని అన్నారు. స్కూల్ అర్గికోర్డినేటర్ కె.సుజాత, శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన డిఎస్ఒ చందనకుమార్



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం పూసలపాడు సొసైటీ పరిధిలోని పిపిసి పూసలపాడు, పిపిసి నారపనేనిపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సివిల్‌సప్లై అధికారి కె.చందనకుమార్, ఆర్ఐ కిరణ్ పరిశీలించారు. తేమశాతం రాగానే మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేశామని, మిల్లులు కూడా టాగ్ చేయడం పూర్తయిందని తెలిపారు. అలాగే ధాన్యం తేమశాతంను కొత్తగా ఏఎంసి ద్వారా ఇచ్చిన మీటర్లను పరిశీలించారు. పాత మీటర్లకి కొత్త మీటర్లకి తేమశాతం తేడా అధికంగా ఉండటం గుర్తించారు. వెంటనే జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే జాయింట్ కలెక్టర్ అట్టి మాయిశ్చర్ మీటర్లని ఇచ్చి కొత్తవి తీసుకోమిన తెలియజేశారు. అట్టి మీటర్లపై డిఫెక్ట్ అని వ్రాసి మీటర్లను ఎవరికి ఇవ్వద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే దాచాపురం చెక్‌పోస్ట్‌ని కూడా తనిఖీ చేయడం జరిగింది. సొసైటీ చైర్మన్ గాలి శ్రీనివాసరావు, సంఘు కార్యదర్శి జి.చిన్నకృష్ణయ్య, సంఘు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## అమరవీరుల ఆశయ సాధనకు పోరాడుదాం



ప్రజాపక్షం/కారేపల్లి: సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల నవంబర్ ఒకటి నుండి 9 వరకు అమరవీరుల సంతాప సభల పిలుపులో భాగంగా గురువారం కారేపల్లి మండలం మాదారం గ్రామ పంచాయితీలో గల గోవిందతండాలో అమరుడు కామ్రేడ్ కాలియా స్తూపంపై జెండా ఎగురవేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వై ప్రకాష్ మాట్లాడుతూ దోపిడీ పీడన అసమానతలు లేని సమ సమాజం కోసం భూమి కోసం భుక్తి కోసం ఈ దేశ విముక్తి కోసం ఎంతో మంది వీరులు వీరవనితలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణపాయంగా అర్పించినారని, వారి ఆశయ సాధనలో మనమందరం పయనించినప్పుడే మనం వారికి ఇచ్చే నిజమైన నివాళ్ళని వారు చూసిన మార్గంలో మనమందరం పయనించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల నాయకులు కోయిల శ్రీనివాస్, కుర్ర శ్రీనివాస్, బి వీరు, గోవిందు, గడ్డం వెంకన్న, నరేష్, సురేష్, సతీష్, ఎర్రయ్య, శివయ్య, నరసింహారావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ పోరాట ఫలితంగానే ప్యాచ్‌రోడ్డు

అభినందనలు తెలిపిన వాహనదారులు, ప్రజలు



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్ లో గల ఖమ్మంసూర్యాపేట రాష్ట్రీయ రహదారిపై పెద్దగుంత ఏర్పడింది. దీంతో వాహనాలు అందులో పడి గుల్లవుతుండటంతో పాటు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాపక్షం దినపత్రికలో సెప్టెంబర్ 29న ప్రధాన రహదారిపై గుంత అనే శీర్షికన కథనం ప్రచురించింది. ఈ నేపథ్యంలో అక్కడి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, ఎలక్ట్రికల్‌షాప్ యజమాని బబుతరాం ఆ గుంతలో డ్రమ్మును ఏర్పాటు చేసి ఎర్రజెండాను ప్రమాదసూచికగా పెట్టారు. అయినప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో సిపిఐ నేత దండి రంగారావు యువజన సంఘం సభ్యులతో కలిసి అక్టోబర్ 30వ తేదీన కాంక్రీట్ ద్వారా గుంతను స్వయంగా పూడ్చారు. సిపిఐ, ప్రజాపక్షం దినపత్రిక ఫలితంతో ప్యాచ్‌రోడ్డు ఏర్పాటు కావడంపై వాహనదారులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

## గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం

సిపిఐ (ఎం) గ్రామపంచాయతీ కార్యాలయం ముట్టడి



ప్రజాపక్షం/భద్రాచలం : రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం గ్రామపంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తూ సిసిరోడ్లు వేస్తున్నారని, స్థానిక సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారని సిపిఐ ఎం పట్టణ కార్యదర్శి గడ్డంస్వామి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు అన్నారు. పేదలు నివాసాలు మరిచి రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం రెడ్డి సత్రం సమీపంలో రూ.10 లక్షల సిసి రోడ్డు మంజూరు చేశారని, కానీ ఇంటి పన్నులు కట్టే శివారు కాలనీ ప్రజలకు కనీస మౌళిక సదుపాయాలు కల్పిచడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాజుపేట, జగదీష్ కాలనీ, కొత్తకాలనీ, భూపతిరావు, అశోక్‌నగర్ కాలనీ, సుందరయ్య నగర్, కొర్రాజులగుట్ట, ఎంపి కాలనీ, ఏఎంసీ కాలనీల్లో సైడ్ డ్రైన్‌లు, సిసి రోడ్లు లేక మురుగునీరు రోడ్లపై పారుతోందని, పెరిగిన జనాభాకు అనుగుణంగా వీధిలైట్లు వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇఒకు అందించారు. సంతోష్, గంగా, లీలావతి, జ్యోతి, రాఘవయ్య, ఫిరోజ్, శ్రీనివాసరావు, భూపేంద్ర, సతీష్, రవీంద్ర తదితరులుపాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయికి ఎంపికైన గురుకుల విద్యార్థిని

ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరులోని గురుకుల కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం ఎంఈసి చదువుతున్న బొడ్డు అంబిక జిల్లా నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక జరిగింది. అండర్ 19 వాలీబాల్ రాష్ట్ర పోటీలలో జాతీయస్థాయి వాలీబాల్ జట్టుకి ఎన్నిక కావడం జరిగింది. ఈ నెల మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో పదో తారీకు నుండి 16వ తేదీ వరకు జరుగునున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కనకదుర్గ తెలిపారు. అంబికా ఐదవ సారి, మూడవ జాతీయస్థాయి పోటీలలో మూడు మెరిట్ సర్టిఫికేట్ పొందడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయురాలు పద్మ, పిడి త్రివేణి, కళాశాల సిబ్బంది, విద్యార్థినిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# 12న కొత్తగూడెం క్లబ్‌లో మెగా జాబ్ మేళా

సద్వినియోగం చేసుకోవాలని

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచన

హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సింగరేణి సంస్థ సౌజన్యంతో ఈనెల 12న కొత్తగూడెం క్లబ్‌లో జరిగే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని, ఈ జాబ్ మేళా ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరు కానున్నారని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో జాబ్ మేళా సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ సంస్థ సౌజన్యంతో కొత్తగూడెం కేంద్రంగా జరిగే ఈ జాబ్ మేళాకు 50కి పైగా కంపెనీలు హాజరవుతున్నాయని చెప్పారు. జిల్లా నలు మూలల నుండి 10 వేల మందికి పైగా హాజరయ్యేలా జిల్లాలో ఉన్న అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు. మూడు వేలకు పైగా ఉద్యోగాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న జాబ్‌మేళా నిరుద్యోగల పాలిట వరంగా మారుతుందని, ఆర్థికంగా స్థిరపడేందుకు అవకాశం ఉంటుందన్నారు.10వ తరగతి పాస్ అయిన వారి నుండి మొదలుకుని ఇంజనీరింగ్, డిప్లొమా, ఫార్మసీ, ఎంబిఏ, ఎంసిఏ, పోస్టుగ్రాడ్యుయేట్, బిఇ, బిటెక్, ఎంటెక్, గ్రాడ్యుయేట్ తదితర చదువులు చదివిన వారంతా ఈ జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందేందుకు హాజరుకావచ్చని చెప్పారు. కనీసం రూ.13 వేల నుండి మొదలుకుని రూ.10 లక్షల నెలకు ప్యాకేజీతో జీతాలు వచ్చే అవకాశం ఉందని, దిగ్గజ సాఫ్ట్‌వేర్, ఫార్మసీ కంపెనీలతో పాటు పలు కంపెనీలు వస్తున్నాయని చెప్పారు. జాబ్ మేళాకు హాజరయ్యేందుకు ముందుగా రిజిష్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని, క్యూఆర్ కోడ్ ద్వారా కూడా ఆన్‌లైన్ రిజిష్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఆన్‌లైన్ రిజిష్ట్రేషన్ చేసుకోవడం వీలుకాని వారు కూడా నేరుగా హాజరై స్పాట్ రిజిష్ట్రేషన్ చేసుకుని జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని, ఒక్కొక్క అభ్యర్థి కనీసం 5 కంపెనీలు నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు అయ్యే విధంగా టోకెన్ పాస్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని, ఉద్యోగానికి అభ్యర్థులు ఎంపికైన వెంటనే అక్కడికక్కడే ఆయా కంపెనీలు ఉద్యోగం కల్పిస్తున్నట్లు ఒప్పంద పత్రాలను కూడా ప్రముఖుల చేతుల మీదుగా అందిస్తారని చెప్పారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ జాబ్‌మేళాలో జిల్లాలోని 40 ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించాలని, అధికారులు ఇందుకు సంబంధించి ఓ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలన్నారు. అనంతరం జాబ్‌మేళాకు చెందిన పోస్టర్‌ను విడుదల చేశారు. ట్రైనీ కలెక్టర్ మురళీధర్, సింగరేణి ఎస్ఓ2 జిఎం కోటిరెడ్డి, ఏజిఎం (సివిల్) రామకృష్ణ, డిజిఎం (పర్సనల్) మోహన్ రావు, ఎస్టేట్ ఆఫీసర్ తావుర్య, జాబ్‌మేళా కో ఆర్డినేటర్ చందర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్‌డిఓ మధు, కార్పోరేషన్ కమీషనర్ సుజాత, డిఎస్‌పి రెహమాన్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, గుర్తింపు సంఘం నాయకులు వట్టికొండ మల్లిఖార్జునరావు, అధికారులు పాల్గొన్నారు.



# సంతృప్తిగా ఆరోగ్య సేవలు

మాతాశిశు, వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు భేష్

జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో ప్రజారోగ్య సేవలు సంతృప్తి నిచ్చాయని, ప్రధానంగా మాతశిశు, వ్యాధి నియంత్రణ, జాతీయ ఆరోగ్య మిషన్ క్రింద అమలవుతున్న వివిధ కార్యక్రమాలు సంతపృప్తి నిచ్చాయని సిఎంఆర్ బృందం సభ్యులు డా గురువింద్ బీర్ సింగ్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సముదాయంలో జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఆధ్వర్యంలో జిల్లా ఆరోగ్య సేవలపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఐదుగురు సభ్యులతో గల సిఆర్ఎం బృంద సభ్యులుహాజరయ్యారు. ముందుగా బృందం సభ్యులు కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రి, సిహెచ్‌సి చర్ల, ఇల్లందు, గుండాల, భద్రాచలం, సుజాతనగర్, శేఖర్ బంజర, రామవరం, లచ్చగూడెం, ముత్తాపురం, నమిడిగూడెం, దన్నాధ్, చాతకొండ, తేగడ, దానవాయిపేట తదితర ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ఆరోగ్య సేవలను పరిశీలించారు. గురిందర్ బీర్ సింగ్ మాట్లాడుతూ జిల్లాల్లో ఆరోగ్య స్బిబంది నిబద్ధతతో పనిచేస్తున్నారని, ఆరోగ్య సేవల నాణ్యత గణనీయంగా మెరుగుపడిందని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణ, వైద్య సదుపాయాలు మెరుగుపడ్డాయన్నారు. వైద్య సిబ్బందికి తరుచూ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించే వైద్య సేవలను మెరుగుపరుస్తూ విస్తరించాలన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు సమర్థవంతంగా పనిచేస్తున్నారని అభిప్రాయపడ్డారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బృందం చేసిన సూచనలు సత్వరమే అమలు చేయాలని, ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తం




ప్రజాపక్షం/ రఘునాథపాలెం : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు గురువారం రఘునాథపాలెం గ్రామంలో మల్టీలెవల్ మార్కెటింగ్, ఇన్వెస్టెమెంట్ ఫ్రాడ్, ఇతర సైబర్ నేరాలపై స్థానిక ప్రజలకు, యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.సైబర్ నేరగాళ్లు ప్రతి రోజు కొత్త మార్గాలలో మోసాలకు పాల్పడుతున్నారని పోలీసులు ప్రజల భద్రతకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ వ్యక్తిగత అప్రమత్తత కూడా చాలా అవసరం అన్నారు. లాటరీ, పెద్ద మొత్తంలో డబ్బులు గెలుచుకున్నారని చెప్పే నకిలీ ఆఫర్లను నమ్మవద్దన్నారు. వాట్సాప్‌లో వచ్చే అనవసర లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. ఓటిపిలను, ఏటిఎం కార్డు పిన్‌లను ఇతరత్రా సమాచారాన్ని ఇతర వ్యక్తులకు షేర్ చేయవద్దని సూచించారు. పోలీస్, సిబిఐ నుంచి మాట్లాడుతున్నామంటూ చెప్పే కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## ర్యాగింగ్‌తో భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దు

ఖమ్మం నగర ఎసిపి రమణమూర్తి




ప్రజాపక్షం/ ఖమ్మం క్రైం : ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని ఖమ్మం నగర ఎసిపి రమణమూర్తి తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు యాంటీ ర్యాగింగ్ చట్టంపై గురువారం మమత మెడికల్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్స్, జూనియర్స్ స్నేహంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. విద్యార్థినిలపై ఎటువంటి వేధింపులు, దౌర్జన్యాలు, అసభ్య కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు గురైతే తక్షణమే ప్రిన్సిపల్, యాజమాన్యానికి లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అధ్యాపకులు, పోలీసులు కలిసి పనిచేసినప్పుడే ర్యాగింగ్ సంస్కృతిని నిర్మూలించగలుగుతామన్నారు. చట్టాన్ని తెలుసుకుని భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యను అభ్యసిస్తూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ అనురాధ, ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## వెట్ ల్యాండ్ పరిరక్షణతో పర్యావరణానికి మేలు


అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : వెట్ ల్యాండ్ పరిరక్షణతో పర్యావరణానికి మేలు జరుగుతుందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం నిర్వహించిన వెట్ ల్యాండ్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్‌తో కలిసి పాల్గొన్నారు. వెట్ ల్యాండ్ కమిటీ బాధ్యతలు, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను కమిటీ సభ్యులకు జిల్లా అటవీ శాఖాధికారి వివరించారు. చిత్తడి భూములు (వెట్ ల్యాండ్) సంరక్షణ కోసం 2017లో ప్రభుత్వం కొన్ని నిబంధనలు ప్రవేశపెట్టిందన్నారు. వెట్ ల్యాండ్ గుర్తింపు, సంరక్షణ కోసం జిల్లా వెట్ ల్యాండ్ కమిటీని కలెక్టర్ ఛైర్మన్‌గా ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రాథమికంగా నోటిఫై చేసేందుకు రాష్ట్రంలో 11.468 వెట్ ల్యాండ్‌లను గుర్తించడం జరిగిందని ఖమ్మం జిల్లాలో 467 వెట్ ల్యాండులు, 8,911 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నట్లు తెలిందని తెలిపారు. చెరువులు, రిజర్వాయర్, కాలువల ఫీడర్ ఛానెల్స్, మత్స్యశాఖ పరిధిలో ఉన్న ప్రణాళిక, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరిధిలో ఉన్న సమాచారం పరిగణలోకి తీసుకుంటూ జిల్లాలో ఉన్న చిత్తడి నేలలను ధృవీకరించాలన్నారు. చిత్తడి నేలలను గుర్తించడం ద్వారా భూమి యాజమాన్యం ఎట్టి పరిస్థితుల్లో మారదని రైతులు, భూ యాజమాన్యాలు అనవసర ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. చెన్నైయ్ మహ నగరంలో ఇటీవల వచ్చిన భారీ వరదలకు చిత్తడి నేలలు సంరక్షించకపోవడం ప్రధాన కారణమని తెలిందన్నారు. క్షేత్రస్థాయిలో చిత్తడి నేలల్లో పర్యటించి స్థానిక పరిస్థితులపై నివేదిక సిద్ధం చేసి జిల్లాలో గుర్తించిన చిత్తడి నేలలను ఆరు నెలల లోపు నోటిఫై చేయాలన్నారు. చింతకాని మండలం పైలెట్ క్రింద ఎంపిక చేసి ముందస్తుగా చిత్తడి నేలలను గుర్తించి అక్కడ పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, డిపివో ఆశాలత, జిల్లా మత్స్యశాఖాధికారి శివప్రసాద్, జిల్లా ఇరిగేషన్ అధికారి టి. వెంకట్రామ్, డిప్యూటీ సిఈవో కె. నాగపద్మజ, జిల్లా ఉద్యానవన అధికారి ఎంఈ మధుసూదన్, ఇరిగేషన్ ఈఈ అనన్య, మధిర, వైరా మున్సిపల్ కమిషనర్లు సంపత్‌కుమార్, గురులింగం, ఖమ్మం కార్పోరేషన్ హార్టికల్చర్ అధికారిణి రాధిక తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ వందేళ్ల ముగింపు వేడుకల కరపత్రాల పంపిణీ

సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్



ప్రజాపక్షం/మణుగూరు: భారతదేశంలో సిపిఐ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాల ముగింపు వేడుకలు డిసెంబర్ 26న ఖమ్మం పట్టణంలో పెద్ద ఎత్తున సుమారు 5 లక్షల మందితో భారీ బహిరం గ సభ నిర్వహించనున్నామని దీనికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్ పిలుపునిచ్చారు. గురువారం బాపనగుంట గ్రామంలో సిపిఐ నాయకులు ఇల్లు ఇల్లు తిరుగుతూ డిసెంబర్లో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. 40 దేశాల నుండి ప్రతినిధులు, జాతీయ నాయకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారని లక్షలాది మందితో జరిగే ఈ ప్రదర్శన, బహిరంగ సభ ఎరుపుమయమై ఖమ్మం జిల్లా ఎరుపెక్కనుందని దీని కోసం ఇప్పటినుండే, అన్ని మండలాల్లో గ్రామాల నుండి విస్తృతంగా ప్రజల ను, కార్యకర్తలను కలుస్తూ వారి సహకారం కోరుతూ, సభ విజయవంతం కు పెద్ద ఎత్తున ప్ర జలు తరలిరావాలని విజ్ఞప్తి చేస్తున్నామని వారన్నారు. ప్రతి ఒక్కరు ఎర్ర షర్ట్స్ ధరించి, మహిళలు ఎ ర్ర శారీస్ కట్టుకొని యువకులు, విద్యార్థులు, కార్మికులు, రైతులు, మహిళలు ప్రజలు సన్నద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. వీరి వెంట సిపిఐ మణుగూరు పట్టణ సహాయ కార్యదర్శి దశరథం ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్షులు కాంతారావు, కోటయ్య ఉన్నారు.

## సామినేని హత్యపై విచారణ జరిపి దుండగులను శిక్షించాలి

ప్లకార్డులతో సిపిఐ(ఎం) నిరసన



ప్రజాపక్షం/భద్రాచలం : ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతు ఉద్యమనేత సామినేని రామారావును కిరాతకంగా హత్య చేసిన వ్యవహారంపై విచారణ చేపట్టి దుండగులను ఖఠినంగా శిక్షించాలని కోరుతూ సిపిఐ ఎం ఆధ్వర్యంలో గురవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సిపిఎంను ఎదుర్కొనే సత్తాలేక పార్టీకి చెందిన ముఖ్యులను హతమార్చి భయానక వాతావరణ సృష్టించేందుకు చూస్తున్నారని,హత్యా రాజకీయాలతో ప్రజా పోరాటాలను ఆపలేరన్నారు. సిపిఎం నాయకులు గంగ, సీతాలక్ష్మి, వతి, నాగరాజు, జ్యోతి, శ్రీనివాస్ భూపేందర్, శ్రీను, రాఘవయ్య పాల్గొన్నారు.

## స్థానికులకే బూడిద తోలకాల అవకాశం కల్పించాలి:ఏఐటియుసి



ప్రజాపక్షం/పాల్వంచ : కేటిపిఎస్ యాష్‌పాండ్ బూడిద తరలింపు కోసం స్థానిక లారీ యాజమానులకే అవకాశం కల్పించాలని ఏఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. కేటిపిఎస్ అల్లూరి సెంటర్‌లో ఏఐటియుసి అనుబంధ లారీ ఒనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఏఐటియుసి జిల్లా నాయకులు ఇట్టి వెంకటరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబులు మాట్లాడుతూ మొదటి నుండి కేటిపిఎస్ కర్మాగారానికి చెందిన యాష్‌పాండ్‌ను నమ్ముకొని పాల్వంచకు చెందిన 129 మంది అప్పులు తెచ్చుకొని టిప్పర్, లారీలను కొనుగోలు చేసుకొని దశాబ్దాల తరబడి నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు బూడిదను తరలిస్తూ జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. స్థానికులను కాదని గత నాలుగు నెలల క్రితం స్థానికేతరుడైన పుచ్చకాయల వీరభద్రం అను వ్యక్తి తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే వారితో కుమ్మక్కై, కొందరు ప్రజాప్రతినిధులకు తప్పుడు సమాచారం ఇచ్చి వారిని సైతం తప్పుదోవ పట్టించి స్థానిక లారీలను నిలిపివేయించాడు. మహిళా సంఘం నాయకులు వీసంశెట్టి పద్మజ, ఏఐటియుసి నాయకులు శనిగారపు అల్లి వెంకటేశ్వర్లు, కరీమ్‌పాషా, సత్యనారాయణ, పాల్గొన్నారు.

## నాగమణి హత్య నిందితులు రిమాండ్

వివరాల వెల్లడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముష్క రాజు

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఈ నెల 3వ తేదీన ముత్తగూడెంలో రెండు కుటుంబల కళహాల నేపథ్యంలో గునిగంటి నాగమణి అనే మహిళను హతమార్చిన నిందితులను గురువారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు.ముష్క రాజు పోలీస్ స్టేషన్‌లో వెల్లడించారు. మృతురాలికి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని నిందితుల కోసం దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.హత్యకు పాల్పడిన మొటపోతుల మనోజ్, ఎల్లీ వెంకన్న, కుట్రకు సహకరించిన మొటపోతుల వెంకటేశ్వర్లు, మొటపోతుల అనిత, అఖిలను ఖమ్మం నగర సమీపంలో పారిపోతుండగా పట్టుకున్నామన్నారు.

## హుజురాబాద్‌కు పూర్వ వైభవం తెస్తా

మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్

**ప్రజాపక్షం/ కమలాపూర్:** సర్పంచ్, ఎంపిటిసిలు, ఎంపిపి లను గెలిపించి ఇవ్వండి... హుజురాబాద్ కు పూర్వ వైభవం తీసుకోని వస్తానని, ఈ సమస్యలన్ని తీర్చే బాధ్యత నాది అని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. శనిగరం, దేశరాజుపల్లి, శంభునిపల్లె, గోపాల్‌పూర్, కమలాపూర్, జమ్మికుంట, మడిపల్లి, శ్రీరాములపల్లి గ్రామాలతో పాటు పలువురు భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 25 ఏళ్ళలో ఎంపి, ఎమ్మెల్యే, స్థానిక సంస్థల ఎన్నికలు ఏదైనా గెలుపు మాదే ఉండేదని, 2021 తర్వాత నేను ఇక్కడకు రాకుండా ఉండేందుకు కేసీఆర్ అనేక చిల్లర ప్రయత్నాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, బిజెపి నేత బండి కళాధర్, శంభునిపల్లి మాజీ సర్పంచ్ అర్వపల్లి సామ్రాజ్యం, సతీష్, ఇజ్జిగిరి సంపత్, అశోక్ రెడ్డి, కనుకుంట్ల అరవింద్, సంపత్, శ్యామ్, ఆయా గ్రామాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని సూర్య పరామర్శ



**ప్రజాపక్షం/ములుగు:** మంత్రి సీతక్క వ్యక్తిగత సహాయకుడు గోవిందరావు పేట మండలం కర్లపల్లి గ్రామానికి చెందిన ఈక వెంకటస్వామి తమ్ముడి భార్య దశదిన కార్యక్రమానికి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంజ సూర్య గురువారం హాజరై నాగమణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల పార్టీ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాం నాయక్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మారం సుమన్ రెడ్డి, నాయకులు ఈక అప్పయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చింత క్రాంతి, జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి మాజీ ఎంపిటిసి గుండెబోయిన నాగలక్ష్మి అనిల్ యాదవ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గొంది కిరణ్, నాయకులు జగ్గారావు, సారయ్య, నేపాల్ రావు, బాలరాజు, శ్రావణ్, సమ్మయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## మారేడు గొండ చెరువులో చేప పిల్లల విడుదల

ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** మండలంలోని లక్ష్మీ దేవిపేట గ్రామము లోని మారేడుగొండ చెరువులో చేప పిల్లల విడుదల చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్, స్పెషల్ ఆఫీసర్ హనుమంతరావు,జిల్లా మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడు సాదు రఘు, జిల్లా మత్స్య శాఖ అధికారి టి.సల్మాన్ రాజు, లక్ష్మీ దేవిపేట సొసైటీ అధ్యక్షుడు సాదు శంకర్‌లతో కలిసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 20252026 సంవత్సరానికి 478 సీజనల్ చెరువులు, 02 రిజర్వాయర్ లు,08 పెరినియల్ చెరువులలో 1,57,55,224 లక్షలచేప పిల్లల విడుదల,పంపిణీ కొరకు అన్నిఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని అన్నారు. చేప పిల్లల పంపిణి ద్వారా చేపల ఉత్పత్తి, దిగుబడులు పెరగడం, మత్స్య కారుల ఆదాయం గణనీయంగా పెరగడం, దళారుల ప్రమేయం తగ్గడం, మత్స్య కారులు స్వేచ్ఛగా అమ్ముకోవడం వలన గ్రామీణ ప్రాంతాలలోని వినియోగదారులకు తాజా చేపలు అందుబాటు ధరలకు దొరకడం, ఇతర ప్రాంతాలకుఎగుమతులు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫిషరీస్ టెక్నికల్ ఆఫీసర్ పి.రమేష్, ఎఫ్ఎఎన్ మౌనిక, ప్రజా ప్రతినిధులు, మత్స్య కారులు, తదితరులు పాల్గొన్నారు.

## పేద మహిళల ఆర్థిక అభ్యున్నతికు స్త్రీ నిధి

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ:** స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ పనితీరు, ఆర్థిక ప్రణాళికలు రుణాల పంపిణీ మీద జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి క్రెడిట్ ప్లాన్ మీద రివ్యూ చేస్తూ బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించి ఎస్‌హెచ్‌జీ సంఘాలు లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. 15 రోజులలోగా లోన్ రికవరీ చేయాలన్నారు. ఎంపీడిఒలు, ఎపిఎంలు సమన్వయంగా పనిచేసి నెలకి ఒకసారి సమావేశాన్ని పెట్టుకుని జిల్లాను రాష్ట్రస్థాయిలో ఎన్‌పిఎ లేని ఆదర్శ జిల్లాగా మార్చాలన్నారు. జిల్లాలో 50 వనితా టీ స్టాల్‌ను ఏర్పాటుచేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఒ వసంత, ఎపిడి నూరుద్దీన్, స్త్రీనిధి డైరక్టర్ భాగ్యలక్ష్మి, ఆర్‌ఎం నిర్మల,ఎంపిడిఒలు, ఎపిఎంలు, సిసిలు, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లకు సిసిఐ పెట్టిన నిబంధనలు ఉపసంహరించుకోవాలి

బికెఎంయు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్రాజం డిమాండ్




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** జిల్లాలో రైతులు పండించిన పత్తి పంట కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ( సిసిఐ ) పెట్టిన పరిమితిని వెంటనే ఎత్తివేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎదునూరి వెంకట్రాజం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హన్మకొండ బాలసముద్రంలోని సంఘం జిల్లా కార్యాలయంలో మునిగాల భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తి పంటను మాత్రమే కొనుగోలు చేస్తామనే సీసీఐ నిర్ణయం వల్ల కష్టపడి పండించిన మిగతా పంటను అడ్డికి పావుశేరు రీతిన మధ్య దళారీలకు అమ్ముకొనాల్సి వస్తోందని అన్నారు. మధ్య దళారీల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉన్నదని అన్నారు. ప్రభుత్వం రైతుల పక్షమో, వ్యాపారుల పక్షమో చెప్పాలని వెంకటరాజం డిమాండ్ చేశారు. వ్యాపారులకు మేలు చేసి రైతులకు అన్యాయం చేసే ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందుకు చొరవ తీసుకోవాలని కోరారు. సంఘం జిల్లా నాయకులు కొట్టేపాక రవి, అల్వాల రాజు, దొమ్మటి ప్రవీణ్ , మాదాసి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## గోవిందనామ స్మరణతో మార్మోగిని బుగులోని జాతర



**ప్రజాపక్షం/రేగొండ :** రేగొండ మండలంలోనీ తిరుమల గిరి గ్రామ శివారులో జరుగుతున్న బుగులోని వెంకటేశ్వరుడి జాతర గురువారం భక్తుల నోటా గోవిందా నామస్మరణతో మారుమోగింది. జాతరలో భక్తులకు సౌకర్యాలు పెరుగడం తో ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. జాతరలో సకల సౌకర్యాలు మీరల్ వాటర్, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగింది. జాతరలో ఇలాంటి అవంచానియా సంఘటనలు జరగకుండా డిఎస్పీ సం పత్‌రావు ఆధ్వర్యంలో పోలీస్ బందో బస్తూ సక్రమంగా నిర్వర్థిస్తున్నారు.

## సిపిఐ నియోజకవర్గ కో కన్వీనర్‌గా శ్రీనివాస్

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** హుస్నాబాద్ పట్టణంలో సిపిఐ నియోజకవర్గ స్థాయి సమావేశం అనభేరి సింగిరెడ్డి అమర వీరుల భవన్‌లో గురువారం జరిగింది. సమావేశంలో జిల్లా కార్యవర్గం, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో పార్టీ నిర్మాణం, బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. సిపిఐ హుస్నాబాద్ నియోజకవర్గ కోకన్వీనర్‌గా ఆదరి శ్రీనివాస్ ఎన్నుకున్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతను నెరవేర్చేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు. ఆయన ఎన్నిక పట్ల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపెల్లి శ్రీనివాస్ రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# డెయిరీ ఏర్పాటుకు మౌలిక వసతులు

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ:** పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు సంబంధించిన అన్ని అనుమతుల ప్రక్రియను అధికారులు త్వరగా పూర్తిచేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి దామెరలో ఏర్పాటు చేస్తున్న పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు మిగిలిన అనుమతుల ప్రక్రియ, నిర్వహణ, తదితర అంశాలపై డిఆర్డిఒ, సహకార, పశుసంవర్ధక శాఖ ల అధికారులతో పాటు మహిళా డెయిరీ నిర్వాహకులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో పరకాల మ హిళా డెయిరీ ఏర్పాటుకు మిగిలిన అనుమతులు, రిజిస్ట్రేషన్, పశు సంపద, ప్రాథమిక సభ్యత్వాల నమోదు, డెయిరీ నిర్వహణ, తదితర అంశాలను ఎమ్మెల్యే, కలెక్టర్‌లు అధికారులు, డెయిరీ నిర్వాహకులతో చర్చించారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మహిళా డెయిరీకి పూర్తిస్థాయి బైలాస్‌ను అధికారులు త్వరగా రూపొందించాలన్నారు. డెయిరీ ఏర్పాటుకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించడంపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. మహిళా డెయిరీకి గ్రామాల నుండి పాల సేకరణ మొదలుకొని బ్రాంచ్ మిల్క్ సెంటర్లకు, అక్కడినుండి డెయిరీకి తరలింపు, నిర్వహణకు సంబంధించిన అంశాలపై ఇప్పటికే సంఘాలలోని స భ్యులకు ములుకనూరు డెయిరీలో శిక్షణ కార్యక్రమాలను ఇప్పించినట్లు తెలిపారు. త్వరలోనే నడికూడ, పరకాల మండలాలలో బ్రాంచ్ మిల్క్ సెంటర్ లను ప్రారంభించి వాటి ద్వారా మహిళా డెయిరీ పాలు, పాల ఉత్పత్తులను విక్రయించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఒక్కో మండలంలో బీఎంసీలను ప్రారంభిస్తూ మహిళా డెయిరీని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికతో సాగుతున్నట్లు పేర్కొన్నారు. మధిర కంటే పరకాల మహిళా డెయిరీ ఏర్పాటు, నిర్వహణకు పటిష్టమైన ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. పరకాల మహిళా డెయిరీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు దూరదృష్టితో, నిర్దిష్టమైన ప్రణాళికలతో ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు మార్కెట్లో ఉన్న ఇతర డెయిరీల ఉత్పత్తులు ఏవిధంగా విజయవంతంగా సాగుతున్నాయనే అంశాలపై అధ్యయనం కూడా చేసినట్లు పేర్కొన్నారు. సబ్సిడీపై ఎస్‌సి ఎస్‌టి బిసి పాడి రైతులకు గేదెలను ఇప్పించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రెండు రోజుల్లో ప్రస్తుతం సభ్యత్వం ఉన్న 21 మంది ఆధార్ కార్డులు అందజేయాలని, ఫీజుబిలిటీ రిపోర్ట్ త్వరగా అందజేస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తవుతుందన్నారు. డెయిరీ నిర్వహణను సొసైటీ లోని మహిళలే నిర్వహణ బాధ్యతలు చేపడితే బాగుంటుందని, డెయిరీ ఆపరేషన్స్ లో ప్రాసెసింగ్, క్వాలిటీ చెకింగ్, తదితర అంశాలను అనుభవం ఉన్న వారితో ప్రారంభించాలన్నారు. మహిళా డెయిరీ ఏర్పాటు నేపథ్యంలో మూడు వేల యానిమల్స్ కావాల్సి ఉండగా, ఎక్కడ లభిస్తాయనే వివరాలతో కూడిన ప్రతిపాదనలు పశుసంవర్ధక శాఖ అధికారులు రెండు రోజుల్లో అందజేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా హనుమకొండ డి ఆర్‌డిఓ మేన శ్రీను, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, ఇతర అధికారులతో పాటు మహిళా డెయిరీ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు ఉధృతం

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** వంద సంవత్సరాల చరిత్రలో దేశంలోని పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిత్యం పోరాడింది పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అని, దేశంలో పాలకవర్గాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాస్వామిక ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. గురువారం వర్ధన్నపేట మండల కేంద్రంలో సిపిఐ వర్ధన్నపేట మండల సమితి సమావేశం కొండేటి రామకృష్ణ అధ్యక్షతన జరగగా సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా హాజరై మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి పోరాడిన చరిత్ర సిపిఐది అని, భారత దేశ గడ్డపై 100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించినటువంటి పార్టీ సిపిఐ అని, స్వాతంత్ర్యం అనంతరం అంతరాలు లేని సమాజం కోసం, భూ సంస్కరణలు అమలు కోసం, పీడిత తాడిత ప్రజలకు అండగా వెట్టి చాకిరి విముక్తికై, బానిసత్వానికి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, దున్నేవానికే భూమి నినాదంతో దొరల గడిలను బద్దలు కొట్టి, పేదవాడికి భూములు పంచిన చరిత్ర సిపిఐ దన్నారు. అధికారం లేకున్నా పేద ప్రజల పక్షాన నిలబడి వారికోసం, వారి హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్నదని కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం వేదికగా జరిగే సిపిఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని అన్నారు. సిపిఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం విభజన రాజకీయాలు చేస్తూ దేశాన్ని విడగొట్టే ప్రయత్నం చేస్తున్నదని, ప్రజా వ్యతిరేక చట్టాలు, కార్మిక వ్యతిరేక చట్టాలు, ముస్లిం మైనార్టీ వ్యతిరేక చట్టాలను తీసుకొస్తూ ముస్లింల పైన, రైతుల పైన, దళితులపైన దాడులు కొనసాగిస్తున్నారని, ఇలాంటి పరిణామాలను ప్రజాస్వామిక వాదులు తిప్పికొట్టాలన్నారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఓర్సు రాజు, రెల్లి ప్ర భాకర్, బొడ్డుపల్లి సాయిలు, మండల సహాయ కార్యదర్శి ఆ రెల్లి యాకయ్య, మీరు ఆనందం, శీన బోయిన యాకయ్య, గోపి, పొన్నాల సారయ్య, బాబు, చిన్న పెల్లి బాబు, నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన భాండాగారం నవచేతన పుస్తక ప్రదర్శన

సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** సిద్ధాంతాలు, సాంస్కృతి, సాంప్రదాయాలు, ప్రపంచ దేశాల విజ్ఞానం, పోటీ పరీక్షల మెటీరియల్, సామాజిక అంశాలు, కవి, సాహితీ వేత్తల కథలు, కవితలు వంటి విజ్ఞాన భాండాగారం నవచేతన పుస్తక ప్రదర్శన అని సిపిఐ మహబూబాబాద్ జిల్లా సెక్రటరి బి.విజయసారథి అన్నారు. గురువారం నవ చేతన విజ్ఞాన సమితి హైద్రాబాద్ ఆధ్వర్యంలో కేంద్రంలోని కోర్టు దగ్గర నవచేతన సంచార పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. గురువారం నుండి ఆదివారం వరకూ నాలుగు రోజుల పాటు మానుకోట ప్రజలకు ఈ పుస్తక ప్రదర్శన అందుబాటులో ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని విజయ సారథి పిలుపునిచ్చారు. నవచేతన పుస్తక ప్రదర్శనను ఆయన సందర్శించి పుస్తకాలను విక్రయించిన అనంతరం ఆయన మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి పుస్తకాలు దోహదపడతాయన్నారు. ఈ పుస్తకాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అన్ని విధాల ఉపయోగపడే పుస్తకాలు, కవులు శ్రీశ్రీ, చలం, అంబేద్కర్ ఆలోచన, మార్క్సిజం, లెనినిజం వంటి అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని ఒక మంచి పుస్తకం చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని ఈ అవకాశాన్ని మహబూబాబాద్ ప్రజలు, విద్యార్థులు, యువకులు సద్వినియోగపర్చుకోవాలని ఆయన కోరారు. మహబూబాద్ జిల్లా కేంద్రంలో నవచేతన ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా సంచార పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారని నవచేతన హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం సంతోషకరమని విజయసారథి తెలిపారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, కల్లూరి ప్రభాకర్, నీలం వెంకటేశ్వర్లు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలను విస్మరించిన ప్రభుత్వాలు

ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్ఎఫ్ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలుగు శ్రావణ్ కుమార్ అన్నారు. మహబేబాబాద్ జిల్లా కేంద్రంలోరి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ముందు పెండింగ్‌లో ఉన్న 8500 కోట్ల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు శ్రావణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటివరకు విధ్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించలేదని, ముఖ్యంగా రాష్ట్రంలో 8500 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఉన్నాయని, పెండింగ్ బకాయలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యా శాఖ మంత్రిని ఏర్పాటు చేసి విద్య రంగానికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా కేంద్రంలో పీజీ కాలేజీకి సొంత భవనం నిర్మించాలని ఇప్పటికైనా ఈ ప్రభుత్వం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి,విద్య రంగాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. జిల్లా సహా య కార్యదర్శి మేక వెంకటేష్, చిలువేరు వికాస్, భానోత్ సాయి, అభి, ముఖేష్, అఖిల, ప్రియాంక, తేజు, విగ్నేష్, వంశీ, వరుణ్, ఉమేష్,పాల్గొన్నారు.

## అక్రమ కేసులు ఎత్తివేయాలి

సాదుల శ్రీనివాస్, పెరుగు కుమార్ డిమాండ్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నూతన కలెక్టరేట్ నిర్మాణానికి సాలార్ తండా గిరిజన రైతుల భూమును అక్రమంగా లాక్కుంటుంటే నిరుపేద గిరిజనులకు అండగా ఉండి మద్దతుగా వెళ్లిన సిపిఐ, సిపిఎం మరియు గిరిజన రైతులపై పెట్టిన అక్రమ కేసులో భాగంగా గురువారం వారు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాదుల శ్రీనివాస్, పెరుగు కుమార్ మాట్లాడుతూ గిరిజనులకు మద్దతుగా వెళితే అక్రమంగా కేసులు పెట్టారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టుకు హాజరైన వారిలో ఆంగోత్ శివాజీ, సురేందర్, మంగ్య, బాలాజీ, వెంకన్న, వీరు ఉన్నారు.

## అట్టహాసంగా జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** ప్రతీ ఒక్క విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున గురుకులాలను స్థాపించినట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.ధర్మసాగర్ మండలం కరుణపురం లోని స్టేషన్ ఘనపూర్ మహాత్మా జ్యోతిబా పూలె బిసి బాలుర గురుకుల పాఠశాలలో డిస్ట్రిక్ట్ లెవల్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలె, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ లాంటి మహనీయులను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని, ఆ మహనీయుల వల్లే నేడు పేద బడుగు బల హీన వర్గాల ప్రజలు సమాజంలో తల ఎత్తుకొని జీవించగలుగుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో అంబేద్కర్ 125జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందు ఎం చేద్దామని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు అడిగినప్పుడు పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు 119నియోజకవర్గాలలో గురుకులాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించానని, నా ప్రతిపాదన తో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో బిసి, ఎస్సి, మైనార్టీ గురుకులాలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్సీవో రాజ్ కుమార్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు, క్రీడాకారులు, ఇతర అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పటిష్ఠ కార్యాచరణతో వరద ముంపు నివారణ చర్యలు

వరంగల్ కలెక్టర్ డా.సత్య శారద



**ప్రజపక్షం / వరంగల్ :** పటిష్ట కార్యచరణ తో వరద ముంపు నివారణ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డా.సత్య శారద అన్నారు . గురువారం వరంగల్ నగరంలోని ప్రాంతంలోని వరద ముంపు కు ప్రభావితమైన చిన్న వడ్డేపల్లి చెరువు పరిసర ప్రాంతాలు, లక్ష్మి గణపతి కాలనీ, ఎల్బీనగర్ లోని అంబేద్కర్ నగర్, ప్రాంతాలలో జిల్లా కలెక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భవిష్యత్తులో ఇలాంటి ముంపు సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఇరిగేషన్, రెవిన్యూ, మునిసిపల్ శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక డ్రెయినేజీ వ్యవస్థలను సమీక్షించి, నీటి ప్రవాహ మార్గాలను సరిచేసే చర్యలు తక్షణం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్ సురేష్ జోషి, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎంహెచ్ఓ డా.రాజేష్ ఇరిగేషన్ ఈఈ కిరణ్, బల్దియా ఈఈ సంతోష్ బాబు, డిఈ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 26న సిపిఐ వందేళ్ల వేడుకలు

సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని స్థానిక రావి నారాయ ణరెడ్డి భవన్ లో సిపిఐ నాయకుల తో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భారత దేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని గుర్తు చేశారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ దేశంలోనే ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ శతజయంతి ముగింపు ఉత్సవాలు డిసెంబర్ 26న ఖమ్మంలో ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ భారీ బహిరంగ సభ జయప్రదం కోసం సిపిఐ జాతా కార్యక్రమాన్ని నిర్వ హిం చుకోవడం జరుగుతుందని,ఈ సిపిఐ జాత నవంబర్ 19న భూ పాలపల్లికి రావడం జరుగు తుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అ వలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైన ఆందోళన పోరాటాలు చే స్తున్నామని తెలిపారు. ముఖ్యంగా భూపాలపల్లి జిల్లా కేందర్రంలో ప్రజా, కార్మిక సమస్యల పైన అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్నామని వివ రించారు. భూపాలపల్లి కి త్వరగా బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని, ని రుద్యోగుల కోసం ఇండస్ట్రియల్ కార్డియర్ ఓపెన్ చేయాలని, జిల్లా అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గురుజపల్లి సుధాకర్ రెడ్డి, సోతుకు ప్రవీణ్ కుమార్, ఎండి అస్లం, మల్లయ్య, శ్రీనివాస్, రవీందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## అక్షర్, సుందర్ ధాటికి కుప్పకూలిన ఆస్ట్రేలియా..

### పొట్టి సిరీస్ ఆధిక్యంలో టీమిండియా..!



ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్ కోల్పోయిన భారత జట్టు పొట్టి సిరీస్‌లో ముందంజ వేసింది. కీలకమైన నాలుగో టీ20లో సమిష్టి ప్రదర్శనతో ఆతిథ్య జట్టును చిత్తుగా ఓడించింది. శుభ్‌మన్ గిల్ (46) సాధికారిక ఇన్నింగ్స్‌కు అక్షర్ పటేల్(21 నాటౌట్ 2–20) ఆల్‌రౌండ్‌షో తోడవ్వగా ఆసీస్‌ను 48 పరుగుల తేడాతో మట్టికరిపించింది. లక్ష్య ఛేదనలో ఆరంభం నుంచి తడబడిన కంగారూ టీమ్.. సుందర్ (3–3) విజృంభణతో 119కే ఆలౌట య్యింది. భారీ విజయాన్ని అందుకున్న టీమిండియా ఐదు టీ20ల సిరీస్‌లో 2–1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. పేస్, బౌన్సీ పిచ్‌లతో ప్రత్యర్థులను బోల్తా కొట్టించే ఆస్ట్రేలియాను స్పిన్ అస్త్రంతో దెబ్బ కొట్టింది భారత జట్టు. సిరీస్‌లో కీలకమైన నాలుగో టీ20లో భారీ స్కోర్‌తో కంగారూలకు పరీక్ష పెట్టిన టీమిండియా.. ఆ తర్వాత బంతితో చెలరేగింది. టాపార్డర్ శుభారంభం ఇచ్చినా.. మిడిల్ ఓవర్లలో స్పిన్నర్లు అక్షర్ పటేల్(2–20), వాషింగ్టన్ సుందర్(3–3)లు తిప్పేయగా ఆతిథ్య జట్టు బ్యాటర్లు వరుసగా డకౌట్ చేరారు. పవర్ హిట్టర్ స్టోయినిస్(17)ను సుందర్ ఎల్బీగా వెనక్కి పంపగా ఆసీస్ ఓటమి ఖాయమైంది. భారత్ నిర్దేశించిన 168 పరుగుల భారీ ఛేదనలో ఆస్ట్రేలియాకు ఆదిలోనే అక్షర్ పటేల్ షాకిచ్చాడు. దంచికొడుతున్న డేంజరస్ ఓపెనర్ మాథ్యూ షార్ట్(25)ను ఎల్బీగా వెనక్కి పంపాడు. దాంతో.. పరుగులు వద్ద ఆతిథ్య జట్టు తొలి వికెట్ కోల్పోయింది. మొదట అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో రివ్యూ తీసకొని టీమిండియా అతడి వికెట్ సాధించింది. ఆతర్వాత వచ్చిన జోష్ ఇంగ్లిస్(10) బుమ్రా ఓవర్లో రెండు బౌండరీలు బాదాడు. దాంతో.. పవర్ ప్లేలో వికెట్ నష్టానికి ఆసీస్ 48 పరుగులు చేసింది. ఆ తర్వాతి ఓవర్లోనే ఇంగ్లిస్ అక్షర్ పటేల్ ఓవర్లో బౌల్డ్ కాగా.. దూకుడుగా ఆడుతున్న కంగారూ కెప్టెన్ మిచెల్ మార్ష్(30)ను దూబె ఔట్ చేసి పెద్ద బ్రేకిచ్చాడు. అతడి ఓవర్లో పెద్ద షాట్ ఆడిన మార్ష్ బౌండరీ వద్ద అర్ష్‌దీప్ సూపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. 70కే మూడు వికెట్లు పడిన వేళ టిమ్ డేవిడ్(14), ఫిలిప్పే(10)లు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, వీరిద్దరూ స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. డేంజర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్(2)ను వరుణ్ బౌల్డ్ చేసి మ్యాచ్‌ను టీమిండియా వైపు తిప్పాడు. సుందర్ ఒకే ఓవర్లో స్టోయినిస్(17)ను ఎల్బీగా.. బార్ట్‌లెట్‌ను రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. బుమ్రా ఒక వికెట్ తీయగా.. సుందర్ ఓవర్లో జంపా గిల్ చేతికి చిక్కగా కంగరూ టీమ్ 119కే ఆలౌటయ్యింది. 48 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్ సిరీస్‌లో 2–1తో ముందంజ వేసింది.

#### గిల్, అక్షర్ పోరాడగా..

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు శుభారంభం లభించినా సద్వినియోగం చేసుకోలేదు. మిడిలార్డర్ చేతులెత్తేగా టీమిండియా నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి167 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(28) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగినా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్(46) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఫామ్ లేమితో తంటాలు పడుతున్న గిల్.. ఎట్టకేలకు క్రీజులో నిలిచి జట్టును ఆదుకున్నాడు. మిడిలార్డర్‌లో శివం దూబె(22), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(20)లు ఫర్వాలేదనిపించారు. ఆఖర్లో అక్షర్ పటేల్(21 నాటౌట్) ధనాధన్ ఆడడంతో టీమిండియా పోరాడగలిగే స్కోర్ చేయగలిగింది.

## టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ వేదిక ఖరారు..

### ఆందోళనలో టీమిండియా ఫ్యాన్స్!

భారత్ వేదికగా వచ్చే ఏడాది ఫిబ్రవరి ,మార్చిలో జరగనున్న పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ వేదిక ఖరారైనట్లు తెలుస్తోంది. దేశంలోనే అతి పెద్ద గ్రౌండ్ అయిన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియాన్ని ఫైనల్ వేదికగా ఖరారు చేసినట్లు సమాచారం. మహిళల వన్డే ప్రపంచకప్ 2025 ముగిసిన నేపథ్యంలో టీ20 ప్రపంచకప్ 2026 షెడ్యూల్‌పై ఐసిసికసరత్తులు చేస్తోంది. ఈ క్రమంలోనే ఆతిథ్య దేశం అయిన భారత్ వేదికల ఎంపికపై కార్యచరణను మొదలుపెట్టింది. ఫైనల్‌తో సహా లీగ్ మ్యాచ్‌లకు సంబంధించిన వేదికల వివరాలతో కూడిన డ్రాఫ్ట్ షెడ్యూల్‌ను ఐసిసికి బిసిసిఐ సమర్పించాల్సి ఉంటుంది. ఈ డ్రాఫ్ట్ షెడ్యూల్‌పై సభ్యదేశాల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని ఐసిసి మార్పులు చేర్పులు చేస్తుంది. ఆ తర్వాతే షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటిస్తారు. తాజా నివేదికల ప్రకారం ఫిబ్రవరి 6 నుంచి మార్చి 8 వరకు టీ20 ప్రపంచకప్ 2026 జరగనున్నట్లు తెలుస్తోంది. టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీకి అహ్మదాబాద్, కోల్‌కతా, చెన్నై, ముంబై నగరాలను షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఒక్కో వేదికగా 6 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇరు దేశాల క్రికెట్ బోర్డుల పరస్పర అంగీకారం కారణంగా పాకిస్థాన్ మ్యాచ్‌లు శ్రీలంక వేదికగా జరగనున్నాయి. శ్రీలంకలోని కొలంబో, పల్లెకెలె, గాలే వేదికగా టీ20 ప్రపంచకప్ 2026 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఒక వేళ పాకిస్థాన్ ఫైనల్ చేరితే తుది పోరుకు కొలంబో ఆతిథ్యం ఇవ్వనుంది. అహ్మదాబాద్‌లో ఫైనల్ అంటే భారత అభిమానులు జంకుతున్నారు. గతంలో ఇదే వేదికగా జరిగిన పురుషుల వన్డే ప్రపంచకప్ 2023లో భారత్ ఓడింది. ఈ టోర్నీలో ఓటమెరుగని జట్టుగా ఫైనల్ చేరిన భారత్.. ఫైనల్లో ఆసీస్ చేతిలో మాత్రం ఓటమిపాలైంది. ఈ క్రమంలోనే ఫైనల్‌ను అచ్చొచ్చిన ముంబై వేదికగా నిర్వహించాలని ఫ్యాన్స్ కోరుతున్నారు.



#### తెలుగు రాష్ట్రాలకు అన్యాయం..

టీ20 ప్రపంచకప్ వేదికలకు సంబంధించిన షార్ట్ లిస్ట్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన మైదానాలు లేవు. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంతో పాటు వైజాగ్‌లోని ఏసీవీడీసీఏ క్రికెట్ స్టేడియాలను ఎంపిక చేయలేదు. దాంతో తెలుగు అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు మైదానాలకు మ్యాచ్‌లు కేటాయించాలని కోరుతున్నారు.

# ఫోకస్

## వైకల్యం ఎవరికి?



నిక్ ఉయిసిచ్ జీవితాన్ని పరిశీలిస్తే, వైకల్యం ఎవరికి అనే ప్రశ్న ఉదయించక మానదు. అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నప్పటికీ నిత్యం ఏదో కోల్పోయినట్టు ప్రవర్తించేవారు... ఏమీ సాధించలేమంటూ చేతులెత్తేసేవారు... నిత్యం నైరాస్యంలో కొట్టుమిట్టాడేవారు ఉయిసిచ్‌ను చూసి మనసు మార్చుకుతీరాలి. లేకపోతే, అవయవాలు ఉన్నప్పటికీ, వైకల్యం ఉన్నవారిగానే వారిని పరిగణించాల్సి ఉంటుంది. ఎందుకంటే, టెట్రాఅమెలియా సిండ్రోమ్ అనే అత్యంత అరుదైన శారీరక లోపంతో జన్మించిన అతనికి, పుట్టుకతోనే కాళ్లూచేతులు లేవు. అతను బతకం కష్టమని, ఒక వేళ ఊపిరి ఉన్నా, మంచానికే పరిమితమవుతాడని వైద్యులు తేల్చిచెప్పారు. అందుకు తగ్గట్టే ఉయిసిచ్‌కు అనుక్షణం అవమానాలే ఎదురయ్యేవి. అందరూ హేళన చేసేవారే. చివరికి పలు మార్లు ఆత్మహత్య చేసుకోవాలన్నంతా ఒత్తిడికి గురయ్యాడు. కానీ, ఒకరి గురించి తాను బతకడం లేదని, తన గురించి తాను బతకాలని అనుకున్నాడు. చీకటిని చీల్చుకుని వెలుగు వైపు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఆ నిర్ణయమే అతని జీవితాన్ని అద్భుతంగా మార్చింది. నిరంతరం శ్రమించాడు. అసాధ్యంగా కనిపించే ఈత, పెయింటింగ్, స్కైడైవింగ్, డ్రమ్స్ వాయించడం వంటి అనేక కళల్లో ప్రావీణ్యం సంపాదించాడు. అతను నటించిన 'ది బటర్ ఫ్లై సర్కస్' అనే షార్ట్‌ఫిల్మ్ ఎన్నో అంతర్జాతీయ అవార్డులు గెల్చుకుంది. ఉయిసిచ్ ఇప్పుడు మానవ ఆత్మబలానికి ప్రతీకగా నిలుస్తున్నాడు. 70 దేశాలకు పైగా పర్యటించి, 80 లక్షల మందికిపైకి ప్రజలను ఉద్దేశించి ప్రసంగాలు చేశాడు. ప్రపంచ మేటి నాయకులను కలిశాడు. ఐక్య రాజ్య సమితి వేదికపై ప్రసంగించాడు. దివ్యాంగులకు పాఠశాలల్లో ఎదురవుతున్న అవమానాలకు వ్యతిరేకంగా గళం విప్పాడు. లక్షలాది మంది పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తున్నాడు. ఉయిసిచ్ రాసిన 'లైఫ్ విత్ఔట్ లిమిట్స్', 'అన్‌స్టాపబుల్', 'లవ్ విత్ఔట్ లిమిట్స్' పుస్తకాలు బెస్ట్‌సెల్లర్లుగా నిలిచాయి. అంతేకాదు అతను నెలకొల్పిన 'లైఫ్ విత్ఔట్ లింబ్స్' అనే సంస్థ నేడు లక్షలాదిమందికి ప్రేరణనిస్తున్నది. వివాహం చేసుకున్న అతను ఇప్పుడు నలుగురు పిల్లల తండ్రి. ప్రేమ, ఉద్దేశం, లక్ష్యం, సంతృప్తి వంటివి శరీర సామర్థ్యంతో నిర్ణయించడానికి వీల్లేదని ఉయిసిచ్ జీవితం మనకు స్పష్టం చేస్తున్నది. అతనికి చేతులు... కాళ్లే కాదు.. పట్టుదలకు పరిమితులు కూడా లేవు. జీవితం కఠినంగా అనిపించే ప్రతి సారి ఉయిసిచ్ గురించి ఆలోచించండి. నిజమైన వైకల్యం ఎవరిదో స్పష్టమవుతుంది.











## మెదడు కణాలకు వృద్ధాప్యం లేదు!

వయసు పెరిగేకొద్దీ మెదడు పనిచేసే విధానంలో మార్పు వస్తుందని, అందులోని కణాలు ఎక్కువగా చనిపోవడం ప్రారంభించడంతో, జ్ఞాపకశక్తి కోల్పోవడం, ఏవైనా కొత్త విషయాలను త్వరగా నేర్చుకోలేకపోవడం వంటి సమస్యలు కలెత్తుతాయన్న అభిప్రాయం చాలా మందిలో ఉంది. అలాంటి సీనియర్ సిటిజెన్స్ అందరికీ ఇది శుభవార్తే. స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్తలు నిర్వహించిన కొత్త పరిశోధనలను అనుసరించి మన మెదడు ఏ వయసులోనైనా ఎదిగి. పునరుత్పాదనమవుతుందని తేల్చారు. గతంలో అధిక వయసులో కొత్త మెదడు కణాలు (న్యూరాన్లు) ఏర్పడవు అనుకుంటున్నా, తాజాగా జరిగిన అధ్యయనాల్లో తేలిందేమిటంటే, జ్ఞాపకాలు, నూతన విషయాల అధ్యయనానికి కీలకమైన హిప్పోకాంపస్ ప్రాంతంలో పెద్దవయసు వారిలో కూడా కొత్త న్యూరాన్‌లు జన్మిస్తున్నాయి. పెద్దవయసు వారిలోనూ హిప్పోకాంపస్‌లో కొత్త న్యూరాన్లు ఎప్పటికప్పుడు ఉత్పత్తి కావడాన్ని న్యూరోజెనెసిస్‌గా పేర్కొంటారు. దీనివల్ల మెదడు ఎక్కువ కాలం అతి వయసులోనూ నేర్చుకునే సామర్థ్యం, జ్ఞాపకాల నిల్వ, తాజా సమాచారం ప్రాసెసింగ్ చేయగల శక్తిని కొంతమేర నిలుపుకుంటుంది. డీమెన్షియా వంటి స్టేజీల్లోనూ కొత్త మెదడు కణాలు కన్పించడంతో, మెదడులో ప్రతిఫలిక శక్తి, అనుకూల మార్పులు జరిపే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. క్రమం తప్పకుండా వ్యాయామం, నడక, పరెగత్తడం వంటి శారీరక పరిశ్రమ ఉంటే, ఈ కణాల పునరుత్పత్తి వేగాన్ని సంతరించుకుంటుందని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.ఒమేగా3 ఫ్యాటి యాసిడ్లు ఉన్న తాజా ఆహారం, పుష్కలమైన నిద్ర, మానసిక మేకింగ్ (పజిల్స్, భాష చదవడం లేదా కొత్త నైపుణ్యాలు) వంటికి ఉపయోగపడతాయి. దీని ద్వారా మెదడులో కొత్త న్యూయూరాన్‌లు ఏర్పడటం వేగవంతమవుతుంది, మానసిక గుణాలు మెరుగు పడతాయి. జ్ఞాపకశక్తి గణనీయంగా పెరుగుతుంది. మొత్తం మీద 'ది సైన్స్' పత్రిక వ్యాసాన్ని అనుసరించి, న్యూరోజెనెసిస్ ప్రక్రియ ఉండటం వల్ల వయస్సు పెరిగిన తర్వాత కూడా మెదడు పనితీరు గతంలో మాదిరిగానే ఉత్సాహంగానే ఉండడం సాధ్యం. ఈ ప్రక్రియను ఆధారంగా చేసుకుని మేలైన మెడికల్ చికిత్సలు అభివృద్ధి అయ్యే అవకాశాలు ఉన్నాయి. స్థూలంగా చెప్పాలంటే, మెదడు వృద్ధాప్యంలోనూ పూర్తిగా స్తంభించిపోదు. సరైన ఆహారం, వ్యాయామం, మానసిక వ్యాయామం వంటివి పాటిస్తే మెదడు సంపూర్ణ ఆరోగ్యంగా, నూతనాన్ని సృష్టించుకునే శక్తిని కలిగి ఉంటుంది. ఇది జ్ఞాపకశక్తిని, దృష్టి సామర్థ్యాన్ని, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఉత్తేజక మార్గం.



## వేతనాలివ్వకపోతే 17న మహాధర్నా

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** ఎన్‌హెచ్‌ఎంలో పనిచేయుచున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలల పెండింగ్ వేతనాలు, ఏడు నెలల పిఆర్‌సి ఏరియర్స్ తక్షణమే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డిఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్ సఫియోద్దీన్‌కు ఎఐటియుసి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. భోగే ఉపేందర్ మాట్లాడుతూ గత రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు కుటుంబాన్ని పోషించుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వ ఉద్యోగుల లాగానే వీరికి కూడా ప్రతినెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో అనేక సందర్భాలలో జిల్లా స్థాయి అధికారులకు వినతులు ఇచ్చినా నేటి వరకు జీతాలు అందలేదని తెలిపారు. సమస్యలు పరిష్కరించని కారణంగా ఈ నెల 17న ఉదయం 11 గంటలకు ఎన్‌హెచ్‌ఎం కమిషనర్ కార్యాలయం హైదరాబాద్ ముందట మహాధర్నా నిర్వహించాలని యూనియన్ నిర్ణయించినట్లు తెలియజేశారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఉపాధ్యక్షులు చిరంజీవి, కోశాధికారి నగేష్, సహాయ కార్యదర్శి రాందాస్, ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది శ్రీదేవి, ప్రకాష్, శ్రీకాంత్, విజయసాగర్, భవాని, సమత తదితరులు పాల్గొన్నారు.

## శత వార్షికోత్సవ శంఖారావం



### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్.విలాస్

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో టీ.గోపి అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్.విలాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా కార్యదర్శి భూక్య రమేష్ పాల్గొన్నారు. ఎస్.విలాస్ మాట్లాడుతూ,భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి డిసెంబర్ 26 నాటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని, శత వార్షికోత్సవాలు విజయవంతం కావడానికి రాష్ట్రంలో నాలుగు ప్రాంతాల నుండి బస్సు జాతాలు బయలుదేరుతాయని తెలిపారు. మొదటి బస్సు జాతా నిర్మల్ జిల్లా బాసర నుండి నవంబర్ 15న బయలుదేరుతుందని, ఎఐకెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, ఈ.టి. నరసింహ సారధ్యం వహిస్తారని వివరించారు. జిల్లా కౌన్సిల్ సమావేశంలో నూతన జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన భూక్యారమేష్ తమ కార్యకలాపాలు రిపోర్ట్‌ను అందించారు. ఎస్.ఎన్.రెడ్డి మాట్లాడుతూ బాసర నుండి ప్రారంభం కానున్న జాతను విజయవంతం చేయాలని,అదే విధంగా విరివిగా విరాళాలను ఇవ్వాలని కోరారు. పి.ముత్యం(జిల్లా కార్యవర్గ సభ్యులు), ఎస్.కైలాస్ (ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి), పుండలిక్, గంచక్కర్ శివాజీ, వెంకటేష్(జిల్లా కార్యవర్గ సభ్యులు), వెంకట్రాములు, పెంబి, దస్తురాబాద్ లింగన్న తదితరులు పాల్గొన్నారు.

## ఫీ బకాయి ఇవ్వకపోతే ప్రభుత్వాన్ని పాతరేస్తాం

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

### మంత్రి పొన్నం ఇంటి ముట్టడికి యత్నం... నాయకుల అరెస్ట్









**ప్రజాపక్షం/కరీంనగరసిటీః**రాష్ట్రంలోఅధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత విద్యను రోడ్డున పడేసి విద్యార్థులను చదువులకు దూరం చేసింది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి దుయ్యబట్టారు. ప్రజాపాలనలో నాలుగు రోజుల నుంచి 2వేలకు పైగా ఉన్నత విద్య కళాశాలలు బంద్ చేయగా లక్షలాది మంది విద్యార్థులు ఇంటి వద్ద ఉన్నా ప్రభుత్వం మౌనంగా ఉండడం సిగ్గుచేటని విమర్శించారు. గురువారం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్‌బకాయివిడుదల చేయాలని, నాలుగు రోజులుగా కళాశాలల బంద్ ఉన్నా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఎఐఎస్ఎఫ్ ఆద్వర్యంలో కరీంనగర్‌లోని మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులకు, నాయకులకు మద్య తోపులాట జరిగింది. నాయకులను అరెస్టు చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.మణికంఠరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో నాలుగు రోజుల నుంచి రెండు వేల పైగా ఉన్నత విద్యాకళాశాలలు బంద్ ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 23 నెలలు గడుస్తున్నా ఫీజు బకాయిలు ఎందుకు విడుదల చేయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో కళాశాలలు బంద్ చేస్తే దసరా, దీపావళి లోపు రూ.1200 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చిమాట తప్పారని, కేవలం రూ.300 కోట్లు విడుదల చేశారన్నారు. పదివేల కట్ల ఫీజు బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన వద్ద విద్యాశాఖ ఉన్నప్పటికీ ఫీజు బకాయిలు విడుదల చేయించడంలో వైఫల్యం చెందారని దుయ్యబట్టారు. ఫీజు బకాయిలును విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామనిహెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేష్, రేణికుంట్ల ప్రీతం, మంద అనిల్, రామారపు వెంకటేష్, కుర్ర రాకేష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ మామిడిపల్లి హేమంత్, కనకం సాగర్, కేశబోయిన రాము యాదవ్, లద్దునూరి విష్ణు, సాయి ఆజాద్, నాయకులు నవదీప్, ఆదిత్య, సోనూ, పవన్, విష్ణు ఉన్నారు.

## ఇంటింటికీ సిపిఐ శతాబ్ది సంబర పిలుపు

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు





**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవ ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న జరిగే ప్రదర్శన, బహిరంగ సభ కార్యక్రమాల సమాచారాన్ని ఇంటింటికి అందించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. శతాబ్ది ఉత్సవ ముగింపు సభ ప్రచారాన్ని ఒక ఉద్యమంలా నిర్వహించాలని యావన్మంది పార్టీ సభ్యులు, సానుభూతి పరులను ప్రచార కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగింది. హేమంతరావు మాట్లాడుతూ వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ చరిత్రను, పోరాటాలను ప్రజల పక్షాన సాధించిన విజయాలను నేటి తరానికి తెలియజేసేందుకు గ్రామ గ్రామాన శతాబ్ది ఉత్సవ ముగింపు సందర్భంగా జరిగే ప్రచార కార్యక్రమాల ద్వారా వివరించాలన్నారు.భారతదేశంలోనేబలమైన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణం కలిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శతాబ్ది ఉత్సవ ముగింపు సభ డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో జరగనుందన్నారు. వామపక్ష ఉద్యమ కేంద్రంగా పోరాటాల పురిటిగడ్డగా భాసిల్లిన ఖమ్మం స్వాతంత్ర్యానికి ముందు ఆ తర్వాత సువర్ణక్షర లిఖిత తెలంగాణ పోరాటంలోనూ కీలక భూమిక పోషించిందన్నారు. ఉద్యమ చరితకు అనుగుణంగా డిసెంబర్ మొదటి వారం నుంచి సభలు, సమావేశాలు, సెమినార్లు ఏర్పాటు చేయనున్నట్లు హేమంతరావు తెలిపారు. రచయితలచే కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు హేమంతరావు తెలిపారు. ఖమ్మం జిల్లా నుంచి వందలాది మంది యువతీ, యువకులకు త్వరలో జనసేవాదళ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయ న తెలిపారు. ఖమ్మం నగరంసహా జిల్లాలోని అన్ని మండలాల్లో బృందాలుగా ఏర్పడి ఇంటింటికి శతాబ్ది ఉత్సవ సందేశాన్ని అందజేయాలని కోరా రు. సిపిఐరాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా,జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాల నివేదికను దండి సురేష్ ప్రవేశపెట్టారు.

## చర్చించకుండా సర్క్యులర్లు ఇస్తే సహించం





### ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ః** సింగరేణి యాజమాన్యంగుర్తింపు సంఘంతో చర్చించకుండా, స్ట్రక్చర్ సమావేశాలలో మాట్లాడకుండా సర్క్యులర్లు ఇస్తే ఎట్టి పరిస్థితులలో సహించేది లేదని ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య హెచ్చరించారు. గురువారం శ్రీరాంపూర్‌నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఇచ్చే సర్క్యులర్లు, లీకేజీల ద్వారా కార్మికులు భయాందోళనలకు గురవుతున్నారని ఆరోపించారు. సింగరేణి వ్యాప్తంగా ఎఐటియుసి ఆధ్వర్యంలో అన్ని గనుల శాఖలలో ధర్నాలు చేసి మెమోరాండం ఇచ్చామని,అలాగే8న అన్నిజిఎం కార్యాలయాల ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు.ఉపప్రధానకార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, ఏరి యాసెక్రెటరీనర్సయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ సెక్రెటరీలు నర్సింగరావు, సదానందం తదితరులు ఉన్నారు.

## ఎక్స్‌గ్రేషియా తక్షణమే చెల్లించాలి

### గీతపనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలకూరి బాబు



**ప్రజాపక్షం/గరిడేపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికుల కుటుంబాలకు ఇవ్వవల్సిన ఎక్స్‌గ్రేషియా రూ.13కోట్లను తక్షణమే విడుదల చేయాలని గీత పనివార్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకూరి బాబు, జిల్లా కార్యదర్శి కొండ కోటయ్యలు డిమాండ్ చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో గరిడేపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూఇటీవల రాష్ట్రంలో ప్రమాదవశాత్తు చెట్లపై నుంచి పడి మరణించిన, వికలాంగులైన గీత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా రావల్సిన ఎక్స్‌గ్రేషియా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనగాం సాంబయ్య, సోమగాని రామన్న, మోహన్ రంగా, వినోద్‌వినోద్, పగిడాల సైదులు పాల్గొన్నారు.

## ఎక్స్‌గ్రేషియా బకాయి చెల్లించాలి

### సంఘం రాష్ట్ర కార్యదర్శి బోలగాని సత్యనారాయణ



**ప్రజాపక్షం/మోటకొండూరు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గీత పనివారలకు చెల్లించాల్సిన రూ.13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయి చెల్లించాలని గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. గురువారం గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గాదెగాని మాణిక్యం, మండలఅధ్యక్షులుపల్లెవెంకన్నఆధ్వర్యంలో మండల తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. వినతి పత్రం తహసిల్దార్ నాగదివ్యకు అందించారు.గీతపనివారలసంఘంమండలనాయకులుగడ్డం అంజయ్య, గాజుల ఎల్లయ్య, సీసా ఇస్తారి,వంగాల మల్లేష్,తాళ్లపల్లి వెంకటయ్య, సూదగాని వెంకన్న, గాధగాని నరసింహులు, ఎరకల చంద్రయ్య, పల్లె శీను ఉన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ఎమ్మెల్యేను కలిసిన సిపిఐ బృందం



ప్రజాపక్షం/నిజామాబాద్ :రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడుమాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు జిల్లా కార్యదర్శి సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో నాయకులు ఓమయ్య, రఘురాం, రాధాకుమార్ ఉన్నారు.

## అర్చకులపై జర్నలిస్టుల ఫిర్యాదు



ప్రజాపక్షం/భీమ్‌గల్ :లింబాద్రిగుట్టకు చెందిన అర్చకులు విధి నిర్వహణ జర్నలిస్టును పరుసపదజాంతో,వృత్తిని నిందిస్తూ దూషిస్తున్నారని ఈ ఘటనకు కారణమైన అర్చకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల ప్రెస్‌క్లబ్ సభ్యులు గురువారం పిఎస్‌లో ఫిర్యాదు చేయగా ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. స్వామి వారిపై భక్తి తాము చేస్తున్నది కూడా దేవుని సేవయేనని, అకారణంగా అర్చకులు వ్యక్తిగతంగా, వృత్తిపరంగా దూషణ చేయటం శోచనీయమన్నారు. భక్తుల సాక్షిగా స్వామి క్యూ వద్ద పరుసపదజాలంతో అవమానపరిచారని వారు పేర్కొంటూ ఎస్సై సందీప్‌కు ఫిర్యాదు చేశారు. గుట్టపై గల క్యూ వద్దనే కాకుండా అన్నదానం వద్ద కూడా కొందరు సేవ చేసే వారు కూడా ఇష్టారీతిన మాట్లాడుతూ అవమానపరుస్తున్నారని, రథోత్సవ సమయంలో కూడా అర్చకులు భక్తులపై చేయి చేసుకున్నారన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులున్న అర్చకులు లెక్క లేదని వారన్నారు. జర్నలిస్టుల పట్ల అర్చకులు ఇలా వ్యవహారిస్తే భక్తుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. ఈ ఘటనకు విషయమై పోలీసులు విచారణ జరిపించి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రెస్‌క్లబ్ సభ్యులు ఎస్సైని కోరారు.

## టేకు దుంగలు పట్టివేత



ప్రజాపక్షం/దండేపల్లి :దండేపల్లి మండలం పాత మామిడిపల్లి నుండి బైక్‌లపై అక్రమంగా తరలిస్తున్న దుంగలను పట్టుకున్నట్లు తాళ్ళపేట రేంజర్ సుష్మారావ్ తెలిపారు. సుష్మారావు తెలిపిన వివరాల ప్రకారం పాత మామిడిపల్లికి చెందిన షంషుద్దీన్ మోటార్ సైకిల్‌పై కలపను అక్రమంగా రవాణా చేస్తుండగా ఫారెస్ట్ అధికారులు వెంబడించి అర్జుగూడ వద్ద పట్టుకున్నారని, షంషుద్దీన్‌తో పాటు నాగేంద్ర వర్మ, సతీష్, సాయి అనే వ్యక్తులు మోటార్‌సైకిళ్లపై కలపను తరలిస్తూ పారిపోయారన్నారు. అధికారులు షంషుద్దీన్ వద్ద నుండి బైక్, 4/0.129 ఘన మీటర్లు, విలువ సుమారు రూ. 11 వేల 133 విలువ గల కలపను స్వాధీనం చేసుకున్నారని, అనంతరం పాత మామిడిపల్లి గ్రామంలో పరారీలో ఉన్న నాగేంద్ర వర్మ, సతీష్, సాయి ఇంట్లో తనిఖీలు నిర్వహించి సాయి ఇంటి సమీపంలో 8/0.139 ఘన మీటర్లు, విలువ సుమారు రూ. 11 వేల 673 విలువ గల కలపను స్వాధీనం చేసుకున్నారన్నారు. మొత్తం పట్టుకున్న కలపను, మోటార్ సైకిల్‌ను రేంజ్ కు తరలించారు. ఈ దాడులలో డిప్యూటీ రేంజర్ పోషమల్లు, సెక్షన్ అధికారులు నరేష్, శంకర్, నహీద, ఫారెస్ట్ బీట్ అధికారులు సాయి, రహీముద్దీన్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు వందేమాతరం సామూహిక గీతాలాపన

ప్రజాపక్షం/నిజామాబాద్ :మహాకవి బంకిమ్ చంద్ర చటర్జీ వందేమాతరం జాతీయ గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 7న రాష్ట్రవ్యాప్తంగా ఆ గీతాన్ని సామూహికంగా గానం చేయటం జరుగుతుందని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉదయం 10 గంటలకు వందేమాతరం సామూహిక గీతాలాపన ఉంటుందన్నారు. కలెక్టరేట్ సహా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని మరింతగా పెంపొందించేందుకు దేశ చరిత్రలో వందేమాతరం గీతానికి గల ప్రాధాన్యతను చాటి చెప్పేందుకు వీలుగా చేపడుతున్న వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని విధిగా అఇన్న ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో కూడా ఆలపించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## రోడ్డుకు అడ్డంగా... దుకాణాలు పెట్టి విక్రయించొద్దు



ప్రజాపక్షం/గజ్వేల్:చిరు వ్యాపారులు రోడ్డుకు దుకాణాలు అడ్డంగా పెట్టి విక్రయించొద్దని గజ్వేల్ సిఐ రవీందర్, ట్రాఫిక్ సిఐ మురళి, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, మార్కెట్ సెక్రటరీ జాన్ వెస్లీ స్పష్టం చేశారు. గురువారం చిరు వ్యాపారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించిన సందర్భంగా వారు మాట్లాడారు. గజ్వేల్ పట్టణంలోని బస్టాండ్ ఏరియా, తూప్రాన్ రోడ్డు, అంబేద్కర్ చౌరస్తా, ఇందిరా పార్కు చౌరస్తా, ఇందిరా పార్కు నుండి కోట మైసమ్మ వెళ్లే గజ్వేల్ రోడ్డు తదితర ప్రాంతాలలో వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు, అలాగే వ్యాపారస్తులు ఫుట్ పాత్ ఆక్రమించి రోడ్డుపై సామాను, కూరగాయలు, పండ్లు పెట్టి వచ్చిపోయే తాత్కాలికంగా షాపులు కేటాయిస్తున్నందున నాలుగు చక్రాల వాహనదారులు, ఫ్రూట్స్ మరియు ఇతర షాపులు పెట్టుకునేవారు రెండు రోజులలో మార్కెట్లోకి షాపులు మార్చుకోవాలని సూచించారు. ఇబ్బందులు, సమస్యలు, ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని రోడ్డు నిబంధనలు పాటించి సహకరించాలని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని వివరించారు.

## పశువుల అక్రమ రవాణాపై నిర్లక్ష్యం

ప్రజాపక్షం/సిర్పూర్(టి):మండల పరిధిలో పశువుల అక్రమ రవాణా పెరిగిపోతున్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం నుండి మంగళవారం సాయంత్రం వరకు కౌటాల నుండి సిర్పూర్ మీదుగా కాగజ్‌నగర్ దిశగా బొలెరో, ఐచర్ వాహనాలలో పెద్ద ఎత్తున పశువులను తరలిస్తున్న దృశ్యాలు కనిపించాయని స్థానికులు తెలిపారు. పశువుల రవాణా కోసం పశువు వైద్యాధికారుల నుండి మెడికల్ రిపోర్ట్, రవాణా అనుమతి పత్రాలు తీసుకోవడం తప్పనిసరి అయినప్పటికీ ఈ నియమాలు పూర్తిగా ఉల్లంఘించబడుతున్నాయని వారు పేర్కొన్నారు. అధికారులు పశువులు అక్రమ రవాణాపై ఎలాంటి తనిఖీలు చేపట్టకపోవడంపై మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# క్రీడల ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం..

### అట్టహాసంగా 11వ జోనల్ స్థాయి క్రీడా పోటీల ప్రారంభం..
### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





ప్రజాపక్షం/నిర్మల్ :క్రీడల ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ అన్నారు.గురువారం సోన్ మండలంలోని లెఫ్ట్ పోచంపాడు గ్రామంలోని,తెలంగాణ బాలికల సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలో 11వ రాష్ట్ర జోనల్ లెవెల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025–26 క్రీడా పోటీల కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జోన్ పరిధిలో నాలుగు జిల్లాలకు చెందిన 1190 మంది విద్యార్థులు వివిధ క్రీడాంశాల్లో పాల్గొనబోతున్నారని తెలిపారు.క్రీడా స్ఫూర్తిని నిలబెడుతూ,ఆటల పోటీల్లో పాల్గొనాలని సూచించారు.జీవితంలో గెలుపోటములు సహజమని,ఓడినవారు నిరాశ చెందకుండా గెలుపు కోసం మళ్లీ ప్రయత్నిస్తూ,గెలుపొందిన వారు మరింత మంచి ఫలితాలు సాధించేలా పట్టుదలతో కృషి చేయాలన్నారు.ఈ క్రీడల్లో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని వివరించారు.బాలికలు,బాలురితో సమానంగా విద్యార్థి దశ నుంచేన క్రీడలను జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని అన్నారు.క్రీడల వల్ల శారీరక మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు.ప్రస్తుత సమాజంలో బాలికలు అన్ని రంగాలలో పై చేయి సాధిస్తున్నారని తెలిపారు.ఇటీవల మహిళా క్రికెట్ ప్రపంచ కప్ విజేతగా భారత దేశ మహిళా జట్టు నిలవడం ఉదహరిస్తూ,బాలికలు క్రీడలను కెరీర్ గా ఎంచుకోవాలని సూచించారు.క్రీడల అభివృద్ధికి పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందని,ఈ అవకాశాలను చక్కగా వినియోగించుకుంటూ క్రీడల్లో పాలుపంచుకోవాలని తెలిపారు.క్రీడల్లో భాగస్వామ్యం అవ్వడం ద్వారా పొందిన ధ్రువీకరణ పత్రాల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సులువు అవుతుందని చెప్పారు.విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో చదువును ఆపవద్దని,ఉన్నత చదువులు చదివిన వారికి ఎన్నో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు.ఈ విషయాలు విద్యార్థులకు తెలియజేసేలా పాఠశాలలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.పోటీలలో పాల్గొనబోయే విద్యార్థులకు,కార్యక్రమ నిర్వాహకులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ,క్రీడల్లో పాల్గొనబోయే విద్యార్థులకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు.విద్యార్థులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఆటలు ఆడాలని తెలిపారు.క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందిన వివరించారు.గతంలో పోలిస్తే క్రీడల్లో బాలికల భాగస్వామ్యం పెరిగిందని తెలిపారు.సీఎం కప్ పోటీలలో బాలికలు అధిక సంఖ్యలో పాల్గొని,గతంలో ఎన్నడూ లేని విధంగా పతకాలు సాధించాలని గుర్తుచేశారు.అంతకుముందు క్రీడ పోటీల్లో పాల్గొనబోయే వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు,ఎన్‌సిసి పరిచయ కవాతును నిర్వహించారు.జాతీయ జెండా,కార్యక్రమ జెండాలను కలెక్టర్,అదనపు కలెక్టర్,అధికారులు ఆవిష్కరించారు.నిర్వాహకులు కలెక్టర్ అధికారులకు జ్ఞాపికలను అందజేశారు.ఆ తర్వాత తొలి రోజు నిర్వహిస్తున్న క్రీడలలో పాల్గొంటున్న విద్యార్థులను పరిచయం,చేసుకొని వాలీబాల్ ఆడటం ద్వారా క్రీడా కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డీఈవో భోజన్న,డిఐఈఓ పరశురాం,డివైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి,తహసిల్దార్ మల్లేష్,ఇతర అధికారులు,విద్యార్థులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## నగర సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి : కలెక్టర్



ప్రజాపక్షం/నిజామాబాద్ :నగర సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. మున్సిపల్ కార్పోరేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో నగరపాలక సంస్థ పనితీరుపై కలెక్టర్ గురువారం సమీక్ష జరిపారు .ఇదివరకటి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించారు. ఖాళీ స్థలాల పరిరక్షణ, వనమహోత్సవం, నాటిన మొక్కలను సమర్థవంతంగా కాపాడటం, పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతి తదితర అంశాలపై సాధించిన పురోగతిని సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అప్పుడే వారు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయగలరన్నారు. ఈ గురుతర బాధ్యతను గుర్తెరిగి వార్డు అధికారులు అంకిత పని చేయాలన్నారు. ఖాళీ స్థలాలను గుర్తించి వాటి పరిరక్షణ కోసం కంచె ఏర్పాటు చేయాలని, పచ్చదనాన్ని పెంపొందించేలా విరివిగా మొక్కలు నాటించాలన్నారు. ఖాళీ స్థలాల్లో ప్రజోపయోగ నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. పట్టణ ప్రకృతివనాలు, మీడియన్, అవెన్యూ ప్లాంటేషన్ల నిర్వహణ సమర్థవంతంగా జరగాలని, ప్రతి మొక్క సంరక్షించబడేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు.అన్ని డివిజన్లలో క్రమం తప్పకుండా సానిటేషన్ పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. 400 చదరపు అడుగుల కంటే తక్కువ స్థలమున్నవారు కూడా జి+1 పద్ధతిలో ఇందిరమ్మ పథకం కింద ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. అర్హులైన కొత్త లబ్ధిదారులను గుర్తించి ఇళ్లను మం జూ రు చేయాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, హౌసింగ్‌డిఇనివర్తి, మున్సిపల్ డిప్యూటీ కమీషనర్ రవిబాబు, అధికారులు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ఆరోగ్య సేవల బలోపేతం కోసం సమష్టిగా కృషి
### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




ప్రజాపక్షం/సంగారెడ్డి :జిల్లాలో ఆరోగ్య సదుపాయాల నాణ్యత పెంపునకు అధికారులు ,వైద్య సి బ్బంది మరింత శ్రద్ధ తీసుకొని పనిచేయాలని జి ల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. గురువారం స ంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహి ంచిన 17వ కామన్ రివ్యూ మిషన్ బృందం డీ బ్రిపింగ్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. సమీక్షలో జిల్లాలోని ప్రాంతీయ ఆసుపత్రి మాతా ,శిశు, సంరక్షణ కేంద్రాలను సందర్శించి మానవ వనరులు ల్యాబ్ సదుపాయాలు ,ఫార్మసీ ,డైట్, ఆసుపత్రిలో వస్తున్న ఇన్ ,అవుట్ పేషంట్‌ల పరిమాణం పారిశుధ్యం సేవలపై సమగ్ర సమీక్ష జరిపింది. భారత ప్రభుత్వం ఆరోగ్యం , కుటుంబ స ంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 3 నుండి 5 వరకు ఈ సంగారెడ్డి జిల్లాలో బృందం పర్యటించింది. సంగారెడ్డి జిల్లా ప్రభుత్వాసుపత్రి పటాన్‌చెరు ఏరియా హస్పిటల్ నారాయణఖేడ్, ఏరియా హాస్పటల్ ,సదాశివపేట సిహెచ్‌సి ఆత్మకూరు, కంగ్టి ,ఆర్‌సిపురం ప్రాథమిక కేంద్రాలు ,మార్చ్ నగర్ యు.పిహెచ్‌సి ఇందిరానగర్ బస్తీ దవాఖాన ఆయుష్ డిస్పెన్సరీలను సందర్శించి వివరాలు సేకరించారు. సిఆర్‌ఎం బృందానికి టీమ్ లీడర్‌గా ప్రాంతీయ డైరెక్టర్ ఆరోగ్యం ,కుటుంబ సంక్షేమ శాఖడాక్టర్ అనురాధ మేడోజు వ్యవహరించారు. సభ్యులుగా డాక్టర్ సంతోష్, నాయక్ , పిపిపి కన్సల్టెంట్ ఎన్‌యుహెచ్‌ఎం, ఎంఒహెచ్‌యఫ్‌డబ్ల్యు అరుణ్ శర్మ, ఫైనాన్స్ కన్సల్టెంట్ పిఎమ్ ఎబిహెచ్ ఐఎం, ఆర్‌డి నరేడా కన్సల్టెంట్ ఐడిఎస్‌పి ఎన్‌సిడిసి డాక్టర్ ఫర్వీన్ సుల్తానా సీనియర్ మెడికల్ ఆఫీసర్ హైదరాబాద్‌లు వ్యవహరించారు.

## సమస్యలు పరిష్కరించకపోతే జనవరిలో సమ్మెకు దిగుతాం
### ఎఐటియుసి నాయకులు సత్యనారాయణ, సుదర్శన్



ప్రజాపక్షం/మందమర్రి:కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, సమస్యలను పరిష్కరించకపోతే జనవరి నెలలో సమ్మె నోటీస్ ఇచ్చి, అవసరమైతే సమ్మె చేసి డిమాండ్లు సాధిస్తామని ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ స్పష్టం చేశారు. కెకె 5, కెకె ఓసి, కెకె వర్క్ షాప్, సివిల్, స్టోర్ తదితర విభాగాల వద్ద గురువారం కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి అధికారులకు మెమొరాండాలు సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు శైలేంద్ర సత్యనారాయణ, భీమానాధుని సుదర్శన్ మాట్లాడుతూ మెడికల్ బోర్డు ఏర్పాటు విషయంలో తీవ్రమైన ఆలస్యం జరుగుతోందని, వెంటనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి పాత విధానంలో ఇన్వాల్యుడేషన్ చేయాలని, డిపెండెంట్‌లకు వెంటనే నియామక పత్రాలు ఇవ్వాలని కోరారు. అలవెన్స్‌లపై విధిస్తున్న పన్నులను కోల్ ఇండియా మాదిరిగా యాజమాన్యం భరించాలని, మారుపేరులతో పనిచేస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని, డిస్మిస్ అయిన ఉద్యోగులకు మరో అవకాశం ఇవ్వాలని, సింగరేణి యాజమాన్యం ఇచ్చిన 150 మస్టర్ల నిబంధన సర్కులర్‌ను వెంటనే ఉపసంహరించాలని, 16 మస్టర్ల కౌన్సిలింగ్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. మ్యాన్ పవర్ కొరత సాకుతో కార్మికులపై పని భారం పెంచరాదని, సింగరేణి కార్మికుల సమస్యలపై జరుగుతున్న చర్చల్లో యాజమాన్యం మూదాసి వైఖరి అవలంబిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ రాజేశం, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, ఏరియా నాయకులు బానయ్య, తిరుపతి, దినేష్, రాజేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కుమారస్వామి, ప్రభాకర్, ఫిట్ కార్యదర్శులు సంపత్, ప్రభాకర్ శర్మ, కుమార్, శ్రీనివాస్, సంజీవ్ కుమార్, ఓదెలు, కమిటీ సభ్యులు సంతు, రాజేశం, వెంకటస్వామి, వేణు, చంద్రశేఖర్, హేమ చందు, రాజేందర్, భగవాన్ రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## శ్యామల లక్ష్మి హత్యకేసులో నిందితుల అరెస్ట్



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :గత నెల అక్టోబర్ 24న నవీపేట మండలం ఫతేనగర్ గ్రామ శివారులో పెట్రోల్ పోసి తగలబెట్టిన శ్యామల లక్ష్మి అలియాస్ బుజ్జి మరణానికి పాల్పడిన ఇద్దరు మహిళలు సంగీత, పద్మ, ఒక పురుషుడు బాబులను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. సంఘటన జరిగిన నాటినుండి నిజామాబాద్ నార్త్ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ బి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నవీపేట్, మాక్లూర్ పోలీసులు టీములుగా ఏర్పడి నేర పరిశోధన అనంతరం నిందితులను పట్టుకున్నట్టు, ఇట్టి నేర పరిశోధన గావించిన పోలీసు అధికారులను నిజామాబాద్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్ రాజా వెంకటరెడ్డి అభినందించారు. వివరాల్లోకి వెళ్తే... గత నెల అక్టోబర్ 24న నవీపేట్ మండలం ఫతేనగర్ గ్రామ శివారులో పెట్రోల్ పోసి తగలబెట్టిన శవం శ్యామల లక్ష్మి అలియాస్ బుజ్జిని నవీపేట మండలానికి చెందిన గొల్ల సంగీత (33), ధారావత్ పద్మ (39), మద్దేపల్లి గ్రామం, మంగలి బాబు (44) కోస్లి గ్రామానికి చెందిన వీరు నిందితులు కాగా, హత్యకు గురైన శ్యామల లక్ష్మి , నిందితులు ముగ్గురు కలిసి పనిచేసేవారని ఒకరి నొకరు కలిసి ఉండే వీరి మధ్య డబ్బుల విషయమై గొడవలు రాగా నిందితులు ముగ్గురు శ్యామల లక్ష్మి పథకం ప్రకారం చంపాలని నిర్ణయించుకుని ఫతేనగర్ గ్రామ సరిహద్దులలో నిర్మాణుష్యంగా ఉండే ప్రదేశంలో కల్లు తాగడానికి తీసుకెళ్లి నలుగురు కలిసి తాగిన అనంతరం మద్యం మత్తులో ఉన్న శ్యామల లక్ష్మి ని ఇద్దరు మహిళల సాయంతో మంగలిబాబులు కలిసి శ్యామల లక్ష్మి గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం తమతో తెచ్చిపెట్టుకున్న పెట్రోల్ పోసి తగలబెట్టారు అని ఏసిపి ఎల్ రాజా వెంకట రెడ్డి తెలిపారు. ఇట్టి నేర పరిశోధనలో పాల్గొన్న ఎస్ఐలు తి రుపతి, యాదగిరి గౌడ్, రాజశేఖర్, ఏఎస్ఐ రాజేశ్వర్‌లు న వీపేట్, మాక్లూర్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు. వీరిని నిజామాబాద్ ఏసిపి రాజా వెంకటరెడ్డి అభినందించారు.

## నైపుణ్యత, క్రమశిక్షణ, విలువలతో విద్య
### సెంట్‌మేరీస్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి



ప్రజాపక్షం/గజ్వేల్:గ్రామీణ వాతావరణంలో చక్కటి విద్యాబోధన అందిస్తూ సమాజానికి అత్యుత్తమ డాక్టర్లు, ఇంజనీర్లు, పరిశోధక విద్యార్థులను అందించిన ఘనత సెంట్ మేరీస్ యాజమాన్యానికి దక్కుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ప్రజ్ఞాపూర్ లోని సెయింట్ మేరీస్ పాఠశాలలో సిల్వర్ జూబ్లీ వేడుకలు, బాల శాస్త్రవేత్తలు రూపొందించిన ఎగ్జిబిషన్ ను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. సెయింట్ మేరీస్ పాఠశాలలో విలువలతో కూడిన విద్య, క్రమశిక్షణ, సృజనాత్మకతకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దగా, ప్రస్తుతం వందలాదిమంది విద్యార్థులు ఉన్నత స్థితిలో ఉన్నట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థుల అభ్యున్నతికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం అమలు చేసిన విద్యాహక్కు చట్టం వంటి విద్యాభివృద్ధి పథకాలు అమలు చేయగా, నామమాత్రపు రుసుముతో విద్యనందించిన ఘనత దక్కించుకున్నట్లు తెలిపారు.భిన్నత్వంలో ఏకత్వం, విద్యార్థుల పరివర్తన, నూతన సాంకేతికత దిశగా దృష్టి పెట్టి ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ఉన్నత విద్యా సంస్థగా పేరు తెచ్చుకోగా, ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న హరిత హారం వంటి పథకాలకు చేయూతనిచ్చినట్లు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి, మండల విద్యాధికారి కృష్ణ, ట్రెస్మా జిల్లా అధ్యక్షుడు సోమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పట్ల డిఇఒ అసత్య ప్రచారం మానుకోవాలి
### ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఓమయ్య




ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :మధ్యాహ్న భోజన కార్మికులను వంటకు దూరం చేయడం కోసం కొంతమంది ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, రూ. 13. 17 పైసలకి ప్రతిరోజు గుడ్డు, రెండు కూరలు, పప్పు, ఉడికించిన కోడిగుడ్లను ఆయిల్ ఫ్రై చేసి, నెలకి నాలుగు తడవలు మటన్, చికెన్‌ను విద్యార్థుల మెనూలో ఇవ్వడం వీలవుతుందా? అని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఓమయ్య డిఇఒ అశోక్‌ను ప్రశ్నించారు. గురువారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మధ్యాహ్న భోజనం పట్ల తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ. 6.78 పైసలు, హైస్కూల్ విద్యార్థులకు గుడ్డుతో కలిపి రూ. 13.17 పైసలు పెంచుతూ నిర్ణయం చేయడం జరిగిందని, ఇది అక్టోబర్ నెలనుండి అమల్లోకి వస్తుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం 13 రూపాయల్లో రెండు కూరలు, పప్పు, కోడిగుడ్లు పెట్టడం సాధ్యం కాదని రూ. 22 ఇస్తే ప్రభుత్వం మెనూ అమలు చేయడం సాధ్యమవుతుందన్నారు. ఈ విషయాన్ని అనేక సందర్భాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి, కమిషనర్‌కి, జిల్లా అధికార యంత్రాంగానికి వినతి పత్రాలు సమర్పించడం జరిగిందన్నారు. కానీ ఆ వినతి పత్రాల పట్ల నిర్లక్ష్యం వహిస్తు మెనూ చార్జీలు పెంచకుండా పేద బలహీన వర్గాల మధ్యాహ్న భోజన కార్మికులు ఇంట్లో పస్తులున్న పాఠశాలలో విద్యార్థులకు భోజనం పెట్టడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రూ. 900కు కిలో మటన్, రూ. 300కు కిలో చికెన్ ఉన్న పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చే రూ. 13 ఏరకంగా కార్మికులు వంట చేసి పెడతారని ప్రశ్నిస్తున్నామన్నారు. ఇప్పటికే అనేక పాఠశాలల్లో హెడ్మాస్టర్ల ద్వారా కొంతమంది వారికి సంబంధించిన వ్యక్తుల ద్వారా ఒత్తిడి తెచ్చి కార్మికులను తొలగిస్తున్నారని, ఈ విధానాన్ని మానుకోకపోతే ఎఐటియుసిగా డిఇఒ కార్యాలయం ముట్టడికి సిద్ధపడతామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. చక్రపాణి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి హనుమాండ్లు, మధ్యాహ్న భోజన నాయకురాలు చంద్రకళ పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## వాహనాలు రోడ్లపై పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు: ట్రాఫిక్ ఏసిపి

ప్రజాపక్షం/పెద్దపల్లి: రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసిపి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పెద్దపల్లి పట్టణంలో టూ వీలర్ ఫోర్ వీలర్ హెవీ వాహనాలు వాహనాదారులు ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడం వలన ఇతర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, అధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని ట్రాఫిక్ ఏసిపి సిహెచ్ శ్రీనివాస్ అన్నారు. గురువారం రోజున స్థానిక పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని కమాన్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిఐ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కమాన్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోడ్లపై వాహనాలు నిలపడం ద్వారా చాలామంది చూడకుండా ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని, అందుకుగాను అనువైన స్థలాన్ని చూసి ఎవరికి ఇబ్బంది కాకుండా పార్కింగ్ చేయాలని లేకపోతే ఎలాంటి వాహనదారుడైన ఉపేక్షించేది లేదని చర్యలు తప్పవని తెలియజేశారు. ఏసిపి వెంట ట్రాఫిక్ సిఐ అనిల్ కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి హాజరై విద్యార్థులను అభినందించి మాట్లాడారు. దేశంలో ఆవిర్భవించిన ఈ క్రీడకు ప్రపంచవ్యాప్తంగా చాలా మంది అభిమానులు ఉన్నారని చెప్పారు. ఈ క్రీడకు యువత చాలా ఆకర్షితులవుతున్నారని, క్రీడల ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని అల్ఫోర్స్ విద్యాసంస్థలో వార్షిక ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు వివిధ రంగాలలో అన్ని వనరులను కల్పించి పోటీలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఇటీవల కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్ జడ్పిహెచ్‌ఎస్ పాఠశాల మైదానంలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ జోనల్ స్థాయి హాకీ పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక కావడం విశేషమని హర్షం వ్యక్తం చేశారు. అండర్ 14 బాలుర విభాగంలో ఎ.కృతిక్ పటేల్, కె.జయంత్, అండర్ 14 బాలికల విభాగంలో కె.యుక్త, ఎ.నైనికా రెడ్డి, ఆకుల ఆశ్రిత, అండర్ 17 బాలుర విభాగంలో ఎం.రితిక్ రెడ్డి, జి.అక్షిత్, అండర్ 17 బాలికల విభాగంలో కె.సాన్విక, జె.వర్షికలు ఎంపికైన వారిలో ఉన్నారని తెలుపుతూ వారికి పుష్పగుచ్చాలను అందజేసి రాష్ట్రస్థాయిలో అసమాన ప్రతిభను కనబరిచి జాతీయస్థాయికి అర్హత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ హక్కుల సాధన, రక్షణ కోసం 'మాల మహానాడు' చలో ఢిల్లీ



ప్రజాపక్షం/ సిద్దిపేట : రాజ్యాంగ హక్కుల సాధన. రక్షణ కోసం జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో నవంబర్ 26న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాలమహానడు జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్ తెలిపారు. గురువారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మాలమహాడు బృందంతో చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా బైరి రమేశ్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ కోసం ఏందాకైన పోరాటం చేయాలని, రాజ్యాంగ హక్కులను సాధించటమే లక్ష్యంగా మాలమహనాడు ఢిల్లీలో భారీ స్థాయిలో ఆందోళన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. దేశంలో ఉన్న అన్ని వర్గాల దళితులను, వెనుకబడిన వర్గాల సమాన హక్కులు పొందేవరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాజ్యాంగ హక్కుల సాధనకు సంబంధించి మాలమహానాడు కొన్ని ప్రధాన డిమాండ్లు ప్రకటించిందన్నారు. పార్లమెంటుకు భారత రత్న బిఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని, జాతీయ స్థాయిలో మాల, మహార్ అనుబంధ కులాల సర్వతోముఖాభివృద్ధికి కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణలో శాస్త్రీయమైన లెక్కలు లేకుండ జారీ చేసిన జీవో నెంబర్ 99, 29లను రాజ్యాంగ విరుద్ధంగా పరిగణించి తక్షణమే పనఃసమీక్షించాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర పోలిటికల్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, నాయకులు ఎలుక దేవయ్య, రాజయ్య, కిశోర్,శ్రీనివాస్, సుమన్. పరమేశ్,శ్రీరామ్, రాజేశ్, బ్రైల్ల నరేష్, కనకయ్య, సుధాకర్ తదిరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపి నూరేళ్ల జీవితాన్ని కోల్పోవద్దు: సిపి



ప్రజాపక్షం/సిద్దిపేట: మద్యం సేవించి వాహనాలు నడిపితే నిండు నూరేళ్ల జీవితాన్ని రోడ్డు ప్రమాదాల రూపంలో కోల్పోవద్దని సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్ సూచించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయన్‌కుమార్ సిసి కెమెరాలను ప్రారంభించారు. ఆనంతరం రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాలలో వాలీబాల్ ఆడుతున్న క్రీడకారులకు క్రీడ దుస్తులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపటం వల్ల రోడ్డుపై నడిచేవారికి కూడ ప్రమాదాలు జరుగుతున్నాయని, వారు నిండు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈలాంటివి రాజీవ్‌రహదారితో పాటు ఇతర రహదారులపై ఈ మధ్యకాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే 10 వేల జరిమాన అనేది ఇప్పుడు వచ్చింది కాదన్నారు. 2019 చట్టంలోనే ఉందన్నారు. ఈ జివోను న్యాయస్థానంలో ఇప్పుడు అమలు చేస్తున్నారన్నారు. ప్రజలు,వాహనదాలు పోలీసులుకు సహకరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పోలీసు శాఖ పక్షాన విజ్ఞప్తి చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే 10 వేల జరిమాన విధిస్తే పోలీసులకు ఏం రాదన్నారు. అందుకు ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలన్నారు. ఆనంతరం పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఆలయకమిటి చైర్మన్ ఏల్పుల మహేశ్, కొండి యాదగిరి, దుర్గారెడ్డి, మల్లు ప్రభాకర్. చేపూరి శేఖర్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మణ్, బిట్ల భాస్కర్, పర్శరాములు, బండి సంపత్, కుమార్. రవి తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌కు గురైన వ్యక్తి మృతి



ప్రజాపక్షం/కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో జూన్ 15న గణేష్ విగ్రహాల వద్ద కరెంట్ షాక్‌కు గురైన వ్యక్తి ఎల్లుట్ల కృష్ణ(28) జగిత్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడం జరిగింది. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. గతంలో మృతుడి తమ్ముడు ఎల్లుట్ల సాయికుమార్ మార్గ మధ్యలోనే చనిపోవడం జరిగింది. ఒకే కుటుంబంలో ఇద్దరు కుమారులు చనిపోవడంతో ఏసుగొని గట్టులో విషాధ ఛాయలతో నిండిపోయారు. మృతుడి తల్లిదండ్రులు తనకున్న ఇద్దరు కుమారులు చనిపోవడంతో దిక్కులేని కన్నీరు మున్నీరై శోక సంద్రంలో మునిగారు. మృతుడికి సొంత ఇల్లులేకపోవడంతో, పిల్లలు ఇద్దరు దీనవస్థలో ఉఆన్నారు. ఇప్పుడు ఇల్లు గడవడం చాలా కష్టంగా మారింది. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరడం జరిగింది.

# ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె

'షీటీం' ఆధ్వర్యంలో పర్యవేక్షణ
కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్: స్నేహిత కార్యక్రమం ద్వారా జిల్లాలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులకు రక్షణ, భద్రత, బాలబాలికల చట్టాలపై విస్తృతమైన అవగాహన కల్పించాలని, తద్వారా వారిలో ధైర్యం, భరోసా నింపాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్నేహిత రెండో దఫా అవగాహన కార్యక్రమాలపై కళాభారతిలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో జరిగిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ హాజరై మాట్లాడారు. బాలబాలికలకు వారి రక్షణ, భద్రతపై అన్ని పాఠశాలల్లో ఇదివరకే ఒక దఫా అవగాహన కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. ఈ కారణంగా విద్యార్థుల్లో అవగాహన వచ్చి తద్వారా ధైర్యంగా ఫిర్యాదులు చేసే స్థాయికి వచ్చారన్నారు. కార్యక్రమానికి మరింత విస్తృతం చేసేందుకు వ్యవసాయ, వైద్య ఆరోగ్య, ఐసిడిఎస్, డిఆర్‌డిఏ మెప్మా, పంచాయితీ అధికారులు, సిబ్బందితో ప్రతి మండలానికి ఒక టీం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బృందాలు ప్రతి మంగళవారం రెండు పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మమేకమై వారి భద్రత, రక్షణకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలుసుకుంటారన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టం, లైంగిక వేధింపులు ఎలా ఎదుర్కోవాలో, ఎలా ఫిర్యాదు చేయాలో ఈ సభ్యులు తెలియజేస్తారన్నారు. ప్రతి పాఠశాలలో స్నేహిత ఫిర్యాదు పెట్టెను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులు తమకు పాఠశాల సిబ్బంది నుంచి, బయట వ్యక్తుల నుంచి ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా ఫిర్యాదు పెట్టెలో తమ ఫిర్యాదును వేయాలని చెప్పారు. ఈ ఫిర్యాదు పెట్టెను షీటీం బృందాలు పర్యవేక్షిస్తాయన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు నమ్మకం, భరోసా కల్పించడం సామాజిక బాధ్యత అన్నారు. బాలికల రక్షణ పట్ల తల్లిదండ్రుల కన్నా ఎక్కువ బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మానవీయ కోణంలో వ్యవహరించాలని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, మెప్మా పిడి స్వరూపారాణి, సీటీం ఇన్స్‌పెక్టర్ శ్రీలత, అడిషనల్ డిఆర్‌డివో రవికుమార్, జగదీశ్వర్, అధికారులు, మెప్మా డిఆర్‌డిఏ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చాడ పరామర్శ

ప్రజాపక్షం/కోహెడ: మండల కేంద్రానికి చెందిన వేల్పుల సంపత్ మాజీ ఎమ్మార్పీస్ మండలాధ్యక్షుడు ఇటీవల మరణించగా గురువారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కా.చాడ వెంకట్ రెడ్డి భాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ అప్పుల భాధతో మరణించిన సంపత్ కుటుంబానికి సిపిఐ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు.ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు వేసే అధిక వడ్డీలతో పేద ప్రజలు డబ్బులు కట్టలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేట్ ఫైనాన్స్‌లపై ప్రత్యేక దృష్టి సారించి అడ్డుకట్ట వేయాలని అన్నారు.వీరి వెంట సిపిఐ మండల కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్,కూరెళ్ళ మాజ సర్పంచ్ ఎల్లయ్య,లక్ష్మ ణ్,వెంకటేశం,రవిందర్,కనుకయ్య,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## కార్మికుల సమస్యలపై అధికారులకు వినతి: ఎఐటియుసి





ప్రజాపక్షం/రామగిరి: సెంటినరీ కాలనీ గురువారం ఆర్జీ 3ఏరియా సింగరేణి వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న మెడికల్ బోర్డు, సొంత ఇంటి పథకం, అలవెన్స్లపై పెర్క్స్, మారు పేర్లు, డిస్మిస్ అయిన కార్మికులకు గురించి, జూనియర్ అసిస్టెంట్, వీకే జీకే లో పర్మనెంట్ ఎంప్లాయిస్, 150 మాస్టర్ల నిబంధన సర్కులర్ ఎత్తివేత వంటి సింగరేణి కార్మికుల పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని అడ్రియల లాంగ్ వాల్ ప్రాజెక్టు మైన్ , ఓసిపి1 ప్రాజెక్టు , ఓసిపి2 ప్రాజెక్ట్ ,మైన్ ల అధికారులకు ఏఐటి యూసీ నాయకులు వినతి పత్రాలను అందజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్జీ 3 ఏరియా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ .రావు ,సెంట్రల్ సెక్రటరీ జూపాక. రామ్ చందర్ , వైస్ ప్రెసిడెంట్ బండారి క్రాంతి , బ్రాంచ్ సెక్రటరీ ఎమ్మార్సీ రెడ్డి , అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ డీ టి రావు అన్ని గనుల పిట్ కార్యదర్శులు, సంఖ్యలో పాల్గొన్నారు.

## విఘ్నేశ్వర వైన్స్‌ను తొలగించాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి
బావండ్లపల్లి యుగంధర్ వినతి

ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న విఘ్నేశ్వర వైన్స్‌ను తొలగించాలని కోరుతూ జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరిండెంట్‌కు ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగంధర్ గురువారం వినతి పత్రం సమర్పించారు. యుగంధర్ మాట్లాడుతూ తిమ్మాపూర్ మండల పరిధిలోని విఘ్నేశ్వర వైన్స్ జాతీయ రహదారి ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా సాగుతోందన్నారు. మద్యం ప్రియులు ఫుల్లుగా తాగి పలుమార్లు రోడ్ క్రాస్ చేస్తున్నప్పుడు ప్రమాదాలు జరిగి మృత్యువాత పడ్డారని వాపోయారు. ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తూ వంద ఫీట్ల రోడ్డుకు ఆనుకుని వైన్ షాప్ నడిపిస్తున్నా పట్టించుకున్న నాధుడే లేకపోవడం సిగ్గుచేటన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తూ ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారిని ఆనుకుని నిర్వహిస్తున్నందువల్ల రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఆగి మద్యం సేవించడం జరుగుతుందన్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయని, మద్యం అధికంగా సేవించి రోడ్డుపై వచ్చి నానా బీభత్సం సృష్టిస్తున్నారని తెలిపారు. రోడ్డుపై వెళ్లే మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే విఘ్నేశ్వర వైన్స్‌ను రోడ్డుపై నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంటన బాబు, సురేష్, రాజు తదితరులున్నారు.

## పవర్ లిఫ్టింగ్‌లో స్వాప్నికకు గోల్డ్ మెడల్

ప్రజాపక్షం/ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి రంగు విరించి స్వాప్నిక హిమాచల్ ప్రదేశ్ లో జరిగిన పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరుస్తూ గోల్డ్ మెడల్ సాధించింది.హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం కాంగ్రా జిల్లా రైత్ పట్టణంలో ఈనెల 2 నుండి 4 రోజులపాటు జరిగిన ఫెడరేషన్ కప్ క్లాసిక్ & ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుండి 84 ప్లస్ కేటగిరీలో పాల్గొన్న విరించి స్వాప్నిక పవర్ లిఫ్టింగ్ విభాగంలోని స్క్వాడ్,బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ కేటగిరీలలో మొత్తం 540 కిలోలు లిఫ్ట్ చేసి గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది.స్వాప్నిక గతంలోనూ రాష్ట్ర, జాతీయ,అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని ఎన్నో పతకాలు గెల్చుకోగా తాజాగా మరోమారు జాతీయస్థాయి పోటీలలో అద్భుత ప్రతిభ కనబరుస్తూ బంగారు పతకం గెల్చుకోవడం పట్ల పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు.

## వెంటనే కార్మికుల పెండింగ్ సమస్యలకు పరిష్కారం

లేకుంటే సమ్మెకు పిలుపు నిస్తాం
ఎఐటియుసి నాయకులు వినతి



ప్రజాపక్షం/పెద్దపల్లి: సింగరేణిలో కార్మికుల పెండింగ్ సమస్యల ను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో గనులు, డిపార్ట్మెంట్స్, ఓసిపి 5లలో ధర్నాలు నిర్వహించి అధికారులకు డిమాండ్ లతో కూడిన వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, సంకె అశోక్, సహాయ కార్యదర్శి రంగు శ్రీనులు పేర్కొన్నారు. గురువారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలో జరిగిన ఆందోళనల కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో పెండింగ్ లో ఉన్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కమిటీల పేరు మీద కాలయాపన చేయవద్దని వారు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘంగా ఏఐటియుసి గెలిచిన తరువాత కార్మికుల సంక్షేమం కోసం వారి హక్కుల కోసం కృషి చేస్తున్నప్పటికీని కొన్ని కార్మిక సంఘాలు గనులపై ఏఐటియుసిపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని వారు తిప్పికొట్టారు. మార్చి నెలలో నిర్వహించిన స్ట్రక్చరల్ మీటింగ్‌లో సంవత్సరంలో 150 మస్టర్లు తప్పనిసరి చేస్తూ నిబంధన తీసుకొస్తున్న క్రమంలో యాజమాన్యానికి ఏఐటియుసి యూనియన్ మద్దతుగా ఉండి కార్మికులను మోసం చేస్తున్నదని అసత్య ప్రచారం చేస్తున్న సంఘాలను కార్మికులు నమ్మవద్దని వారు పేర్కొన్నారు. గతంలో కార్మికులకు సొంత ఇంటి పథకంపై సిఐటియు చేసిన సంతకాల సేకరణ వారి అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి తప్ప దానివల్ల కార్మికులకు ఒరిగిందేమీ లేదని వారు పేర్కొన్నారు. సింగరేణికి రావలసిన కోట్లాది రూపాయల బకాయిలపై ఎందుకు ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం లేదని వారు విమర్శించారు. సింగరేణిలో కార్మికులెవరు గుర్తింపు సంఘం ఏఐటియుసిపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని వారు విజ్ఞప్తి చేశారు. ఎప్పటికైనా కార్మికుల పక్షాన పోరాడే ఏకైక సంఘం ఏఐటియుసి అని, కార్మికులకు అన్యాయం జరిగితే ఏఐటియుసి చూస్తూ ఊరుకోదని, కార్మిక హక్కుల పరిరక్షణకు ఎంతటి పోరాటానికైన సిద్ధంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు ఎస్ వెంకట్ రెడ్డి,బోగ సతీష్ బాబు, దొంత సాయన్న, ఎం చక్రపాణి, కె శ్రీనివాసరావు, సయ్యద్ సోహేల్, సిద్దమల్ల రాజు, సిర్ర మల్లికార్జున్, గండి ప్రసాద్, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్‌సి సంక్షేమ వసతి గృహాల విధుల నిర్వహణ

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి: ఎస్‌సి సంక్షేమ వసతి గృహాల విధులు నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఎస్సీ సంక్షేమ శాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలు తొలగించాలని, సెప్టిక్ ట్యాంక్ లను ఎప్పటికప్పుడు క్లీన్ చేయాలని, పారిశుధ్య నిర్వహణ కోసం స్థానిక పంచాయతీ లేదా మున్సిపల్ అధికారుల సహకారం తీసుకోవాలని అన్నారు.ఎస్సీ వసతి గృహాలలో అవసరమైన మరమ్మత్తు పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.వసతి గృహాలలో ఖాళీలు ఉన్నాయని, విద్యార్థులను భర్తీ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. వసతి గృహాల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు అందరూ పబ్లిక్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా సంక్షేమ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులు ఎవరైతే చదువులో వెనుకబడి ఉన్నారో వారిపై సంక్షేమ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ప్రత్యేకంగా ట్యూటర్లను ఏర్పాటు చేసి బోధన అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెన్యూ వసతి గృహాలు తప్పనిసరిగా పాటించాలని, నాణ్యమైన ఆహారాన్ని తప్పక అందించాలని ఆదేశించారు.ప్రీ పోస్ట్ మెట్రిక్స్ స్కాలర్షిప్ దరఖాస్తుల సంఖ్య పెంచాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహ సంక్షేమ అధికారులు తమకు కేటాయించిన మండలాల్లోని పాఠశాలలను సందర్శించి సంబంధిత హెడ్ మాస్టర్ మండల అధికారుల సంప్రదిస్తూ విద్యార్థులంతా తప్పనిసరిగా ప్రీ పోస్టు మెట్రిక్స్ స్కాలర్షిప్ దరఖాస్తు చేసుకునే విధంగా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి ఎం.రవీందర్, సహాయ సంక్షేమ అధికారి శ్రావణ్ కుమార్, వసతి గృహ సంక్షేమ అధికారులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## నేడే 'శాతవాహన' స్నాతకోత్సవం


హాజరు కానున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ




ప్రజాపక్షం/కరీంనగర్: శాతావాహన యూనివర్సిటీ రెండవ స్నాతకోత్సవం శుక్రవారం యూనివర్సిటీ గ్రౌండ్ లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణదేవ్ వర్మ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ బిజే రావులు హాజరు కానున్నారు.అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యూనివర్సిటీ అధికారులు పూర్తి చేశారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని అధికారులు తెలిపారు. 2018లో మొదటి కాన్వోకేషన్ నిర్వహించగా ఇది రెండవ కాన్వోకేషన్. 2018 నుంచి 2025 వరకు పీజీ సబ్జెక్టుల్లో గోల్డ్ మెడల్స్ సాదించిన 161 విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, పీహెచ్ డీ పూర్తి చేసిన 25 మందికి డాక్టరేట్ పట్టాలను అందజేయనున్నారు. 2018లో నిర్వహించిన కాన్వోకేషన్ సందర్భంలో ప్రస్తుత వైస్ చాన్స్‌లర్ ఉమేష్‌కుమార్ రిజిస్ట్రార్‌గా ఉన్నారు. ఆచార్య ఉమేష్ కుమార్ వీసీగా బాధ్యతలు చేపట్టాక హుస్నాబాద్ లో ఇంజనీరింగ్ కాలేజీ, క్యాంపస్ లా కాలేజీ, ఎం ఫార్మసీ కోర్సులు మంజూరయ్యాయి. క్యాంపస్ లో అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ తో పాటు సెమినార్ హాల్, ఆడిటోరియం పనులు పూర్తయ్యాయి. గత ఆగస్టులో వీసీ అమెరికా పర్యటనకు వెళ్లి అక్కడ ఉన్న తెలంగాణ మేధావులను కలిసి విశ్వవిద్యాలయాన్ని బలోపేతం చేసేందుకు నిధులను సమకూర్చారు. వాటితో యూనివర్సిటీలో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల ప్రకారం అన్ని కోర్సులలో అధ్యాపకుల నియమాకాలు చేపట్టారు. అన్ని కళాశాలలకు కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఆర్ట్స్ కళాశాలలోని సెమినార్ హాల్‌ను పరిపాలనా భవనంలోని రెండవ అంతస్తులోని సెమినార్ హాల్‌ను నవీకరించారు.

# వేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు

ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. తంగళ్ళపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో హౌసింగ్ శాఖ నిర్మించిన మోడల్ హౌస్, మండేపల్లి, చింతలపల్లి, రాళ్లపేటలో మొత్తం 11 ఇందిరమ్మ ఇండ్లు పూర్తి కాగా గృహ ప్రవేశాలు గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, కే కే మహేందర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. సొంత ఇంటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నదని, దీనిలో భాగంగా లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ. 5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నదని తెలిపారు. ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మిగతా లబ్ధిదారులు అందరూ ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని, త్వరితగతిన తమ సొంత ఇంటి కలను పూర్తి చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అధికారులు అందుబాటులో ఉండి నిర్మాణాలు పూర్తి చేసుకునేలా సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింగ్, హౌసింగ్ పీడీ శంకర్, మండల ప్రత్యేక అధికారి, డీపీఓ శర్ఫుద్దీన్, తహసిల్దార్ జయంత్, ఎంపీడీఓ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

ప్రజాపక్షం/ముత్తారం : ముత్తారం మండలం ఇప్పలపల్లి (రామకృష్ణాపూర్) గ్రామంలో యూత్ కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీని గురువారం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆదేశాల మేరకు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కతట్ల వినీత్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. సిద్ధుల అనిల్ అధ్యక్షుడిగా, కలెగూర సాగర్ ఉపాధ్యక్షుడిగా,రమాకాంత్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# రీల్

## శ్రీవిష్ణుతో సితార 'ప్రతి యువకుడి కథ'



శ్రీవిష్ణు

ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్, శ్రీవిష్ణు కథానాయకుడిగా ప్రొడక్షన్ నెం.39 ని చేయనున్నట్టు ప్రకటించింది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సన్నీ సంజయ్ రచన , దర్శకత్వం వహిస్తున్నారు.ప్రతి యువకుడి కథ'అనే టైటిల్ ను ఖరారు చేశారు.తనదైన వినోదాత్మక నటనతో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడమే కాకుండా, అన్ని రకాల భావోద్వేగాలను గొప్పగా పలికించగల సామర్థ్యమున్న నటుడిగా పేరుగాంచిన శ్రీ విష్ణు, ఈ సినిమాలో మరో చిరస్మరణీయ పాత్రకు ప్రాణం పోసేందుకు సిద్ధంగా ఉన్నారు. 'అనగనగా'తో ఓటీటీలో అరంగేట్రం చేసి విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకుల మెప్పు పొందిన దర్శకుడు సన్నీ సంజయ్, మరో గొప్ప కథతో రాబోతున్నారు. సున్నితమైన భావోద్వేగాలతో నిండిన, రోజువారీ జీవితాన్ని నిర్వచించే నిశ్శబ్ద సంఘర్షణలు, ఆశలు సంతృప్తిలను అన్వేషించే కథతో మరోసారి ప్రేక్షకుల మనసు దోచుకోబోతున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ సినిమాను సమర్పిస్తున్నారు. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభమవుతుంది.

## మఫ్టీ పోలీస్ నవంబర్ 21న రిలీజ్



యాక్షన్ కింగ్ అర్జున్, ఐశ్వర్య రాజేష్ లీడ్ రోల్స్ లో నటిస్తున్న 'మఫ్టీ పోలీస్'. చిత్రాన్ని నిర్మాత జి. అరుల్ కుమార్ సమర్పణలో జి.ఎస్. ఆరట్స్ నిర్మిస్తోంది. నూతన దర్శకుడు దినేష్ లెట్చుమనన్ దర్శకత్వం వహించారు. ఈ సినేనను నవంబర్ 21న సినిమా విడుదల చేస్తున్నట్టు నిర్మాతలు ప్రకటించారు.ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ థ్రిల్లింగ్ సన్నివేశాలతో అంచనాలను పెంచింది. ఈ చిత్రంలో బిగ్ బాస్ ఫేమ్ అభిరామి, రామ్కుమార్, జి.కె. రెడ్డి, పి.ఎల్. తేనప్పన్, లోగు, వేల రామమూర్తి, తంగదురై, ప్రాంక్స్టర్ రాహుల్, ఓ.ఎ.కె. సుందర్ తదితరులు నటించారు.శరవణన్ అభిమన్యు సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, ఆశివాగన్ సంగీతం అందిస్తున్నారు. లారెన్స్ కిషోర్ ఎడిటర్. అరుణ్ శంకర్ ఆర్ట్ డైరెక్టర్ ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ ఒకేసారి విడుదల కానుంది.



## వరంగల్‌లో ఘనంగా ఆర్ఎస్ బ్రదర్స్ షోరూం ప్రారంభం

### నగరంలో సందడి చేసిన ప్రముఖ సినీ నటి శ్రీలీల




ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : రీటెల్ వ్యాపారంలో బ్రాండ్ ఇమేజ్ సృష్టించిన ఆర్.ఎస్.బ్రదర్స్ దక్షిణ భారతదేశంలో విస్తరణలో భాగంగా గురువారం తెలంగాణలో చారిత్రక వరంగల్ నగరంలో తమ సరికొత్త షోరూమ్ అంగరంగ వైభోగంగా శుభారంభం చేసింది. వ్యాపారరంగంలో ప్రముఖ దార్శనికులైన పి.వెంకటేశ్వర్లు,ఎస్.రాజమౌళి,టి.ప్రసాదరావు, దివంగత పి.సత్యనారాయణ సుదూర దృష్టితో ప్రణాళికాబద్ధంగా నెలకొల్పిన ఆర్.ఎస్.బ్రదర్స్ సంస్థ సంప్రదాయాన్ని, ఆధునిక ఫ్యాషన్లను మేళవించి భారతదేశ వ్యాప్తంగా కొనుగోలుదారులకు చేరువవుతోంది. అందులో భాగంగా వరంగల్‌లోని సరికొత్త షోరూమ్ వైవిధ్య భరితమైన అభిరుచులు కలిగిన నగరవాసుల హృదయాల్ని చూరగొనేలా ప్రారంభించింది. ప్రముఖ సినీతార శ్రీలీల ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతిని వెలిగించి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా నూతన షోరూమ్‌ను సందర్శించి వరంగల్‌లోని షాపింగ్‌ప్రియులకు ఇది అందమైన కొనుగోలు గమ్యంగా నిలుస్తుందని అన్నారు.ఈ సందర్భంగా ఆర్.ఎస్.బ్రదర్స్ రీటెల్ ఇండియా లిమిటెడ్ సంస్థ డైరెక్టర్లు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ వినియోగదారుల అభిరుచుల వైవిధ్యానికి తగినట్లుగా తమ బ్రాండ్ మరింతగా విస్తరిస్తుందని అన్నారు. మారుతున్న పోకడలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నాణ్యతతో, సరసమైన ధరలతో కొత్తదనాన్ని అందించగలమని, ఇతర ప్రాంతాలలో కూడా కొత్త షోరూమ్స్ నెలకొల్పనున్నామని చెప్పారు.వరంగల్‌లో షోరూమ్‌లో విక్రయానికి అందుబాటులో ఉంచిన వస్త్ర వైవిధ్యంలో కుటుంబంలోని అన్ని తరాల అభిరుచులను ప్రతిబింబించే వుమెన్స్‌వేర్, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్ రూ.149ల ప్రారంభ ధరతో కొనుగోలుదారులను ఆకట్టుకున్నాయి. కంచిపట్టు చీరలు, డిజైనర్ లెహెంగాలు మొదలుకుని పర్వదినాల్లో ధరించే కుర్తాలు, ఆకర్షణీయమైన వెస్ట్రన్‌వేర్ వంటివి కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి.ఈ సందర్భంగా సంస్థ ఛైర్‌పర్సన్, హోల్ టైం డైరెక్టర్ పొట్టి వెంకటేశ్వర్లు , తమ వరంగల్ షోరూమ్‌లో వెడ్డింగ్ కలెక్షన్స్, పెళ్లి కుమార్తె సంప్రదాయ వస్త్రాలంకరణకు సంబంధించిన సాధికారికమైన పనితనంలోని ప్రత్యేకత గురించి వివరించారు.సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సీర్ణ రాజమౌళి ' భారతదేశ వ్యాప్తంగా కొనుగోలుదారుల అభిరుచుల్ని, తాజా ఫ్యాషన్లను ప్రతిబింబించే వస్త్రశ్రేణి తమ వద్ద లభిస్తోందని చెప్పారు.హోల్ టైం డైరెక్టర్ తిరువీధుల ప్రసాదరావు వరంగల్‌వాసులకు హృదయపూర్వక స్వాగతం పలుకుతూ వరంగల్‌లోని కొనుగోలుదారులు మెచ్చుకునే వైవిధ్యభరిత వస్త్రశ్రేణి ఆకర్షణీయమైన ఫ్యాషన్లతో, అందుబాటు ధరలలో ఒకే చోట లభిస్తోందని, పండగలు, వివాహాది శుభకార్యాలకు అవసరమైన షాపింగ్ కోసం తమ షోరూమ్‌కి విచ్చేయాల్సిందిగా కోరారు.

## వచ్చే ఏడాది ఏప్రిల్ 3న 'ఫంకీ'

వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయకుడు విశ్వక్ సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఫంకీ'. ఇటీవల విడుదలైన టీజర్‌కు ప్రేక్షకులు ఇచ్చిన అద్భుతమైన స్పందనతో ఉత్సాహంలో ఉన్న 'ఫంకీ' చిత్ర బృందం ఈ సినిమాను 2026 ఏప్రిల్ 3న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. దర్శకుడు కె.వి. అనుదీప్ ఈసారి రెట్టింపు నవ్వులతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమవుతున్నారు. 'జాతిరత్నాలు' సినిమాతో సంచలనాలు సృష్టించిన ఆయన.. మరోసారి విభిన్నమైన కథాంశం, కట్టిపడేసే హాస్యంతో ప్రేక్షకుల మనసు దోచుకోనున్నారు. 'ఫంకీ' చిత్రంలో విశ్వక్ సేన్ సినీ దర్శకుడి పాత్రను పోషిస్తుండటం విశేషం. కొత్త లుక్, కొత్త యాటిట్యూడ్‌తో ప్రేక్షకులను సరికొత్తగా అలరించనున్నారు. ఇప్పటికే టీజర్‌లో ఆయన నటన, ఎనర్జీ, కామెడీ టైమింగ్‌కి ప్రశంసల వర్షం కురిసింది. ఈ సినిమాలో కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో సంగీతం ఈ చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలవనుంది. అద్భుతమైన గీతాలు, నేపథ్య సంగీతంతో భీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకి ప్రధాన బలంగా నిలవనున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్మెంట్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన నిర్మాణ సంస్థల నుంచి వస్తున్న సినిమా కావడంతో, 'ఫంకీ'పై సహజంగానే అంచనాలు ఎక్కువగా ఉంటాయి. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా 'ఫంకీ' చిత్రం ప్రేక్షకులకు నవ్వుల విందుని అందిస్తుందని చిత్ర బృందం హామీ ఇచ్చింది.



## మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర


సుధీర్ బాబు

సుధీర్ బాబు, పవర్హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. ఈ చిత్రంలో శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషించారు. జటాధర నవంబర్ 7న హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో సుధీర్ బాబు మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. చిన్నప్పుడు మనం జానపద, చందమామ కథలు వినుంటాం. బ్యాంకులు లేని సమయంలో ధనాన్ని భూమిలో పాతి ఒక బంధనం వేసి దానికి ఒక పిశాచి కాపలాగా ఉంటుంది' అని ప్రచారంలో ఒక కథ ఉండేది. ఈ కథకు అలాంటి ఒక జానపదం ఆధారం. అలాంటి కథని ప్రజెంట్ టైంలోకి తీసుకొచ్చి ప్రజెంట్ చేశారు. సినిమాలో డిఫరెంట్ ప్లేయర్స్ ఉంటాయి. బాలీవుడ్ స్త్రీ సినిమా వచ్చింది. నిజానికి అది మన సౌత్ ఇండియాలో 'ఓ స్త్రీ రేపు రా' అన్న జానపదం లాంటి కథ. ఘోస్ట్ హంటిం గ్, ఫ్యామిలీ ఎమోషన్, డివోషనల్, శివుడు గురించి కథలు. ఇలా చాలా లేయర్స్ వున్నాయి. అరుణాచల ప్రస్తావన కూడా వుంది. సినిమాలో మన పురాణాల్లో ఉన్న కొన్ని కథలు సొల్యూషన్‌గా ఈ కథను చేయడం జరిగింది. ఈ సినిమా చేయడానికి ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ నాకు చాలా ఎక్సైట్ చేసింది. యాక్షన్, ఫ్యామిలీ, మైథలాజి అన్ని ఎమోషన్స్ కుదిరిన సినిమా ఇది. అయితే తనకి దెయ్యాలు వున్నాయంటే నమ్మకం వుండదు. దేవునిపై నమ్మకం వుంటుంది. సైన్స్‌ని నమ్ముతాను. అలా ఎందుకనేది సినిమాలో చాలా ఆసక్తికరంగా వుంటుంది. జటాధర అనే టైటిల్ వినగానే ఇది డివైన్ సినిమాని తెలుస్తుంది. ఫైనల్‌గా శివుడు వస్తాడని ముందే అర్థమౌతుంది. అయితే ఆ పాయింట్‌కి రీచ్ అయ్యేవరకూ వుండే జర్నీ చాలా ఎక్సైటింగ్‌గా వుంటుంది, ఆడియన్స్‌ని థ్రిల్ చేస్తుంది. టీజర్ ట్రైలర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. బిజినెస్ కూడా చాలా బాగుంది. జి స్టూడియోస్ లాంటి సంస్థ నిర్మాణంలో వుంది ఏ, బి, సి సెంటర్ అనే తేడా లేకుండా అందరికీ నచ్చే సినిమా. ఈ సినిమా ప్రొడ్యూసర్స్ నార్త్ నుంచి వచ్చారు. తెలుగు సినిమా చేద్దామని వచ్చారు. నాతో, నానితో కలిసి సినిమా చేద్దామని వచ్చారు. ఒక కథ చెప్పారు. నాకు అంతగా నచ్చలేదు. కొన్ని రోజుల తర్వాత మీ దగ్గర ఏదైనా కథ ఉంటే చెప్పమన్నారు. అప్పుడు ఈ కథని మేము డెవలప్ చేస్తున్నాం . అలా చెప్పినప్పుడు వాళ్ళకి నచ్చింది. తర్వాత ప్రొడక్షన్ స్టార్ట్ అయింది. సోనాక్షి చాలా అద్భుతమైన నటి. తన లుక్స్ సౌత్ ఇండియన్ లాగే ఉంటాయి. తన నటన అందరినీ ఆకట్టుకుంటుంది. ధనపిశాచి క్యారెక్టర్‌కి చాలా వాల్యుయాడ్ చేశారు. శిల్ప శోభ అనే పాత్రలో కనిపిస్తారు. అద్భుతంగా నటించారు. చాలా హెవీ పెర్ఫార్మన్స్ ఉన్న క్యారెక్టర్ అది. సినిమా తర్వాత తనకి చాలా మంచి అవకాశాలు వస్తాయి. క్యారెక్టర్ విన్నప్పుడు దాన్ని ఎలా ఎచీవ్ చేయాలనే ఆలోచన వుంటుంది. ఇప్పటివరకూ 20 సినిమాలు చేశాను. ఈ జర్నీలో ఒక క్యారెక్టర్‌ని ఎలా అర్థం చేసుకోవాలి? దాని కోసం ఎలా గ్రౌండ్ వర్క్ చేయాలి దానికంటూ ఒక కథను ఎలా మనలో అనుకోవాలి? ఇలా వర్క్ చేసినప్పుడు క్యారెక్టర్‌ను చేయడం ఈజీ గానే ఉంటుంది. నిజానికి ఇందులో శివుడు కనిపించే ఒక ఎపిసోడ్ ఉంది. అక్కడ కృష్ణ గారిని చూపించాలని అనుకున్నాం. కానీ వీఎఫ్ఎక్స్‌కి ఎక్కువ సమయం కుదరలేదు. ఇందులో కృష్ణ గారు గాని మహేష్ గారు గాని కనిపించడం వుండదు. బాలీవుడ్‌లో బాఘీ తర్వాత కొన్ని అవకాశాలు వచ్చాయి. అయితే నా ఫోకస్ ఎప్పుడు తెలుగు సినిమా పైనే ఉంది. రాహుల్ రవీంద్రన్‌తో ఒక సినిమా వుంది. బాహుబలి లాంటి సినిమా. అలాగే పుల్లెల గోపీచంద్ బయోపిక్ కూడా చేయాలి.

# జర్నలిస్టుల సమస్యలు విస్మరిస్తే ఆందోళన తప్పదు

### ప్రభుత్వానికి టియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యవర్గ సమావేశం హెచ్చరిక




ప్రజాపక్షం / హైదరాబాద్ : గత ప్రభుత్వం మాదిరిగానే, ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను విస్మరిస్తే రాష్ట్ర వ్యాపితంగా ఆందోళన బాట పట్టడం తప్పదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) ప్రభుత్వాన్ని హెచ్చరించింది. గురువారం శంకర్ పల్లి మండలం పొద్దటూరులోని ప్రగతి రిసార్ట్స్‌లో టియుడబ్ల్యుజె యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ అధ్యక్షతన రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. జర్నలిస్టుల ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారంలో ప్రభుత్వం నుండి జరుగుతున్న జాప్యంపై కార్యవర్గం సుదీర్ఘంగా చర్చించింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి దాదాపు రెండేళ్లు కావస్తున్నా, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించక పోవడంపై సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. గత ప్రభుత్వం ఇలాంటి వైఖరినే అనుసరిస్తే గల్లీ నుండి ఢిల్లీ దాక తమ సంఘం లెక్కలేనన్ని ఉద్యమాలు చేపట్టిన విషయాన్ని సమావేశం గుర్తుచేసింది. జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఇంటి స్థలాలు, ఆరోగ్య పథకం, అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను వీలైనంత తొందరగా పరిష్కరించాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ అంశంపై ఐజెయు జాతీయ అధ్యక్షులు, మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్చించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఫిబ్రవరి మాసం మొదటి వారంలో విజయవాడలో జరగనున్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) జాతీయ ప్లీనరీని విజయవంతం చేసేందుకు సన్నాహాలు ప్రారంభమైనట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అయితే ఈ ప్లీనరీని పురస్కరించుకుని జనవరి మాసంలో రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాల్లో సదస్సులు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. మహాసభలు పెండింగులో ఉన్న జిల్లాల్లో జనవరి మొదటి వారంలోపు వాటిని పూర్తి చేయాలని సమావేశం నిర్ణయించింది.యూనియన్ నియమించిన ఆయా సబ్ కమిటీల సమావేశాలను త్వరలో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఇటీవల జరిగిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ ఎన్నికల్లో ఫ్రెండ్స్ ప్యానెల్ కు మద్దతు పలికి, ప్యానెల్ గెలుపు కోసం శ్రమించిన రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీతో పాటు ఇతర నాయకులను కార్యవర్గం అభినందించింది. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి టియుడబ్ల్యుజె సమావేశం శుభాకాంక్షలు తెలిపింది. గత కార్యవర్గ సమావేశం తర్వాత యూనియన్ చేపట్టిన వివిధ కార్యక్రమాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ నివేదిక సమర్పించారు. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో అకాల మరణం చెందిన 16మంది జర్నలిస్టులకు సమావేశం నివాళులు అర్పించింది. మృతికి సంతాప సూచికగా మౌనం పాటించింది. రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన రంగారెడ్డి జిల్లా శాఖకు సమావేశం కృతజ్ఞతలు తెలియజేసింది. సమావేశంలో ఐజెయు జాతీయ మాజీ అధ్యక్షులు, స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఎం.ఎ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు కె. సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. సంపత్ కుమార్, గాడిపల్లి మధు గౌడ్, కార్యదర్శులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జి. మధు గౌడ్, కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్ లతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 30 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## హాజరుకండి(మొదటి పేజీ తరువాయి)

గురువారం ఈ విషయాన్ని వెల్లడించారు. అతను సాక్ష్యం చెప్పిన తర్వాత ఏజెన్సీ గతసారిలాగే మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అతని వాంగ్మూల్మాన్ని నమోదు చేస్తుందని ఆ వర్గాలు తెలిపాయి. ఈ ఇడి దర్యాప్తు ఆగస్టు 21న సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) నమోదు చేసిన ఎఫ్ఐఆర్ నుండి వచ్చింది. ఈ కేసులో ముంబయిలోని అంబానీ ప్రాంగణం సహా సిబిఐ సోదాలు కూడా నిర్వహించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఫిర్యాదు ఆధారంగా ముంబయ్‌కి చెందిన రిలయన్స్ కమ్యునికేషన్స్(ఆర్‌కామ్)డైరెక్టర్ అనిల్ డి.అంబానీ, గుర్తుతెలియని ప్రభుత్వ ఉద్యోగులు, గుర్తు తెలియని ఇతరులపై స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎఫ్ఐఆర్ క్రిమినల్ కేసు నమోదు చేసింది. సిబిఐ ఎఫ్ఐఆర్‌లో జత చేయబడిన ఎస్‌బిఐ ఫిర్యాదు ప్రకారం ఆ కంపెనీ వివిధ రుణ దాతలకు 40,000వేల కోట్లకు పైగా బకాయిపడిందని, 2018గణాంకాల ప్రకారం పబ్లిక్ సెక్టార్ బ్యాంక్ మాత్రమే 2929.05 కోట్ల నష్టాన్ని ఎదుర్కొంటోంది. ఆగస్టులో సిబిఐ చర్య తర్వాత అంబానీకి చెందిన ఒక ప్రతినిధి మాట్లాడుతూ ఎస్‌బిఐ దాఖలు చేసిన ఫిర్యాదు 10 సంవత్సరాల కాలం నాటితో కేసులతో ముడిపడిఉందని, ఆ సమయంలో అంబానీ కంపెనీకి నాన్ ఎగ్జిక్యూటివ్‌గా ఉన్నారని, రోజువారీ నిర్ణయంలో ఎటువంటి ప్రమేయం లేదని చెప్పారు. ప్రత్యేకంగా గమనించదగ్గ విషయమేమిటంటే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పటికే తన సొంత ఉత్తర్వు ద్వారా ఐదుగురు నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లకు వ్యతిరేకంగా చర్యలను ఉపసంహరించుకుంది.అయినప్పటికీ దీనిని ఏమాత్రం పట్టించుకోకుండా రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీని ప్రత్యేకంగా ఎంపికచేశారని ఆ ప్రకటన పేర్కొంది. జూలైలో అంబానీ గ్రూప్ కంపెనీల ప్రస్తుత, మాజీ ఎగ్జిక్యూటివ్‌లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించింది. ఆగస్టు మొదటి వారంలో అతనిని (అంబానీ)ప్రశ్నించి స్టేట్‌మెంట్ నమోదు చేసింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఆర్‌ఇన్‌ఫ్రా) సహా అనిల్ అంబానీకి చెందిన బహుళ గ్రూప్ కంపెనీల రూ.17,000 కోట్ల అవకతవకలు సామూహిక రుణ మళ్లింపునకు సంబంధించినవిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రాథమిక దర్యాప్తులో తేలింది. 2017 మరియు 2019మధ్య కాలంలో అంబానీ గ్రూప్‌కంపెనీలకు వైఇఎస్ (ఎస్) బాంక్ దాదాపు రూ.3,000 కోట్ల అక్రమ రుణ మళ్లింపు ఆరోపణ సహా ఇందులో ఉంది. అంబానీ గ్రూప్ కంపెనీలపై దర్యాప్తులో భాగంగా ఏజెన్సీ ఇటీవల రూ.7,500 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. వీటిలో ముంబైలోని పాలీహిల్ ప్రాంతంలో వ్యాపారవేత్త నివాసం, ఢిల్లీలో ఉన్న రిలయన్స్ సెంటర్ భూమి సహా వీటిలో ఉన్నాయి.

## ఓట్ల చోరీకి యత్నం
(మొదటి పేజీ తరువాయి)

'జంగిల్ రాజ్' గురించి మాట్లాడుతున్నారు... కానీ, ఢిల్లీలో 'జంగిల్ రాజ్' విధించినది ప్రధాని, అమిత్ షా అని, మొత్తం దేశం, ఇది ఇడి, సిబిఐ,ఐటి, ద్వేషం, నిరుద్యోగ పాలనను చవి చూస్తోందని, ఇదే నిజమైన ఆటవిక రాజ్యమని రాహుల్ మండిపడ్డారు. ప్రధాని బిహార్, దేశంలో ప్రజలలో ద్వేషాన్ని వ్యాపింపజేస్తున్నారన్నారు. ఆయన కులం, మతం ఆధారంగా ప్రజలలో చీలిక సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ఇక ప్రస్తుత బిహార్ ముఖ్యమంత్రి రాష్ట్ర యువతను కార్మికులుగా మారుస్తున్నారని ఆరోపించారు.

### ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు ప్రభుత్వంతో ఇసి కుమ్మక్కు : ప్రియాంకాగాంధీ

ఎన్నికల కమిషన్ (ఇసి) మన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య హక్కులను బలహీనపరిచేందుకు ప్రభుత్వంతో కుమ్మక్కవుతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా ఆరోపించారు. హర్యానాలో చేసినట్లుగానే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఎన్‌డిఎ దొంగతనం చేయడానికి సిద్ధమవుతోందన్నారు. గురవారం ఆమె సీతామరి, తూర్పు చంపారన్ జిల్లాల్లో జరిగిన బహిరంగ ర్యాలీలనుద్దేశించి ప్రసంగించారు. హర్యానాలో మొత్తం ఎన్నికలను దొంగిలించినట్లే, బిహార్‌లో 65 లక్షల ఓట్లను జాబితా నుండి తొలగించడం ద్వారా ఇక్కడ కూడా అదే పని చేయడానికి సిద్ధమవుతున్నారన్నారు. అయితే రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం ప్రజల కోసం, సత్యం కోసమని, మహాత్మా గాంధీ ఒకప్పుడు పోరాడిన అదే యుద్ధంలో ఆయన పోరాడుతున్నారని ప్రియాంకాగాంధీ ఉద్ఘాటించారు. దేశానికి ద్రోహం చేస్తున్న వారిని ప్రజలు ఎప్పటికీ మరచిపోరన్నారు. ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, వివేక్ జోషి, ఎస్. ఎస్. సంధు భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. పదవీ విరమణ తర్వాత సౌకర్యవంతమైన జీవితాన్ని గడుపుతారని అనుకుంటే, అది జరగని పని అని ఆమె జోస్యం చెప్పారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా జరిగితే ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని గద్దె దించి పేదలు, మహిళలు, యువత కోసం పనిచేసే ప్రభుత్వం వస్తుందన్నారు. దేశాభివృద్ధికి అపారమైన కృషి చేసిన బిహార్ ప్రజల పట్ల ఎన్‌డిఎ ప్రభుత్వానికి గౌరవం లేదని ఆమె ఆరోపించారు. అభివృద్ధి కోసం కాకుండా మతం పేరుతో ఎన్‌డిఎకు ఓటు వేయమని బిజెపి నాయకులు ప్రజలను కోరుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పేలవమైన మౌలిక సదుపాయాల పట్ల ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, గత మూడు సంవత్సరాలలో 27 వంతెనలు కూలిపోయాయని మండిపడ్డారు. మోదీ భారత్‌కు ప్రధాని అని, పోస్టర్లపై ప్రతిపక్ష నాయకుల చిత్రాల పరిమాణాన్ని కొలవడం తప్ప ఆయనకు వేరే పని లేదా? అని ప్రశ్నించారు.









Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com